www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 27-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 299 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి రా. 8.35 తదుపరి చతుర్దశి; నక్షత్రం: మూల ఉ. 9.02 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ.7.23-9.02, రా.6.36-8.12; దుర్ముహూర్తం: మ.12.50-1.35, మ.3.04-3.49; అమృతఘడియలు: తె.4.10-5.46; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.04 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్పోర్ట్స్


త్రిష (40)

సెమీస్‌లో భారత్

అండర్-19 టీ20 వరల్డ్‌కప్

- చెలరేగిన బౌలర్లు
- బంగ్లాదేశ్ 64 ఆలౌట్
- రాణించిన త్రిష

కౌలాలంపూర్: అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత మహిళల జట్టు వరుసగా నాలుగో విజయాన్నందుకుంది. దీంతో సెమీఫైనల్లోనూ చోటు దక్కించుకుంది. సూపర్ సిక్స్ గ్రూప్ 1లో భాగంగా ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో నెగ్గింది. బౌలింగ్‌లో లెఫ్టామ్ స్పిన్నర్ వైష్ణవి శర్మ (3/15) ప్రత్యర్థిని కట్టడి చేయగా.. బ్యాటింగ్‌లో తెలుగు తేజం ఓపెనర్ జి. త్రిష (40) మరోసారి తన ఫామ్‌ను చాటుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 64 పరుగులు మాత్రమే చేసింది. 22 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయినా.. కెప్టెన్ సుమయ్యా అక్తర్ (21 నాటౌట్), జన్నతుల్ మౌవా (14) ఆరో వికెట్‌కు 31 పరుగులు జోడించారు. త్రిష, షబ్నం, జోషితలకు ఒక్కో వికెట్ దక్కింది. ఆ తర్వాత స్వల్ప ఛేదనను భారత్ 7.1 ఓవర్లలో 66/2 స్కోరుతో అలవోకగా పూర్తి చేసింది. బంగ్లా బౌలర్లపై 8 ఫోర్లతో చెలరేగిన ఓపెనర్ త్రిష ఏడో ఓవర్‌లో వెనుదిరిగింది. మరోవైపు గ్రూప్ 1లోనే శ్రీలంక-స్కాట్లాండ్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా టాస్ వేయకుండానే రద్దయ్యింది. కాగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు ఇప్పటికే సెమీస్‌కు చేరుకున్నాయి.

సిన్నర్.. మళ్లీ విన్నర్

వరుసగా రెండోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ కైవసం

టోర్నీ ఆరంభం నుంచి ప్రదర్శించిన దూకుడును వరల్డ్ నెం.1 జానిక్ సిన్నర్ చివరిదాకా కొనసాగించాడు. డిఫెండింగ్ చాంపియన్ ముద్రకు వన్నె తెస్తూ మరోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. రెండో సీడ్ జ్వెరేవ్‌తో ఫైనల్‌ను వరుస సెట్లలో ముగించి విజేతగా నిలిచాడు. ఈక్రమంలో ఇటలీ కుర్రాడు ఎన్నో రికార్డులను సొంతం చేసుకున్నాడు.

ఫైనల్లో జ్వెరేవ్ ఓటమి


విజేతకు రూ. 30.16 కోట్లు
రన్నరప్‌నకు రూ. 16.37 కోట్లు

మెల్‌బోర్న్: టాప్ సీడ్ జానిక్ సిన్నర్ అంచనాలను నిలబెట్టుకున్నాడు. వరుసగా రెండో ఏడాదీ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సిన్నర్ (ఇటలీ) 6-3, 7-6 (4) 6-3తో రెండో సీడ్ అలెగ్జాండ్ జ్వెరేవ్ (జర్మనీ)ని చిత్తు చేశాడు. తద్వారా 23 ఏళ్ల సిన్నర్.. 1992-93లో జిమ్ కొరియర్ తర్వాత పిన్న వయస్సులో వరుసగా రెండుసార్లు మెల్‌బోర్న్ పార్క్ విజేతగా నిలిచిన రికార్డును అందుకున్నాడు. మరోవైపు మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్లోనూ జ్వెరేవ్‌కు ఓటమి తప్పలేదు. ఇంతకుముందు 2020 యూఎస్ ఓపెన్, 2024 ఫ్రెంచ్ ఓపెన్ తుదిపోరులో జర్మనీ ఆటగాడికి నిరాశే ఎదురైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ పోరులో నెం.1, నెం.2 సీడెడ్‌లు తలపడడం 2019 తర్వాత ఇదే తొలిసారి. ఆ సంవత్సరం నెం.1 నొవాక్ జొకోవిచ్ కూడా వరుస సెట్లలో నెం.2 రఫెల్ నడాల్‌ను ఓడించడం గమనార్హం. 2024 ప్రారంభం నుంచి సిన్నర్ ఐదు ప్రధాన టోర్నీలలో మూడింటిలో టైటిళ్లు కైవసం చేసుకున్నాడు. ఇందులో నిరుటి యూఎస్ ఓపెన్ కూడా ఉంది. ఇక ఈ సమయంలో జానిక్ గెలుపోటముల రికార్డు 80-6కాగా మొత్తం తొమ్మిది టోర్నీలలో విజేతగా నిలిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ సహా గత 21 మ్యాచ్‌ల్లో వరుస విజయాలు సాధిస్తూ వచ్చాడు. ఇంకా..ఓపెన్ ఎరా (1968లో ప్రారంభం)లో.. కెరీర్ ఆరంభంలో ఆడిన 3 గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లోనూ నెగ్గిన ఎనిమిదో ఆటగాడిగా జానిక్ చరిత్ర సృష్టించాడు.

సునాయాసంగా..: మ్యాచ్ ప్రారంభం నుంచే జానిక్ సిన్నర్ జోరు కనబర్చాడు. అద్భుతమైన పవర్, నెట్ ప్లేతో జ్వెరేవ్‌ను బెంబేలెత్తించాడు. అయితే రెండో సెట్లో జ్వెరేవ్ కొంతమేర సిన్నర్‌ను ప్రతిఘటించాడు. ఇక..కోర్టు నలుమూలలనుంచి షాట్లు సంధించిన జానిక్ సులువుగా మొదటి సెట్ నెగ్గాడు. జ్వెరేవ్ పుంజుకొని పోరాడడంతో రెండో సెట్ ఉత్కంఠ భరితమైంది. రెండో సెట్‌లో ఓ దశలో జ్వెరేవ్ 5-4తో ముందంజలో నిలిచాడు. కానీ తేరుకున్న సిన్నర్ వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 5-5తో స్కోరు సమం చేయడంతోపాటు సెట్‌ను టైబ్రేకర్‌కు మళ్లించాడు. టైబ్రేకర్‌లో తిరుగులేని స్థితిలో నిలిచి సెట్‌ను చేజిక్కించుకున్నాడు. అదే ఊపుతో మూడో సెట్‌లో మ్యాచ్‌లో జయకేతనం ఎగుర వేశాడు. 2 గంటల 42 నిమిషాల ఈ మ్యాచ్‌లో జ్వెరేవ్ 12 ఏస్‌లు సంధించగా, జానిక్ ఆరింటికే పరిమితమయ్యాడు. ఇద్దరూ చెరో రెండు డబుల్‌ఫాల్ట్‌లు చేయగా, విన్నర్లలో ప్రత్యర్థి (25)పై జానిక్ (32) ఆధిక్యం చూపాడు.

సినియకోవా జోడీకి డబుల్స్ కిరీటం

టాప్ సీడ్ సినియకోవా (చెక్ రిపబ్లిక్)/టేలర్ టౌన్‌సెండ్ (అమెరికా) జోడీ మహిళల డబుల్స్ ట్రోఫీని గెలుచుకుంది. ఫైనల్లో సినియకోవా/టేలర్ జంట హీ సూవీ (తైవాన్)/జెలెనా ఓస్టాపెంకో (లాత్వియా) ద్వయాన్ని ఓడించింది.



జ్యోతి 'రికార్డు' స్వర్ణం

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): తెలుగు అథ్లెట్ జ్యోతి యర్రాజి ఈ ఏడాది పోటీపడ్డ తొలి రేసులోనే సత్తా చాటింది. ఫ్రాన్స్‌లోని నాన్‌టెస్‌లో జరిగిన ఎలీట్ ఇండోర్ మీటింగ్ టోర్నీలో విశాఖపట్నానికి చెందిన జ్యోతి 60 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణం సాధించింది. అది కూడా జాతీయ రికార్డు టైమింగ్‌తో విజేతగా నిలిచింది. వరల్డ్ అథ్లెటిక్స్ ఇండోర్ టూర్ లెవెల్ మీట్‌లో భాగంగా జరిగిన ఈ రేసులో జ్యోతి రెండుసార్లు తన జాతీయ రికార్డును అధిగమించడం విశేషం. తొలుత హీట్స్‌లో 8.07 సెకన్ల టైమింగ్ నమోదు చేసిన జ్యోతి.. ఫైనల్స్‌లో ఏకంగా 8.04 సెకన్లలోనే గమ్యాన్ని చేరుకుంది. ఈ క్రమంలో గతంలో తన పేరిటనున్న 8.12 సెకన్ల ప్రదర్శనను జ్యోతి మరింత మెరుగుపరచుకుంది. అయితే, ఈ ఏడాది మార్చిలో చైనాలో జరిగే ప్రపంచ ఇండోర్ చాంపియన్‌షిప్‌కు అర్హత మార్క్ 7.84 సెకన్ల టైమింగ్‌ను మాత్రం ఇంకా అందుకోవాల్సి ఉంది. ఇక, ఇదే టోర్నీ పురుషుల 60 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌లో భారత అథ్లెట్ తేజాస్ షిర్సే 7.68 సెకన్ల టైమింగ్‌తో కాంస్య పతకం అందుకున్నాడు.

మీ 5 లక్షలు మాకొద్దు!

తిరస్కరించిన కర్ణాటక ఖో-ఖో క్రీడాకారులు

మహారాష్ట్రలో రూ.2.50 కోట్ల ప్రోత్సాహకం

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఖో-ఖో ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు క్రీడాకారులు గౌతమ్, చైత్ర రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సన్మానం చేసి.. ప్రకటించిన రూ.5 లక్షల ప్రోత్సాహకాన్ని తిరస్కరిస్తున్నట్లు చెప్పారు. క్రికెట్, ఫుట్‌బాల్ తరహాలోనే ఖో-ఖో ఆటకు ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు. ఖో-ఖో ప్రపంచకప్ విజేత జట్టు సభ్యులకు మహారాష్ట్ర ప్రభుత్వం రూ.2.25 కోట్ల పారితోషికం, ఎ-గ్రేడ్ ఉద్యోగం ప్రకటించిందని తెలిపారు. కాగా క్రీడామంత్రి నాగేంద్ర అవినీతి ఆరోపణలతో గతేడాది జూన్‌లో పదవి నుంచి దిగిపోవడంతో ప్రస్తుతం ఆ శాఖ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వద్దే ఉంది. ఇదిలావుండగా రాష్ట్ర ప్రభుత్వ తీరుపై జేడీఎస్ తీవ్రంగా మండిపడింది. వరల్డ్‌కప్ నెగ్గిన క్రీడాకారులకు చిల్లరకాసులు పడేశారని విమర్శించింది. క్రీడాకారుల తిరస్కరణతోనైనా ప్రభుత్వానికి సిగ్గురావాలని పేర్కొంది.


సీఎంతో చైత్ర, గౌతమ్

బంగర్ శిక్షణలో విరాట్

ముంబై: స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దేశవాళీ క్రికెట్ ద్వారా ఫామ్ అందుకోవాలనుకుంటున్నాడు. బీసీసీఐ కఠిన నిర్ణయం ప్రకారం భారత జట్టు ఆటగాళ్లంతా దేశవాళీల్లో ఆడుతున్న విషయం తెలిసిందే. అయితే మెడనొప్పి కారణంగా ఢిల్లీ తరఫున సౌరాష్ట్రతో రంజీ మ్యాచ్‌లో విరాట్ ఆడలేదు. ఈనెల 30 నుంచి రైల్వేస్‌పై విరాట్ బరిలోకి దిగనున్నాడు. ఈనేపథ్యంలో మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ శిక్షణలో విరాట్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. ముంబైలో శనివారం వీరిద్దరు నెట్స్‌లో ఉన్న వీడియో సోషల్ మీడియాలో దర్శనమిచ్చింది. ఇందులో విరాట్ బ్యాక్‌ఫుట్ ఆటపై బంగర్ దృష్టి సారిస్తూ బంతులు విసిరాడు. సహజంగా కోహ్లీ ఫ్రంట్‌ఫుట్ ఆడేందుకు ఇష్టపడుతుంటాడు. 2014-2019 మధ్య కాలంలో బంగర్ భారత జట్టు బ్యాటింగ్ కోచ్‌గా పనిచేశాడు. ఆ సమయంలో విరాట్ సగటు 55.10గా ఉండడం విశేషం.


బంగర్, కోహ్లీ (ఫైల్ ఫొటో)

హైదరాబాద్ ఇన్నింగ్స్ విజయం

- తనయ్‌కు 6 వికెట్లు
- హిమాచల్‌తో రంజీ

హైదరాబాద్: తనయ్ త్యాగరాజన్ (6/118) ఆరు వికెట్లతో విజృంభించడంతో.. ఈ రంజీ సీజన్‌లో హైదరాబాద్ రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-బిలో ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 43 పరుగుల తేడాతో హిమాచల్ ప్రదేశ్‌ను చిత్తు చేసింది. 290 పరుగుల లోటుతో ఫాలో ఆన్ ఆడిన హిమాచల్ రెండో ఇన్నింగ్స్‌లో 247 పరుగులకు ఆలౌటైంది. శుభమ్ అరోరా (66) అర్ధ శతకం సాధించాడు. అనికేత్ రెడ్డి 4 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 565, హిమాచల్ 275 పరుగులు చేశాయి.

దేశం నాకెంతో ఇచ్చింది!

పద్మభూషణ్ అవార్డుపై శ్రీజేష్



న్యూఢిల్లీ: హాకీకి తాను చేసిన సేవకంటే.. దేశం తనకు ఎంతో ఎక్కువ ఇచ్చిందని మాజీ గోల్‌కీపర్ శ్రీజేష్ అన్నాడు. కేంద్ర ప్రభుత్వం తనకు ప్రతిష్ఠాత్మక పౌరపురస్కారం 'పద్మభూషణ్' ప్రకటించిన నేపథ్యంలో శ్రీజేష్ ఈ వ్యాఖ్యలు చేశాడు. 'గతం మొత్తం ఒక్కసారి అలా కళ్లముందు తిరిగింది. 20 ఏళ్లుగా హాకీకి నేను చేసిన దానికంటే.. దేశం నాకెంతో ఎక్కువ ఇచ్చింది. పద్మభూషణ్ లాంటి అత్యున్నత పురస్కారం ప్రకటించడం ఇంకా కలగానే అనిపిస్తోంది. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ తర్వాత ఈ అవార్డును అందుకోనుండడం నిజంగా నా అదృష్టం' అని శ్రీజేష్ చెప్పాడు. రిటైర్మెంట్ తర్వాత అతడు భారత జూనియర్ జట్టుకు కోచ్‌గా పనిచేస్తున్నాడు.

హరి, అర్జున్‌కు డ్రా

విక్‌ఆన్ జీ: టాటా స్టీల్ మాస్టర్స్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్లు పెంటేల హరికృష్ణ, అర్జున్ ఇరిగేసి ఎనిమిదో రౌండ్‌ను డ్రాగా ముగించారు. ఆదివారం అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో జరిగిన గేమ్‌ను హరి 30 ఎత్తుల తర్వాత డ్రాకు అంగీకరించాడు. అలెక్సీ సరానా (సెర్బియా)తో గేమ్‌ను అర్జున్ 23 ఎత్తుల అనంతరం డ్రా చేసుకున్నాడు. గుకేష్, ప్రజ్ఞానంద మధ్య జరిగిన గేమ్ కూడా డ్రాగా ముగిసింది. 8 రౌండ్ల తర్వాత గుకేష్, ప్రజ్ఞానంద చెరో 5.5 పాయింట్లతో..హరి 4, అర్జున్ 2 పాయింట్లతో ఉన్నారు.

ఐసీసీ.. ఓ ఈవెంట్ కంపెనీ

ఇయాన్ చాపెల్ విమర్శ



సిడ్నీ: ఐసీసీ క్రికెట్‌ను నడపలేదని, అది ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలా వ్యవహరిస్తోందని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ విమర్శించాడు. అలాగే బీసీసీఐ చేతిలో బొమ్మలా మారిపోయిందని, వారికి అనుకూలంగా క్రికెట్ షెడ్యూల్‌ను సైతం మార్చే పరిస్థితికి దిగజారిందని ఆరోపించాడు. ధనిక క్రికెట్ బోర్డుల హవా నడుస్తోందని, వారికి తగ్గట్టుగానే కార్యకలాపాలుంటున్నాయని తెలిపాడు. ఐసీసీ తీరు మారకపోతే ఆ బోర్డులు తమకిష్టమైన రీతిలోనే క్రికెట్ షెడ్యూల్‌ను ఏర్పాటు చేసుకుంటాయని చాపెల్ హెచ్చరించాడు.

పాక్ లక్ష్యం 254.. ప్రస్తుతం 76/4

ముల్తాన్: వెస్టిండీస్‌తో రెండో టెస్ట్‌లో పాకిస్థాన్ ఇక్కట్లలో పడింది. 254 పరుగుల లక్ష్యంతో రెండోరోజైన ఆదివారం రెండో ఇన్నింగ్స్ చేపట్టిన పాక్ ఆట ఆఖరికి 76/4 స్కోరు చేసింది. అంతకుముందు వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 244 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 163, పాకిస్థాన్ 154 పరుగులు చేశాయి.

బిజినెస్

జీవిత బీమాతో ఎన్ఆర్ఐలకు ధీమా

దేశీయ కంపెనీల పాలసీలే ముద్దు

కొన్ని సమస్యలున్నా మన ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోంది. 2030 నాటికి మన ఆర్థిక వ్యవస్థ జపాన్, జర్మనీలను పక్కకు నెట్టి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని అంచనా. ఇందులో ప్రవాస భారతీయుల (ఎన్ఆర్ఐ) పాత్ర ఎంతో ఉంది. ప్రస్తుతం వివిధ దేశాల్లో దాదాపు 3.2 కోట్ల మంది ఎన్ఆర్ఐలు నివసిస్తున్నారు. దేశ జనాభాలో వీరి సంఖ్య ఒక శాతం మాత్రమే. అయితే జీడీపీలో వీరి వాటా 3.4 శాతం వరకు ఉంది. ఇది ఏటా 6 శాతం చొప్పున పెరుగుతోంది. గత ఏడాది వీరు ఆయా దేశాల్లో చెమటోడ్చి సంపాదించిన తమ సంపాదనలో 12,900 కోట్ల డాలర్లు (సుమారు రూ.11.12 లక్షల కోట్లు) స్వదేశానికి పంపించారు. ప్రపంచంలో మరే దేశ ప్రవాసులు ఇంత పెద్ద మొత్తంలో నిధులను స్వదేశానికి పంపడం లేదు. ఆ ఘనత మన ఎన్ఆర్ఐలకే దక్కుతుంది. ఎన్ఆర్ఐలు ఇప్పుడు జీవిత బీమాతో సహా అనేక రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు.

అవసరానికి తగ్గట్టు పాలసీలు

మన జీవిత బీమా కంపెనీలు అనేక రకాల పాలసీలు అందిస్తున్నాయి. ఎన్ఆర్ఐలతో సహా ఎవరికి వారు తమ అవసరానికి తగ్గట్టు ఈ పాలసీలను ఎంచుకోవచ్చు. టర్మ్ పాలసీల ద్వారా తమకు ఏదైనా జరగరానిది జరిగితే నామినీగా ఉండే కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత కల్పించవచ్చు. యూనిట్ లింక్డ్ ప్లాన్స్ (యులిప్స్)తో మార్కెట్ ఆధారిత రాబడుల ద్వారా సంపద సృష్టి, లైఫ్ కవరేజీ లభిస్తాయి. స్థిరమైన ఆదాయంతో తమ రిటైర్మెంట్ జీవితాన్ని భారత్‌లోనే గడపాలనుకునే ఎన్ఆర్ఐలు యాన్యుటీ పథకాలు ఎంచుకోవచ్చు. ఎన్ఆర్ఐల పెట్టుబడులు, పొదుపు, రిటైర్మెంట్, ప్రొటెక్షన్ అవసరాలకు అనుగుణంగా జీవిత బీమా కంపెనీలు పాలసీలు అందిస్తున్నాయి.

- రాజేశ్ కృష్ణన్, చీఫ్ ఆపరేషన్స్ (కస్టమర్ ఎక్స్‌పీరియన్స్), బజాజ్ అలియాంజ్ లైఫ్

ఎంఎఫ్‌లకు 'ఈక్విటీ' ధమాకా

- 2024లో రూ.4 లక్షల కోట్లు
- ఒక్క సిప్‌ల ద్వారానే రూ.2.5 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: గత ఏడాది (2024) దేశంలోని ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)కు బాగానే కలిసొచ్చింది. ఈ పథకాల ద్వారా ఎంఎఫ్ పరిశ్రమ గత ఏడాది రికార్డు స్థాయిలో రూ.3.94 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. అంతకు ముందు సంవత్సరం సమీకరించిన రూ.1.61 లక్షల కోట్లతో పోలిస్తే ఇది రూ.2.33 లక్షల కోట్లు ఎక్కువ. దీంతో 2024 డిసెంబరు నాటికి ఈక్విటీ పథకాల ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.30.57 లక్షల కోట్లకు చేరింది. 2023 డిసెంబరుతో పోలిస్తే ఇది రూ.8.77 లక్షల కోట్లు ఎక్కువ. గత ఏడాది ఈక్విటీ పథకాల్లోకి వచ్చిన రూ.3.94 లక్షల కోట్ల పెట్టుబడుల్లో రూ.2.5 లక్షల కోట్లు క్రమానుగత పెట్టుబడుల (సిప్) ద్వారా సమకూరాయి.



ఈ ఏడాది కష్టమే: అయితే ప్రస్తుత సంవత్సరం (2025) ఈ పెట్టుబడులు అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. మార్కెట్ ఆటుపోట్ల కారణంగా గత ఏడాది డిసెంబరు నుంచే ఈ పథకాల్లోకి పెట్టుబడుల వేగం తగ్గినట్టు జెర్మినేట్ ఇన్వెస్టర్ సర్వీసెస్ సీఈఓ సంతోష్ జోసెఫ్ చెప్పారు. సాధారణంగా ఈ పథకాల్లోకి పెట్టుబడులు మార్కెట్ పనితీరుపై ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం స్టాక్ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. దీంతో ఈ సంవత్సరం కొత్త ఈక్విటీ పథకాలు కూడా మార్కెట్‌కు పెద్దగా రాకపోవచ్చని భావిస్తున్నారు. అయితే దీర్ఘకాలిక మదుపరులకు మాత్రం ప్రస్తుత మార్కెట్ అత్యంత అనువైందనే అంచనాలు వినిపిస్తున్నాయి.

సెబీ డిజిటల్ నాలెడ్జ్ రిపాజిటరీ

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మరో కీలక చర్య తీసుకుంది. ధరోహర్ పేరుతో ఆదివారం ప్రత్యేక డిజిటల్ నాలెడ్జ్ రిపాజిటరీ ప్రారంభించింది. ఈ రిపాజిటరీలో దేశ క్యాపిటల్ మార్కెట్‌కు సంబంధించిన సమస్త సమాచారం డిజిటల్ రూపంలో లభిస్తుంది. 150 ఏళ్ల దేశ సెక్యూరిటీస్ మార్కెట్లో ఇదో ప్రధాన మైలురాయి అని సెబీ పేర్కొంది. విద్యార్థులు, మదుపరులు, పరిశోధకులు, పాత్రికేయులు, మార్కెట్ వర్గాలు, సాధారణ ప్రజలు ఎవరైనా ఈ రిపాజిటరీలోని సమస్త సమాచారాన్ని వినియోగించుకోవచ్చు.

- డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లాభం వార్షిక ప్రాతిపదికన 53 శాతం తగ్గి రూ.339 కోట్లకు పడిపోయింది. సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ ఆదాయం రూ.11,123 కోట్లుగా ఉంది. కాగా బ్యాంక్ తొలి ఫస్ట్ ఎర్న్ రూపే క్రెడిట్ కార్డ్‌ను విడుదల చేసింది. ఫిక్స్‌డ్ డిపాజిట్ ఆధారంగా ఈ కార్డును బ్యాంక్ అందించనుంది.
- ఇసుజు మోటార్స్ ఇండియా.. తెలంగాణలో తన కార్యకలాపాలను విస్తరించింది. ఇందులో భాగంగా ఖమ్మంలో ఇసుజు ఆథీకృత సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో కంపెనీకి మూడో సర్వీస్ సెంటర్.
- ఇన్-విట్రో డయాగ్నోస్టిక్ సంస్థ ఎర్బా ట్రాన్స్‌ఏషియా గ్రూప్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడ్వాన్స్‌డ్ హెమటాలజీ అనలైజర్‌ను తీసుకువచ్చింది. రక్త రుగ్మతలకు సంబంధించి ముందస్తు, కచ్చితమైన నిర్ధారణ, సమాచారం కోసం ఎర్బా హెచ్7100 అనలైజర్‌ను అందుబాటులోకి తెచ్చింది.

ఈ త్రైమాసికంలోనే 'హైడ్రోజన్' ట్రక్

టాటా మోటార్స్ ఈడీ గిరీశ్ వాఘ్



న్యూఢిల్లీ: టాటా మోటార్స్ మరో వినూత్న ప్రయోగానికి సిద్ధమవుతోంది. పూర్తిగా హైడ్రోజన్‌తో నడిచే వాణిజ్య వాహనం (సీవీ) 'టాటా ప్రైమా హెచ్.28' ట్రక్కును ఈ త్రైమాసికంలో ప్రయోగాత్మకంగా జంషెడ్‌పూర్-కళింగనగర్, ముంబై-అహ్మదాబాద్, ముంబై-పుణె మార్గాల్లో నడపబోతోంది. కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీశ్ వాఘ్ ఈ విషయం వెల్లడించారు. ఇటీవల ఢిల్లీలో ముగిసిన 'భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో-2025'లో టాటా మోటార్స్ ఈ ట్రక్కును ప్రదర్శించింది. ఒకసారి ఇంధనం నింపితే 550 కిలోమీటర్ల వరకు ఈ ట్రక్కుకు మళ్లీ ఇంధనం నింపాల్సిన అవసరం ఉండదు. ఈ పరీక్షలు విజయవంతమైతే వాణిజ్య స్థాయిలో ఈ ట్రక్కులను పెద్దఎత్తున మార్కెట్లో ప్రవేశపెట్టాలని కంపెనీ భావిస్తోంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)తో కలిసి టాటా మోటార్స్ ఈ ట్రక్కును అభివృద్ధి చేసింది.

23,400 పైన బుల్లిష్

ఆస్ట్రో గైడ్

(జనవరి 27-31 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,436-22,977 పాయింట్ల మధ్యన కదలాడి 111 పాయింట్ల నష్టంతో 23,092 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,169, 23,217, 23,328, 23,622 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,400
బ్రేక్‌డౌన్ స్థాయి: 22,800
నిరోధ స్థాయిలు: 23,300, 23,400, 23,500 (23,200 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,900, 22,800, 22,700 (23,000 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	465	విజయవాడ	480
వరంగల్	467	గోదావరి	475
చిత్తూరు	523	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	136
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	112
కర్నూలు	120	నెల్లూరు	117
విశాఖపట్నం	127	అనంతపురం	117
గోదావరి	136		

ఆటుపోట్లు తప్పవు!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బడ్జెట్ సమీపిస్తుండటం, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో కొన్ని రంగాల షేర్లకు ఆటుపోట్లు ఎదురుకావచ్చు. ప్రస్తుతం నిఫ్టీ 23,000-23,350 శ్రేణిలో కదలాడుతోంది. మరికొన్ని రోజులు ఇదే స్థాయిలో నిలకడగా రాణిస్తే అక్యుములేషన్ మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. డాలర్ ఇండెక్స్, రూపాయి బలహీనత క్రమంగా తగ్గుతోంది. బంగారం జీవితకాల గరిష్ఠాన్ని చేరుతుండటం అంతర్జాతీయంగా అనిశ్చితిని సూచిస్తోంది. కంపెనీల ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ సంకేతాలను అనుసరించి ట్రేడర్లు పొజిషన్ తీసుకోవటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

ఎంఫసిస్: ప్రస్తుతం ఐటీ స్టాక్స్ జోరును ప్రదర్శిస్తున్నాయి. మెరుగైన ఫలితాలు విడుదల చేయటంతో ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం భారీ వాల్యూమ్‌తో 3.5 శాతం మేర పెరిగింది. పైగా కీలక స్థాయి వద్ద మద్దతు లభించింది. గత శుక్రవారం రూ.3,009 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,950 స్థాయి వద్ద పొజిషన్ తీసుకుని రూ.3,150 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,910 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

లారస్ ల్యాబ్స్: ఈ ఫార్మా స్టాక్ నిఫ్టీతో పోలిస్తే జోరును ప్రదర్శిస్తోంది. కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. పైగా 2022 నాటి గరిష్ఠ స్థాయికి చేరుకుంది. గత వారం మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించటంతో ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ భారీగా పెరిగింది. గత శుక్రవారం 2.99 శాతం లాభంతో రూ.602 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.590 వద్ద పొజిషన్ తీసుకుని రూ.660/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.560 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్: ప్రస్తుతం ఈ షేర్లు అక్యుములేషన్ జోన్‌లో ఉన్నాయి. సుదీర్ఘకాలంగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ స్టాక్స్ ఇప్పుడు కీలకమైన రూ.550 వద్ద మద్దతు తీసుకున్నాయి. ఈ ఏడాది ఆరంభం నుంచి 13 శాతం మేర పెరిగాయి. గత శుక్రవారం ఈ షేరు 2.10 శాతం లాభంతో రూ.594 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.580 వద్ద పొజిషన్ తీసుకుని రూ.650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.565 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విప్రో: ఈ షేరు జీవితకాల గరిష్ఠం వైపు పరుగులు తీస్తోంది. తాజా ఆర్థిక ఫలితాల తర్వాత మంచి వాల్యూమ్‌తో పెరుగుతోంది. గత శుక్రవారం రూ.320 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో రూ.310/300 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.410/450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.285 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఏసీసీ: జీవితకాల గరిష్ఠం నుంచి 30 శాతం మేర కరెక్షన్ అయిన ఈ షేరు ప్రస్తుతం కీలకమైన రూ.1,850 వద్ద మద్దతు తీసుకుంది. కొద్దిగా స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.2,058 వద్ద ముగిసిన కౌంటర్‌లో మదుపరులు రూ.2,020 వద్ద పొజిషన్ తీసుకుని రూ.2,200 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,980 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

23,000 వద్ద గట్టి పరీక్ష

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ ఈ వారంలో మరింత అప్రమత్త ట్రెండ్‌లో కొనసాగే అవకాశం ఉంది. మరోసారి ప్రధాన మానసిక అవధి 23,000 స్థాయికి చేరువవుతోంది. వారం రోజుల్లో ఈ స్థాయి వద్ద పరీక్ష ఎదుర్కొనడం ఇది నాలుగోసారి కావడంతో భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బుల్లిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో కీలక స్థాయి 23,000 వద్ద మద్దతు తీసుకుని కన్సాలిడేట్ కావాలి. తదుపరి ప్రధాన నిరోధం 23,200. ఆ పైన టార్గెట్ స్థాయిలు 23,350, 23,500.

బేరిష్ స్థాయిలు: కీలక స్థాయి 23,000 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. అప్రమత్తత అవశ్యం.

బ్యాంక్ నిఫ్టీ: రికవరీ బాట పడితే సానుకూలత కోసం ప్రధాన నిరోధం 49,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మానసిక అవధి, ప్రధాన మద్దతు స్థాయి 48,000. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

పాటర్న్: సానుకూలత కోసం మార్కెట్ ఇప్పుడు 23,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి. ఇది గతంలో ఏర్పడిన బాటమ్ కూడా కావడం వల్ల ఇక్కడ నిలదొక్కుకోలేకపోతే మరింత బ్రేక్‌డౌన్ అయినట్లు భావించి అప్రమత్తం కావాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,130, 23,200
మద్దతు	23,000, 22,940

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 27-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 299 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కర్తవ్యపథ్‌లో సైనిక సత్తా

గణతంత్ర పరేడ్‌లో త్రివిధ దళాల విన్యాసాలు.. సాయుధ పాటవానికి అద్దం

ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు సుబియాంటో

రాష్ట్రపతి ముర్మునుతో కలిసి బగ్గీలో ప్రాంగణానికి రాక



రంగుల తలపాగాతో ఆకట్టుకున్న ప్రధాని మోదీ

శకటాల నుంచి విన్యాసాల వరకూ నారీ భేరి

వేడుకలకు 10వేల మందికి పైగా అతిథులు

10



‘ఉగ్ర’ డ్రోన్ల ఉపద్రవం!

ఆఫ్రికా దేశాల్లో కొన్నేళ్లుగా నిఘా, పర్యవేక్షణకు డ్రోన్లను వినియోగిస్తున్న ఉగ్రవాద సంస్థలు

ఇప్పుడు పౌరులపై దాడులతో భయోత్పాతం.. సూడాన్ ఆస్పత్రిపై డ్రోన్ దాడి ఆ కోవలోనిదే

ఇదే రీతిలో ఇక్కడ ఉగ్రమూకలు దాడి చేస్తే?.. ఎదుర్కొనే సామర్థ్యం పోలీసులకు ఉందా?

మణిపూర్‌లో విద్రోహశక్తుల డ్రోన్ దాడులు.. అక్కడ యాంటీడ్రోన్ వ్యవస్థ ఏర్పాటు

పోలీసులకూ రోగ్ డ్రోన్లను ఎదుర్కొనే శిక్షణ ఇవ్వాలన్న ఎన్ఎస్‌జీ మాజీ చీఫ్ గణపతి

సూడాన్‌లో ఆస్పత్రిపై డ్రోన్ దాడి.. 70 మంది మృతి, 19 మందికి గాయాలు


కత్తితో కూరగాయలు కోసుకోవచ్చు. ప్రమాద సమయంలో ఆత్మరక్షణకు వినియోగించుకోవచ్చు. లేదా.. దాన్నే మారణాయుధంగా కూడా వాడి ఇతరుల ప్రాణాలు తీయొచ్చు!! ఏ పరికరమైనా.. పరిజ్ఞానమైనా.. వాడుకునే వారి మనస్తత్వాన్ని బట్టే దాని ఉపయోగం ఉంటుంది. ప్రయాణికులను చేరవేయడానికి ఉపయోగించే విమానాలనే ఆయుధాలుగా మార్చి అమెరికాలో జంట హర్మ్యాలను కూల్చేసిన అల్‌ఖైదా దురాగతం ఇందుకు ఒక పెద్ద ఉదాహరణ. ఇప్పుడు కాలం మారింది. ప్రాణాలను రిస్క్ చేసి మరీ అంత పెద్ద పెద్ద విమానాలను హైజాక్ చేయాల్సిన పని లేకుండా.. ఉగ్రవాదులు తమ దాడులకు చిన్నగా ఉండే డ్రోన్లను వాడటం మొదలుపెట్టారు.

ప్రపంచంలోని పలు దేశాల్లో.. ముఖ్యంగా ఆఫ్రికా దేశాల్లో ఉగ్రవాదులు ఇటీవల తరచుగా డ్రోన్ దాడులతో భయాందోళనలు సృష్టిస్తున్నారు! కానీ అవన్నీ చిన్నాచితకా దాడులు. సూడాన్‌లో ఆస్పత్రిపై తిరుగుబాటుదారులు జరిపింది చాలా పెద్ద దాడి. సింగపూర్‌లోని ‘ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ పొలిటికల్ వయొలెన్స్ అండ్ టెర్రరిజం రిసెర్చ్’కు చెందిన ర్యూబెన్‌దాస్ ప్రకారం.. ఇన్నాళ్లుగా ఆఫ్రికాలోని ఉగ్రవాదులు ‘ప్యాసివ్-డిఫెన్సివ్’ ప్రయోజనాల నిమిత్తమే డ్రోన్లను ఎక్కువగా వాడుతున్నారు. అంటే.. నిఘా, పర్యవేక్షణ, చిత్రీకరణ వంటివాటికి మాత్రమే. ఉదాహరణకు.. 2020లో కెన్యాలోని మండాలో ఉన్న అమెరికా మిలటరీ బేస్ చిత్రీకరణకు అల్‌షహాబ్ అనే ఉగ్రవాద సంస్థ డ్రోన్లను ఉపయోగించింది. ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్.. 2022లో నైజీరియాలో సైనిక స్థావరాలపై నిఘాకు డ్రోన్లను వాడింది. నెల తర్వాత

మిగతా 10వ పేజీలో...

వర్సిటీలపై కేంద్రం పెత్తనం సహించం

యూజీసీ నిబంధనల పేరుతో రాష్ట్రాలపై దండయాత్ర



నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా చెక్కును ఇస్తున్న సీఎం

వీసీలను కేంద్రం నియమిస్తానంటే ఊరుకోం

తెలంగాణ సమాజంపై అవగాహన కలిగిన ప్రొఫెసర్లను వీసీలుగా నియమించాం

రాష్ట్రంలో మరో పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారం

పద్మ అవార్డుల్లో తెలంగాణపై కేంద్రం వివక్ష

ప్రధానికి లేఖ రాస్తా: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో 15 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ

వర్సిటీలో నాలుగు భవనాలకు శంకుస్థాపన

హైదరాబాద్ సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): యూజీసీ నిబంధనల పేరుతో రాష్ట్రాల్లోని యూనివర్సిటీలపై కేంద్రం పెత్తనం చేస్తానంటే చూస్తూ ఊరుకోబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాల పరిధిలో జరిగే వైస్‌చాన్స్‌లర్ల నియామకాన్ని యూజీసీ ద్వారా కేంద్రం చేపట్టే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. దీనికి సంబంధించిన ముసాయిదాను రాష్ట్రాలకు పంపిందని, తాము దీనిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. యూజీసీ కొత్త నిబంధనలు రాజ్యాంగంపై దాడి వంటివేనని, రాష్ట్రాలపై కేంద్రం దండయాత్ర చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి విధానాలతో రాజ్యాంగం మనుగడ సాగిస్తుందా? అని ప్రశ్నించారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోనే అధికార విభజన ఉందని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్ణయాలను అడ్డుకునేందుకు ప్రొఫెసర్లు, విద్యావేత్తలు అవసరమైతే నిరసన కార్యక్రమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 15 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ ఆవరణలో నాలుగు భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. యూనివర్సిటీలపై రాష్ట్రానికి ఉండే హక్కును కేంద్రం ఎలా తీసుకుంటుందని ప్రశ్నించారు. ఈ కుట్రలను ఎలాగైనా అడ్డుకుంటామని ప్రకటించారు. యూజీసీ నిబంధనలపై

మిగతా 11వ పేజీలో...

ప్రతిపక్ష నేతకు ప్రజలు అక్కర్లేదా?

ఏడాదిలో ఎన్నడైనా అసెంబ్లీకొచ్చారా?

పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వాలనే సోయి కేసీఆర్, కేటీఆర్‌కు రాలేదు

పదవి లేకుండా సేవలో నా సోదరుడు

మేం ఇంటిల్లిపాదీ పదవులు తీసుకోలే

అర్ధరాత్రి నుంచే రైతు ఖాతాల్లో నగదు

మార్చి 31 దాకా 4 పథకాల నిరంతర అమలు: సీఎం రేవంత్‌రెడ్డి

నారాయణపేట జిల్లా చంద్రవంచలో సంక్షేమ పథకాల ప్రారంభం

11

పదేళ్ల తర్వాత పేదల కళ్లలో వెలుగులు

‘గణతంత్ర సందేశం’లో ముఖ్యమంత్రి



రైతు రుణమాఫీ తిరుగులేని సాయం

ప్రజల ఆకాంక్షలను సాకారం చేస్తున్న ప్రభుత్వం

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

11

ఇందిరమ్మ పేరు పెడితే డబ్బులు ఎలా ఇవ్వరో చూస్తాం

12 ఇళ్లకు నీ ఇంట్లో డబ్బులిస్తున్నావా?.. బండి సంజయ్‌పై పొన్నం ప్రభాకర్ ఫైర్



ఔటర్ పాడియావు!

రోజూ చీకటి పడే సరికి రూ.2 కోట్ల టోల్

ప్రైవేటుకు ఇచ్చిన 16 నెలల్లో రూ.వెయ్యి కోట్లు

ఐఆర్‌బీ కంపెనీకి 30 ఏళ్లపాటు డబ్బే డబ్బు

3 దశాబ్దాల లీజుకు చెల్లించింది 7,380 కోట్లే

8-9 ఏళ్లలో ఆ సొమ్మంతా టోల్ ద్వారా రికవరీ

2024లో ప్రతి నెలా వచ్చిన రాబడి (కోట్లలో)

నెల	ఆదాయం
జనవరి	59.3
ఫిబ్రవరి	58.9
మార్చి	63.1
ఏప్రిల్	60.2
మే	62.7
జూన్	63.1
జూలై	63.3
ఆగస్టు	68.7
సెప్టెంబరు	60.7
అక్టోబరు	67.0
నవంబరు	65.9
డిసెంబరు	71.3
మొత్తం	764.2

హైదరాబాద్ సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణను వేలంపాటలో దక్కించుకున్న ప్రయివేటు సంస్థకు కాసుల పంట పడుతోంది. రూ.7,380 కోట్లకే ముప్పై ఏళ్లపాటు ఓఆర్ఆర్ కాంట్రాక్టును దక్కించుకున్న సంస్థకు తొలి 16 నెలలకే ఏకంగా రూ.వెయ్యి కోట్ల ఆదాయం వచ్చింది. హైదరాబాద్ ఓఆర్ఆర్ సహా దేశవ్యాప్తంగా 17 రోడ్డు ప్రాజెక్టుల నిర్వహణ, టోల్ వసూలు చేపడుతున్న ఐఆర్‌బీ కంపెనీకి అత్యధిక ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్న రెండో ప్రాజెక్టుగా మన ఓఆర్ఆర్ నిలిచింది. ఉత్తర-దక్షిణ భారత దేశాలను కలుపుతున్న ఎన్‌హెచ్-44 నుంచి మాత్రమే హైదరాబాద్ ఓఆర్ఆర్ కన్నా ఎక్కువ ఆదాయం ఈ సంస్థకు వస్తోంది ప్రతీ నెలా టోల్ ఆదాయం నాలుగు శాతం నుంచి పది శాతం పెరుగుతోంది. 2024 సంవత్సరంలో ఏకంగా రూ.764కోట్ల ఆదాయం వచ్చింది. బంగారు బాతు లాంటి ఔటర్‌ను అమ్మారంటూ గతంలో ‘ఆంధ్రజ్యోతి’ రాసిన కథనం తాజా గణాంకాలతో నిజమైంది. వచ్చే 30 ఏళ్లలో సదరు కంపెనీ వేల కోట్లు ఈ ప్రాజెక్టు ద్వారా ఆర్జించనుంది. దేశంలోని ఏ మహా నగరానికి లేని విధంగా హైదరాబాద్ చుట్టూరా 158 కిలోమీటర్ల మేర నిర్మించిన జవహర్‌లాల్

మిగతా 9వ పేజీలో...

రీజనల్ రింగ్ రోడ్డు

దక్షిణ భాగంపై కేంద్రం నజర్!

కేంద్రమే చేపట్టాలంటూ ఇటీవల రాష్ట్ర సర్కారు లేఖ

ఏ పథకంలో చేర్చాలనే దానిపై కేంద్రం ఆలోచన

రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయం

9

కన్సల్టెన్సీ సంస్థ కోసం మరోసారి టెండర్ల ఆహ్వానం

బతుకులు ఛిద్రం

పల్టీకొట్టిన భారీ కంటెయినర్

నేరుగా 2 ఆటోలపై పడ్డ అందులోని ఉక్కు స్తంభాలు

నలుగురి దుర్మరణం.. మరో నలుగురికి తీవ్రగాయాలు

వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఘటన

కంటెయినర్ డ్రైవర్ మద్యం మత్తు వల్లే..

మృతులంతా వలస జీవులు.. ఒకే కుటుంబ సభ్యులు

ఘటనపై రేవంత్ దిగ్ర్భాంతి



వరంగల్ శివారులో ప్రమాద దృశ్యం

మామునూరు/వరంగల్ క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అది పద్దెనిమిది టైర్ల భారీ కంటెయినర్! పెద్ద పెద్ద ఉక్కు స్తంభాల లోడ్‌తో వెళుతోంది. డ్రైవింగ్ సీట్లో కూర్చున్నోడు పూటుగా మద్యం తాగి, ఆ మత్తులో నడుపుతున్నాడు! అతడి ఈ నిర్లక్ష్యమే ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైంది! ఓ నిండు కుటుంబాన్ని ఛిద్రం చేసింది. మద్యం మత్తులో జోగుతున్న డ్రైవర్, కంటెయినర్‌పై నియంత్రణ కోల్పోవడంతో అది అదుపు తప్పి పల్టీకొట్టింది. ఆలోపు.. అందులోని ఉక్కు స్తంభాలు పక్కనుంచే వెళుతున్న రెండు ఆటోలపై పిడుగుల్లా పడ్డాయి. ఆ ఆటోల్లో ప్రయాణిస్తున్నవారు చీమల్లా

మిగతా 9వ పేజీలో...

గురుమూర్తి సూక్ష్మదర్శిని

మలయాళ సినిమా స్ఫూర్తితోనే మృతదేహం మాయం

ఆ సినిమాలో మాదిరిగా యాసిడ్, రసాయనాలతో భార్య శరీర భాగాలను కాల్చి ముద్ద చేసిన నిందితుడు

దుర్వాసన రాకుండా స్ప్రే, కెమికల్స్ వాడినట్లు నిర్ధారణ

నిందితుడి చేతికి కాలిన గాయాల్ని గుర్తించిన పోలీసులు



హైదరాబాద్ సిటీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన మీర్‌పేట మహిళ హత్య కేసులో రోజుకో ట్విస్ట్ వెలుగులోకి వస్తోంది. పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నకొద్దీ విస్తుపోయే విషయాలు తెలుస్తున్నట్లు సమాచారం. నిందితుడు గురుమూర్తి తన భార్య వెంకట మాధవిని హత్య చేసిన తర్వాత ఆమె శవాన్ని మాయం చేయడానికి సూక్ష్మదర్శిని అనే మలయాళ సినిమాలోని టెక్నిక్స్ ఉపయోగించానని పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలిసింది. ఈ సినిమా ఇటీవల తెలుగులోనూ

మిగతా 9వ పేజీలో...



నావిక్‌కు సరికొత్త కిక్

పౌర, సైనిక సేవలు మరింత మెరుగు

10

29న ఎన్‌వీఎస్-02 ఉపగ్రహ ప్రయోగం

షార్‌లో వందో ప్రయోగానికి ఇస్రో సిద్ధం

జీఎస్‌ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా నింగిలోకి

మరో 2 డాకింగ్ ఉపగ్రహ ప్రయోగాలు

త్వరలోనే మూడో లాంచ్ ప్యాడ్ పనులు

నాలుగేళ్లలో నిర్మాణం పూర్తి: షార్ డైరెక్టర్ రాజరాజన్

సైనిక విమానాల్లో గెంటేస్తారా?

అక్రమ వలసదారులతో అమెరికా పంపిన రెండు విమానాలను తిరస్కరించిన కొలంబియా

గ్వాటెమాలకు.. రెండు విమానాల్లో 160 మంది

డీపోర్టేషన్‌కు మిలటరీ విమానాలు వాడడం అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారి

సైనిక విమానాలపై మెక్సికో అభ్యంతరం

నేపథ్యంలో ఇమ్మిగ్రేషన్ విమానాల్లో తరలింపు

న్యూయార్క్: అనుమతి లేకుండా తమ దేశంలో అక్రమంగా నివసించేవారిని వెళ్లగొట్టడం అమెరికా చాలాకాలంగా చేస్తున్న పనే! డీపోర్టేషన్ పేరుతో ఏటా లక్షలాది మందిని పంపించేస్తుంటుంది. కానీ.. ఇప్పుడు ట్రంప్ సర్కారు అక్రమ వలసదారులను ఆగమేఘాల మీద పంపించడానికి సైనిక విమానాలను వాడుతుండడం, అదీ అత్యంత అమానవీయంగా వారి కాళ్లు, చేతులను గొలుసులతో కట్టేసి పంపిస్తుండడంపై లాటిన్ అమెరికన్ దేశాలు మండిపడుతున్నాయి. రెండు రోజుల క్రితం మెక్సికోకు ఇలాగే సైనిక విమానాల్లో కొందరిని డీపోర్టు చేయబోతే.. ఆ దేశం అంగీకరించలేదు. దీంతో గత్యంతరం లేక

మిగతా 10వ పేజీలో...

వేలం పాటలో పందెం కోడిని దక్కించుకున్న రామకృష్ణ



కోర్టులో పందెం కోడి ‘పాట’

ఇటీవల పందెం రాయుళ్ల నుంచి స్వాధీనం 9

వేలంలో రూ.2,300కు కొన్న ఓ పక్షి ప్రేమికుడు

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ కోర్టులో ఘటన

ఆయనకు, కోడి పుంజుకు దండ వేసి సన్మానం

పల్లాపైకి రాళ్లు, కోడిగుడ్లు

జనగామ జిల్లా ఎర్రకుంటలో పథకాల కార్యక్రమంలో ఉద్రిక్తత

వేదికపైకి పల్లా.. ‘గో బ్యాక్’ అంటూ కాంగ్రెస్ శ్రేణుల నినాదాలు

బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాట

ఉద్రిక్తతతో మంత్రి పొంగులేటి పర్యటన రద్దు

12



హుస్సేన్‌సాగర్‌లో అగ్నిప్రమాదం

భరతమాత మహా హారతి కార్యక్రమంలో అపశ్రుతి

రెండు బోట్లలో బాణసంచా కాలుస్తుండగా ఘటన

ఐదుగురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం

ఒక బోటు పూర్తిగా దగ్ధం


సోమవారం 27 జనవరి 2025

వివిధ

సాహిత్య వేదిక

"జీవితంలోంచి వచ్చిన కథలే కాలంతో పాటు నిలుస్తాయి."

— గంధం యాజ్ఞవల్క్య శర్మ



గంధం యాజ్ఞవల్క్య శర్మ కథలన్నీ మధ్య తరగతి జీవితాల చుట్టూ తిరుగుతూ, ఆ జీవితాల్లోని ఈతి బాధలను చూపిస్తాయి. కథల్లోని పాత్రలతో మనల్ని మనం పోల్చుకుంటాం. పాతతరం రచయితల్లో మిగిలిన ఒకరిద్దరిలో ఆయన ఒకరు. వాకాటి పాండు రంగారావు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య బీనా దేవి వంటి రచయితలు ఆయన సమకాలికులు. 1937 ఆగస్టు 16న సీతాపతి శర్మ, వెంకట సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. చదువు లింగంగుంట్ల, మాచర్ల, బాపట్ల, అమలాపురం, గుంటూరు ఇలా పలుచోట్ల సాగింది. 1958లో కో ఆపరేటివ్ డిపార్ట్మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరి, 1995లో నరసరావుపేటలో సబ్ రిజిస్ట్రార్‌గా రిటైరయ్యారు. 170 కథలు, అరడజను నవలలు, కొన్ని నవలికలు, రేడియో నాటికలు రాశారు.

ఇంటర్వ్యూ: కరీం
99667 57407

మీ సాహితీ ప్రస్థానం ఎలా మొదలైంది?

మా తండ్రి గంధం సీతాపతి గారు కవి, పండితులు. మా పెద్దన్న గంధం వెంకా స్వామి శర్మ 1950వ దశకంలో చైతన్య పేరుతో మంచి కథలు రాశారు. ఆ వాతావరణం నాకు ఆసక్తి కలిగించి రచనా వ్యాసంగం వైపు రావడానికి దోహదం చేసింది. బీఎస్సీ చదువుతున్నప్పుడు 'గుంటూరు గోల' అనే కథ రాశాను. ఆంధ్ర పత్రికలో ప్రచురితమైంది. అది నా మొదటి రచన. మిత్రులు వాకాటి ప్రోత్సాహంతో కథలు, నవలలు, నవలికలు రాశాను. మధ్యలో కొంత కాలం రాయడం ఆపేసాను. మిత్రులు రచన శాయి నాచే మళ్ళీ రాయించారు. ఇప్పుడు వార్ధక్యం వల్ల పూర్తిగా రాయడం ఆపేసాను.

మీ కథలు ఎక్కువ మధ్య తరగతి జీవితాల్లోంచి వచ్చినవే అయ్యుంటాయి ఎందుకు?

నేను మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చాను. ఆ జీవితాలను, వ్యక్తులను దగ్గరగా చూశాను. వాళ్ళ సాధక బాధలను గమనించేవాణ్ణి. అవే ఇతివృత్తాలుగా కథలు రాశాను. అప్పట్లో పాఠకులు ఎక్కువగా మధ్య తరగతికి చెందిన వారే కావడంతో నా కథలు కనెక్ట్ అయ్యాయి అనుకుంటాను. నేనెప్పుడూ కల్పించి కథలు రాయలేదు. జీవితంలోంచి వచ్చిన కథలే కాలంతో పాటు నిలుస్తాయని నమ్ముతాను. నాకు బాగా పేరు తెచ్చిన 'సెలవయింది' కథ నిజ జీవిత ఘటన ఆధారంగా రాసిందే. చిన్నతనంలో మా ఊర్లో రాజు గారని పండరి భజన కళాకారుడు ఉండేవాడు. పండుగలకు, పబ్బాలకు గుళ్ళో పండరి భజన ప్రదర్శించే వాడు. ఆయన ప్రదర్శన చూడటానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి జనం వచ్చేవారు. అంత పేరు. కాలక్రమంలో ఆ కళ నిరాదరణకు గురి కావడంతో చివరి రోజుల్లో దుర్భర పరిస్థితులు అనుభవించాడు. ఒకనాడు గుంటూరులో మా ఇంటికి వస్తే మా అమ్మ భోజనం పెట్టి, కొంత డబ్బిచ్చింది. ఆయన దుస్థితి చూసి చలించిపోయి, ఆయన పాత్రతో కథ రాశాను. ఈ కథను త్రివేణి పత్రిక సంపాదకులు కోలవెన్ను రామ కోటేశ్వర రావుగారు మెచ్చుకోవడం నాకు దక్కిన గొప్ప ప్రశంస. బుచ్చిబాబు, మధురాంతకం రాజారాం నా అభిమాన రచయితలు.

కోలవెన్ను రామ కోటేశ్వరరావు గారితో మీ సాంగత్యం ఎలా సాధ్యమైంది?

ఇప్పటి తరం వాళ్లకు వారి గురించి తెలీదు. వారు స్వాతంత్ర్య సమర యోధులు. స్వాతంత్ర్యానికి పూర్వం పల్నాడు ప్రాంత శాసన సభ్యులుగా ఉన్నారు. బందరు జాతీయ కళాశాలకు వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. వారి సంపాదకత్వంలో 'త్రివేణి' పత్రిక వెలువడింది. నెహ్రూ, సర్వేపల్లి, సరోజినీ నాయుడు వంటి ప్రముఖులు కూడా 'త్రివేణి'కి రచనలు పంపేవారు. నేను ఉద్యోగ రీత్యా నరసరావుపేటకు వెళ్ళవలసి వచ్చినప్పుడు, మా తండ్రి గారికి ఈ విషయం చెబితే, ఆయన 'అక్కడ మా గురువు కోలవెన్ను రామకోటేశ్వరరావు గారు వుంటారు వారిని కలిసి సాష్టాంగ నమస్కారం చేయ'మన్నారు. నరసరావుపేటకు వెళ్ళినప్పుడు వారిని కలిశాను. ఫలానా వారి అబ్బాయిని అని చెప్పా. అప్పటి నుండి వారు చనిపోయేవరకు మా అనుబంధం కొనసాగింది. వారి సాంగత్యంలో నేనెంతో నేర్చుకున్నాను. ఆయనను కలవడానికి వచ్చిన ప్రముఖులెందరినో చూడగలిగాను. కంటి చూపు మందగించటంతో ఎన్నో ఇంగ్లీష్ పుస్తకాలను ఆయనకు చదివి వినిపించే వాణ్ణి. ఆ క్రమంలో నా ఇంగ్లీష్ ఎంతో మెరుగైంది. వారి సాంగత్యం నా పూర్వజన్మ సుకృతం.

మీకు సాహిత్యంలో రావల్సిన గుర్తింపు రాలేదు. ఎందుకంటారు?

నేను పుంఖాను పుంఖాలుగా రాసిన వాణ్ణి కాదు. సంఘటనలకు స్పందించి మాత్రమే రాశాను. స్వభావ రీత్యా నేను అంతర్ముఖంగా వుంటాను. సాహిత్యంలో గుర్తింపు రావాలంటే చొరవ ముఖ్యం. అది నాకు తక్కువ. పైగా ఉద్యోగరీత్యా వచ్చి నేను నరసరావుపేటలోనే స్థిరపడిపోయాను. సాహిత్య సభలు, సమావేశాలు నగర కేంద్రంగా జరుగుతాయి. అలాంటప్పుడు నన్ను ఎవరు పట్టించుకుంటారు. గుర్తింపును నేనెప్పుడూ ఆశించలేదు. అందుకే రాలేదన్న బాధా లేదు.

మీ అబ్బాయి నాగరాజు గంధం గురించి చెప్పండి?

మా అబ్బాయి నాగరాజు గంధం మరణం నాకు తీరని లోటు. మంచి చదువరి. అతని కల్పన శక్తి అమోఘం. నాగరాజు మొదటి కథ 'చెరువు'కు ఎంతో పేరు వచ్చింది. ఆంగ్లంలోకి అనువదించబడింది. ఆ తర్వాత చాల కథలు, నవలలు రాశాడు.



నాకు సాహిత్యంలో పెద్దగా గుర్తింపు రాలేదు గాని, గంధం నాగరాజు తండ్రిగా నన్ను చాలామంది గుర్తించారు. ఇప్పటికీ ఎవరైనా నాకు నేను పరిచయం చేసుకున్నప్పుడు స్పందించిన దాని కంటే, మా అబ్బాయి పేరు చెప్పగానే "మీరు నాగరాజు ఫాదరా!" అంటూ ఆశ్చర్యంగా స్పందిస్తుంటారు.


నాటకాలు, నాటికలు రాశాడు. నంది బహుమతుల వచ్చాయి. సినీ దర్శకులు క్రిష్‌తో కలిసి 'గమ్యం' సినిమా చేశాడు. ఆ సినిమా మా అబ్బాయికి, క్రిష్‌కు తొలి ప్రయత్నమే. ఇద్దరికీ మంచి పేరు వచ్చింది. నాగరాజు సంభాషణలకు గొప్ప రెస్పాన్స్ వచ్చింది. ఆ సినిమా తర్వాత చాలా అవకాశాలు వచ్చాయి. 'ఇంకోసారి', 'బాణం', 'గాయం—2', 'బెట్టింగ్ బంగార్రాజు' సినిమాలకు మాటలు అందించాడు. సినిమా రంగంలో నిలదొక్కుకుంటున్నాడని అనుకుంటున్న తరుణంలో మాకు విషాదాన్ని మిగిల్చి వెళ్ళిపోయాడు. నాకు సాహిత్యంలో పెద్దగా గుర్తింపు రాలేదు గాని, గంధం నాగరాజు తండ్రిగా నన్ను చాలామంది గుర్తించారు. ఇప్పటికీ ఎవరైనా నాకు నేను పరిచయం చేసుకున్నప్పుడు స్పందించిన దాని కంటే, మా అబ్బాయి పేరు చెప్పగానే "మీరు నాగరాజు ఫాదరా!" అంటూ ఆశ్చర్యంగా స్పందిస్తుంటారు.

ప్రస్తుతం కథా సాహిత్యంపై మీ అభిప్రాయం?

ఇంటర్నెట్ ప్రపంచీకరణ నేపథ్యంలో కథా సాహిత్యం ఇతివృత్తంలోనూ, శైలిలోనూ ఉన్నత స్థాయిలో వుంది. ఖదీర్ బాబు, కుప్పిలి పద్మ, సుజాత వేల్పూరి, కల్పన రెంటాల వంటి కథకులు తమకే ప్రత్యేకమైన శైలిలో గొప్ప కథలు రాస్తున్నారు. ఈ తరం తెలుగు సాహిత్యంతో పాటు ఆంగ్ల సాహిత్యం చదువుతుండటం అభినందించదగ్గ విషయం. ఎక్కువ చదివి తక్కువ రాయమని కొత్తగా రాసేవాళ్ళకు నా సలహా.

బాలార్కుడు





ఒక పున్నమి రాత్రి చందమామ మా ఇంటి మీదుగా వెళ్తుంటే జాబిల్లిలోని కుందేలు పిల్ల ఒక్క ఉదుటున పెరట్లోని జాం చెట్టు కొమ్మ పైకి దూకి చూస్తుండగానే మాయమై పోయింది. లోపలి గది లోకెళ్లి చూడగా మా అమ్మాయి పొత్తిళ్లలో మా మనవడు.

నిన్నటి నుండీ ఆమే నేనూ పండిన పెసరచేను ఎండకు పగులుతున్నట్టు ఒకటే పగులుతున్నాం. చేను, చెక్కా లేని మాకు ఈ చిటపటలేంటి అని చూస్తే ఇల్లంతా పచ్చని పెసర చేనులా పరుచుకున్న మా మనవడు.

నిర్మలంగా, నిశ్చలంగా ఉన్న కొలనులో నింగికి నమస్కరిస్తూ నిలుచున్న కలువ మొగ్గ గండుచేప తోక విసురుకు ఒక్కసారిగా చలించినట్టు దేహమంతా ఒకటే అనుకంప. చేపలు పట్టేవాడు వెదురు బద్దల బుట్టతో చెరువు అంతా గాలించి గాలించి చివరికి లోపలికి చేయి పెట్టి బయటికి తీసిన చేపలా మా మానస సరోవరంలో ఈదులాడే చేప మా మనవడు.

ఊరంతా సద్దుమణిగాక
దూరం నుండి లీలగా
గజ్జెలసవ్వడి... ఢంకా ధ్వానం.
ఎక్కడో శివారుపల్లెలో జాతర జరుగుతుందేమో
అనుకున్నాను. లోపలికి వెళ్లి చూస్తే
వెల్లకిలా పడుకొని
కాళ్లు చేతులతో
గాలి సైకిల్ తొక్కుతూ
మా మనవడు.

దుర్గమారణ్యాల
ఇరుకు దారులగుండా
గులకరాళ్ళను వొరుసుకుంటూ
దిగువకు దొర్లుకుంటూ వస్తున్న
సన్నటి సెలయేటి గల గల.. ఎక్కడెక్కన్నుంచీ అని
తరచి చూస్తే నా మనసు చేదబావిలో గిలకలు వేస్తూ
తరంగిస్తున్న మనవడు తాబేలు.

నడి రాత్రి గాఢ సుషుప్తిలో
దూరపు వనాల నుండి
ఒక్కటే కేకుల క్రేంకారావాలు.
వనాలకోసం ఊరంతా కలయ చూస్తుంటే
మా లోపలే మా మనసు మోడు చెట్లకు
చిగురుటాకుల పసరిక ను అద్దుతూ కొమ్మ కొమ్మకు గెంతుతూ
మా మనవడు నెమలి.

ప్రాచీ దిశ దిగంతరేఖ మీద కొండంత ప్రభాత సంధ్య
ఇంటికొచ్చి చూస్తే
ఇంట్లో జ్వలించే శత సహస్ర అంచుల గొప్ప కాంతిపుంజం.
కళ్ళకు చేతులు అడ్డం పెట్టుకుని పరికేస్తే
అనంత కోటి నవ్వుల కిరణాల బాలార్కుడు మా మనవడు.


శిఖామణి
98482 02526

బొమ్మలు: అక్బర్

దేవలోకపు పాటకు ప్రేమలేఖ

రఫీ సినిమా పాటనూ, జీవితాన్నీ తెలుగు పాఠకుల ముందు నిలిపే ఒక అద్భుత ప్రయత్నం సాహితీ వేత్త సి. మృణాళిని రచించిన 'రఫీ – ఒక ప్రేమ పత్రం' పుస్తకం. రఫీ పాటలతో హీరోలుగా వెలుగొందిన వారిని, అతనితో పాడించిన సంగీత దర్శకులను స్మరించుకుంటూ, రఫీ పాడిన అమృత గీతాలను మరోసారి గుర్తు చేసుకుంటూ పుస్తకం సాగడం పాఠకులకు మధురానుభూతిని కలిగిస్తుంది.

"రఫీ శ్రావ్యమైన గొంతులో పాట నీ దాకా వచ్చినప్పుడు అది చుట్టూ ఉన్న రద్దీ నుంచి నిన్ను దూరంగా ఒక దేవలోకంలోకి తీసుకుపోతుంది. అక్కడ ద్వేషం, ఈర్ష్య, నువ్వూ నేనూ అన్న తేడాలు ఏవీ ఉండవు. శాంతి ఎల్లెడలా విస్తరించి ఉంటుంది. ఆనందం మన నుదుటిని ముద్దాడుతూంటుంది" — 'యాన్ ఈవినింగ్ విత్ రఫీ' అనే హెచ్.ఎమ్.వి వారి కేసెట్ కోసం మహానటుడు పృథ్వీరాజ్ కపూర్ ఇచ్చిన సందేశమిది. రఫీ పాట గురించి ఇంతకంటే అందంగా ఇంకెవ్వరూ చెప్పలేరనిపిస్తుంది. 1950—1970ల మధ్య కాలాన్ని భారతీయ సినీ సంగీత ప్రియులు రఫీ యుగంగా భావిస్తారు.



రఫీ సినిమా పాటనూ, జీవితాన్నీ తెలుగు పాఠకుల ముందు నిలిపే ఒక అద్భుత ప్రయత్నం సాహితీవేత్త సి. మృణాళిని రచించిన 'రఫీ — ఒక ప్రేమ పత్రం' పుస్తకం. భారతీయ భాషల్లో రఫీపై వచ్చిన పుస్తకాల్లో ఇది ప్రత్యేకమైంది. రఫీ బాల్యాన్ని, ఆ వయసులోనే సంగీతం పట్ల అతనికున్న అవగాహనను నిశిత పరిశీలన ద్వారా వివరిం చారు మృణాళిని.


'చౌదవీకా చాంద్ హో' వస్తున్నపుడు వెన్నెలే తప్ప పాట వినిపించక పోవడం రఫీ గొంతు విశిష్టత. ఇదే కాదు రఫీ పాడిన ప్రతి పాటా శ్రోతను నేరుగా సన్నివేశానికి తీసుకు పోతుంది. రఫీ 1924 డిసెంబర్ 24న పంజాబ్ లోని కోట్లా సుల్తాన్ సింగ్ గ్రామంలో జన్మించాడు. ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉండటంతో వారు లాహోరుకు వలస వెళ్లారు. అక్కడ క్షుర వృత్తి చేపట్టాడు. 1943లో లాహోర్ రేడియోలో గాయకుడయ్యాడు. 'సోనియే నీ, హీరియే నీ, తేరీ యాద్ నే ఆన్ సతాయా' అనే పాటను శ్యామ్ సుందర్ సంగీత దర్శకత్వంలో పాడాడు. అవకాశాల కోసం మకాం బొంబాయికి మారింది. అక్కడ కూడా శ్యామ్ సుందరే రఫీకి 'గావ్ కీ గోరే' హిందీ చిత్రంలో పాడే అవకాశమిచ్చారు. తర్వాత మళ్లీ ఎవరూ అవకాశం ఇవ్వలేదు. సుప్రసిద్ధ సంగీత దర్శకులు నౌషాద్ తండ్రి వాహెద్ అలీ రఫీ పాట విని తన కొడుక్కి రఫీ గురించి సిఫారసు చేసాడు. 'పెహలే ఆప్' చిత్రంలో బృంద గానంలో ఒకరిగా అవకాశం వచ్చింది. ఆనాటి నుండి రఫీ వెనక్కి తిరిగి చూసుకోలేదు. భారత దేశం అతని గొంతుకు బ్రహ్మరథం పట్టింది.



మృణాళిని పుస్తకం రఫీ పాటలతో హీరోలుగా వెలుగొందిన వారిని, అతనితో పాడించిన సంగీత దర్శకులను స్మరించుకుంటూ, రఫీ పాడిన అమృత గీతాలను మరోసారి గుర్తు చేసుకుంటూ పుస్తకం సాగడం పాఠకులకు మధురానుభూతిని కలిగిస్తుంది. మృణాళిని ఈ పుస్తకాన్ని 14 భాగాలుగా విభజించారు. అరుదైన చిత్రమాలికను, పాటల తోటని అందించారు. 'ముల్లోకాలను మురిపించిన పాట' అనే భాగంలో ప్రపంచ వేదికలపై స్టాండింగ్ ఒవేషన్ అందుకున్న క్రమాన్ని కవితాత్మకంగా వివరించారు. 'ఆకాశంలో ఎగరాలని వుంది'లో రఫీ జీవితంలోని ఉత్థాన పతనాలను వివరించారు. వేదికల మీద రఫీ చేసిన గళ విన్యాసాలు విని తీరాల్సిందేనని రచయిత్రి తెలిపిన విధానం ప్రత్యేకంగా వుంది.

రఫీ పాటలు వినడమంటే ఒక్కోసారి మన మనసును వినడమూ, మరోసారి మన మనసును ఇంకా ఉన్నతం చేసుకోవడమని శ్రోతల ప్రపంచమంటుంటే ఆయన మాత్రం "నేను సంగీత దర్శకుడి చేతిలో రాయిని. అతను పాడమన్నట్టు పాడతాను. ఆపైన అల్లా దయ" అనే వినయశీలి. 1944లో మొదలుపెట్టి, 1980 వరకూ దాదాపు విరామం లేకుండా పాడి సినీ గీతాల అభిమానులకు నిత్య జీవితంలో అంతర్భాగమైపోయాడు రఫీ. తమ జీవితాల్లో అనేక సందర్భాల్లో రఫీని తలుచుకుంటూ తమ బాధను మరిచి పోయిన వారూ, ఆనందాన్ని పెంచుకున్నవారూ ఉన్నారు.

ప్రతి పాటను సొంతం చేసుకోవడం రఫీకి తెలిసిన రహస్యమని చెప్పుకోవచ్చు. తెరపై అభినయిస్తున్న నటుడి కంటే, కథను రాసిన రచయితకంటే, కథను చెబుతున్న దర్శకుడి కంటే ఎక్కువగా రఫీ ఆ సన్నివేశాన్ని, పాత్ర మనోభావాలని తనలో నింపుకుంటాడు. తనే ఆ పాత్ర అయిపోతాడు. అందుకే పాట వింటున్నంత సేపూ మనలో కూడా అదే భావం, అదే అనుభూతి కలుగుతాయి.



ఒకానొక సమయంలో సినిమా అవకాశాలు సన్నగిల్లాయి. ఆ సమయంలో ప్రైవేటు ఆల్బంలలో పాడడం మొదలు పెట్టాడు. అవి కూడా సినిమా పాటలతో సమాన స్థాయిలో ప్రజాదరణ పొందాయి. నిజానికి జీవితంలో రఫీ కోరుకున్న ఆనందాలు చాలా చిన్నవి. ఇష్టమైన వాళ్లతో ఇంట్లో భోజనం చేయడం, తనకిష్టమైన ఆటలు ఆడుకోవడం, కుటుంబసభ్యులతో కబుర్లు చెప్పడం వంటివి. ఏ నిర్మాతకైనా, ఎంత చిన్న సంగీత దర్శకుడికైనా తను పాడడం వల్ల ఎంతో కొంత మేలు జరుగుతుందని తెలిస్తే వెంటనే ఒప్పుకునేవాడు. రఫీ ఎంత గొప్ప కళాకారుడో, అతని వ్యక్తిత్వం కూడా గొప్పది కనుకనే అతన్ని జనం హృదయాల్లో నిలుపుకున్నారు. గంధర్వలోకం నుంచి వచ్చి ఆనందాన్ని పంచి 57 ఏళ్ల వయసులో గంధర్వ లోకానికి వెళ్ళిపోయాడు. సుప్రసిద్ధ సంగీత దర్శకులు నౌషాద్ 'రఫీ సాబ్ సంగీత ప్రపంచానికి ప్రవక్త' అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. వినూత్నమైన సమాచారంతో తెలుగు వారికి అద్భుతమైన ఈ పుస్తకాన్ని అందించిన రచయిత్రి కృషి అభినందనీయం.

ర్యాలి ప్రసాద్
94945 53425

కదలని నేలపై కదిలే నురుగు కెరటాలు

నిండుజీవితానికి సాక్ష్యంగా
పండుజుత్తుతో తుదిశ్వాసవిడిచి,
దశాబ్దాలుగా మట్టిన నిద్రిస్తున్న తాత,
నిలువెత్తు మొలకెత్తి
తొంగిచూస్తూ పలకరిస్తున్నట్టు
కట్టెదుట రెల్లుపూలు!

వేడి వేసవి నుండి వరదలతో సేదదీరుతున్న
భూమితల్లికి వీస్తున్న వింజామరల తూలికలు!
ఆకాశమంత వెన్నెల్లో
శరత్కాలమేఘం పచ్చమైదానాన్ని సుతారంగా
ముద్దాడుతున్న వైనం!

అమాసరేయి కదలాడుతూ
భయపెడుతున్న తెల్లసింహాల మంద.

గాలి కదలాడినంతసేపూ
కదలని నేలపై కదిలే నురుగుకెరటాలు!

కనుచూపుమేరా పూచిన తెల్లజెండాలను
ప్రపంచ యుద్ధోన్మాదుల చేతికి
అతికించాలని ఉంది! చాలుతాయో? చాలవో?

గార రంగనాథం
98857 58123

తొందరపడి ముందే కూసిన కోయిలని!



నా మొదటి పుస్తకం

మందరపు హైమవతి

మా నాన్న గారిని సాహిత్యమంటే బాగా పిచ్చి. చిన్నప్పటి నుంచీ నన్ను దగ్గర కూర్చోబెట్టుకుని పుస్తకాలు చదివించే వారు. సాహిత్య సభలకు తీసుకు వెళ్ళేవారు. అలా సాహిత్యమంటే నాకూ అభిరుచి కలిగింది. నా పన్నెండవ ఏట నుంచీ కవిత్వం రాయడం మొదలుపెట్టాను. అప్పుడు పువ్వు విరిసినా, పక్షి ఎగిరినా, వెన్నెల కురిసినా ప్రతిదాన్నీ కవిత్వీకరించేదాన్ని. కవితా సంపుటాలను చదివినప్పుడల్లా నా కవితలను కూడా పుస్తక రూపంలో చూసుకోవాలని కోరికగా వుండేది. పెద్దలు ఇప్పుడే వద్దు అన్నారు కానీ ఒక విధమైన బాల్య చాపల్యంతో పుస్తకం తీసుకు వచ్చేదాకా ఊరుకోలేదు. అలా తొందరపడి ముందే కూసిన కోయిలలా వచ్చిన పుస్తకమే 'సూర్యుడు తప్పిపోయాడు', నా మొదటి కవితా సంపుటి. దీనిలో నేను మొదట రాసిన కవితలు కూడా ఉన్నాయి. 32 కవితల ఈ సంపుటి 1982 డిసెంబర్‌లో వచ్చింది.

అభ్యుదయ దృక్పథంతో రాసిన ఈ పుస్తకానికి ఆరుద్ర ముందుమాట రాసారు. స్పందన సాహితీ సమాఖ్య తరపున గుత్తికొండ సుబ్బారావు పుస్తకం ప్రచురించారు. కవితలు రాయడం తప్ప ముద్రణ గురించి నాకేమీ తెలీదు. డా. జి.వి. పూర్ణచంద్ ప్రచురణ బాధ్యత తీసుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ పుస్తక ప్రచురణ కోసం రూ.900 ఆర్థిక సహాయం చేసింది. బాలి కవర్ పేజీ వేశారు.

ఈ సంపుటిలో మొదటి కవిత 'సూర్యుడు తప్పిపోయాడు'. "చైతన్య మాత పెద్ద కుమారుడు/ మానవత ఇంటిపేరు గల వాడు/ అభ్యుదయ సూర్యుడు తప్పిపోయాడు" అని ఈ దేశంలో అభ్యుదయం లేదనే అభిప్రాయంతో ఈ కవిత కొనసాగుతుంది. 'ఉదయిస్తాడు సూర్యుడు' అనే కవితతో సంపుటి ముగుస్తుంది.

1980లలో స్త్రీ వాద కవిత్వం మొదలైనా ఈ సంపుటిలో ఆ ఛాయలేమీ కనపడవు. 'అపుత్రస్యగతిర్నాస్తి' కవిత మాత్రం ఒక ముసలి తల్లి వేదన. కొడుక్కి దూరంగా పల్లెటూళ్లో వున్న ఒక ఒంటరి తల్లి కథ. "ఆ రోజు మబ్బులు ముసిరి/ మసకబారి పోయే జాబిలి/ సురభిళ రమ్యం యౌవన సుమం/ వాడకముందే వీడిపోగా పతి/ సుఖాల ఆతపత్రచ్ఛాయలనమర్చిన/ కరుణామహితవల్లి ఆమె/ మాతృదేవోభవ అని తల్లికి పూజ్యస్థానం ఇస్తూ ముసలితనం ముసిరినాక విసిరి కొట్టు వీరు.. ఏ మహోన్నత సంస్కృతికి వారసులు/ ఏ ప్రాచీన నాగరికతకు ప్రతీకలు" అని ప్రశ్నిస్తూ కొడుకుల నిరాదరణకు గురైన అభాగ్య మాతృమూర్తుల దీనస్థితిని చిత్రించిన కవిత ఇది. ముందు మాటలో ఆరుద్ర ఈ కవితను ప్రస్తావిస్తూ కేవలం ఆడపిల్ల మాత్రమే రాయగలిగిన కవిత అని అన్నారు. ఈ పుస్తకాన్ని డా. బెజవాడ గోపాలరెడ్డి ఆవిష్కరించారు. సంజీవదేవ్ సభకు అధ్యక్షత వహించారు. ఎం.ఎ. మూర్తి మాట్లాడారు. పిల్లలు నడిచేటప్పుడు తప్పటడుగులు వేస్తారు. పడుతూ లేస్తూ నడక నేర్చుకొంటారు. నా తొలి సంపుటి కూడా ఇలాంటిదే. "మేఘమాలికల స్వాప్నిక గగన విహారమిక చాలించుము/ అబ్బు సాచి పైకి చూచే చూపులనిక భూమిపైన సారించుము" అని కొన్ని చోట్ల గ్రాంథిక భాషా వాసన కనిపిస్తుంది.



నా కవితలను పుస్తక రూపంలో రావాలనుకొన్న కోరిక నెరవేరి పుస్తకం చేతిలోకి వచ్చాక ఆనందంతో ఎగిరి గంతేసినట్టు అనిపించింది. నా తొలి పుస్తకాన్ని నా తల్లిదండ్రులు మందరపు దుర్గాంబ, మందరపు కాసులు గారికి అంకితమిచ్చాను. అప్పుడు పురాణం సుబ్రహ్మణ్య శర్మ ఎడిటర్‌గా ఆంధ్ర జ్యోతి వీక్లీ వచ్చేది. ఆ వీక్లీలో పని చేస్తున్న అప్సర్ నా పుస్తకం మీద రివ్యూ రాసారు. 1985లో ఈ పుస్తకానికి కృష్ణశాస్త్రి అవార్డు వచ్చింది. ఆ తర్వాత 2004లో నా రెండవ కవితా సంపుటి 'నిషిద్ధాక్షరి' వచ్చింది.

సాహిత్య సమాలోచన

జమిలి సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో జనవరి 27 సా.4 గంటల నుంచి 9 గంటల వరకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో కవి సిద్ధార్థ కవితా సంపుటాలపై (దీపశిల, బొమ్మలబాయి, మల్లెలతీర్థం-మహాఖననం) కవిత్వ, తత్వ, అస్తిత్వ విచారణలో విమర్శకులు కె. శ్రీనివాస్, అంబటి సురేంద్ర రాజు, మామిడి హరికృష్ణ, త్రివేణి, భాను శ్రీ కొత్వాల్, బుచ్చన్న, ఆదిత్య తదితరులు పాల్గొంటారు.

జమిలి సాహిత్య సాంస్కృతిక వేదిక

ఉమర్ ఆలీ షా సాహిత్యంపై సదస్సు

'బ్రహ్మర్షి డాక్టర్ ఉమర్ ఆలీషా సాహిత్యం — బహుముఖీనత' అంశంపై రెండు రోజుల సదస్సు తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నైలో జరుగుతుంది. జనవరి 27 ఉ.10గంటలకు మొదలయ్యే ఈ సదస్సులో అమెరికా, ఆఫ్రికా, యూకే, తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ తదితర ప్రాంతాల నుండి మొత్తం 66 మంది పత్ర సమర్పణ చేస్తారు. సద్గురు ఉమర్ ఆలీ షా, భువన చంద్ర, కోయి కోటేశ్వరరావు, వాసిలి వసంత కుమార్ తదితరులు పాల్గొంటారు.

విస్తాలి శంకరరావు

'గూడు చెదిరిన దృశ్యం' కవితా సంపుటి

కొండి మల్లారెడ్డి కవితా సంపుటి 'గూడు చెదిరిన దృశ్యం' ఆవిష్కరణ సభ జనవరి 30 సా.6గంటలకు సిద్ధిపేట ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుంది. ప్రొఫెసర్ కోదండరాం, జూకంటి జగన్నాథం, బూర్ల వేంకటేశ్వర్లు, పర్కపెల్లి యాదగిరి, గఫూర్ శిక్షక్ హాజరవుతారు.

తెలంగాణ రచయితల వేదిక

విమర్శకునితో ఒక సాయంత్రం

సాహిత్య అకాడమీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో 'విమర్శకునితో ఒక సాయంత్రం' కార్యక్రమంలో ఏటుకూరి ప్రసాద్ ప్రసంగిస్తారు. తర్వాత ఆహూతులతో ముఖాముఖి ఉంటుంది. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 1 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

ఎస్‌వి సత్యనారాయణ

కవిరాజు త్రిపురనేని పురస్కారం

సూతపురాణం శతవసంతాల వేడుక, త్రిపురనేని జాతీయ పురస్కార సభ కార్యక్రమం జనవరి 29 ఉ.10గంటలకు జేకేసీ కాలేజ్ ఆడిటోరియం గుంటూరులో జరుగుతుంది. పురస్కారాన్ని దేవరాజు మహారాజు, కొత్తపల్లి రవిబాబు స్వీకరిస్తారు. గద్దె మంగయ్య, బైరపనేని నరేష్, ఆలోకం పెద్దబ్బయ్య, జొన్నలగడ్డ రామారావు, రావెల సాంబశివరావు తదితరులు పాల్గొంటారు.

త్రిపురనేని సాహితీ సమితి


జానపద నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు



జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం జాతీయ గీతాలపన చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝా


హనుమకొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న కలెక్టర్, పోలీస్ కమిషనర్

అందరికీ సంక్షేమ ఫలాలు

- నాలుగు ప్రత్యేక పథకాలతో పేదల అభ్యున్నతి
- ప్రగతి పథంలో దూసుకెళుతున్న హనుమకొండ జిల్లా
- అన్ని రంగాల్లో అగ్రగామికి మరింత కృషి
- స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమరులకు జోహార్లు
- జిల్లా ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ ప్రావీణ్య ప్రసంగం
- జిల్లాలో ఘనంగా గణతంత్ర వేడుకలు
- పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సందడే సందడి

హనుమకొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ప్రగతి పథకంలో పయనిస్తోందని, అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలవడానికి మరింత కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా, కన్నుల పండువగా జరిగాయి. తొలుత కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జిల్లా ప్రగతిని వివరించారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు అందుబా టులోకి రావడంతో పేదల ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు ప్రస రిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలు ప్రారంభమైందని, దీనితో ప్రజలు మరింతగా అభ్యున్నతి సాధించ గలరన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ భరోసా

ప్రజాపాలనలో భాగంగా రాష్ట్రప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 2023-24 దాదాపు పదివేల కుటుంబాలకు లబ్ధి చేకూరబోతున్నదని తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన అన్ని భూములకు పంట పెట్టుబడి సహాయంగా ఏడాదికి ఎకరానికి రూ.12వేలు గణతంత్ర దినోత్సవం రోజు నుంచి ప్రభుత్వం అందచేస్తున్నదని అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ కొత్త రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు పూర్త య్యాయని, జిల్లాలో 32,987 కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులను గ్రామసభల్లో స్వీకరించినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ నాలుగు పథకాలు ఆది వారం ప్రతీ మండలంలో ఒక్కో గ్రామ పంచాయతీలో లాంఛనంగా ప్రారంభించి నట్టు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 5.95 కోట్ల మంది మహిళలు జీరో టికెట్ ద్వారా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు. రుణమాఫీ పథకం కింద భూమి కలిగిన ప్రతీ రైతు కుటుంబానికి రూ. 2 లక్షల వరకు పంట రుణాల మాఫీ జరిగిందని, జిల్లాలో నాలుగు విడతలుగా 43,127 మంది రైతులకు రూ.472.90 కోట్ల పంట రుణాలు మాఫీ అయ్యాయని తెలిపారు.



స్వాతంత్ర్య సమరయోదులకు సన్మానిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్ పి.ప్రావీణ్య


ప్రసంగిస్తున్న హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



వైద్యం

రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అర్హులైన వారందరికీ రూ.10 లక్షల మేర ఉచితంగా వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తోందని, గత సంవత్సరం జనవరి నుంచి ఇప్పటి వరకు 16,043మంది రోగులకు రూ.36.69కోట్లతో చికిత్సలు అందాయని కలెక్టర్ వివరించారు. మహిళలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించేందుకు జిల్లాలో 9 ఆరోగ్య మహిళా క్లినిక్‌లను ప్రారంభించామని, వీటి ద్వారా 40,351 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని వెల్లడించారు. జిల్లాలో ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినుల్లో 978 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వీరిలో 155 మందికి తదుపరి మెరుగైన చికిత్స కోసం చర్యలు తీసుకున్నామన్నారు.

విద్య

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా 438 పాఠశాలల్లో తరగతి గదులకు మరమ్మతులు, విద్యుదీకరణ, తాగునీటి వసతి కల్పన, మరుగు దొడ్ల నిర్మాణం తదితర 1238 పనులను రూ.16.98కోట్లతో చేపట్టామన్నారు. జిల్లాలో 470 పాఠశాలల్లో 27,950 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, ఈ విద్యా సంవత్సరంలో 3.37 లక్షల పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు. 2024 డీఎస్సీ ద్వారా జిల్లాలో 187 ఖాళీల భర్తీకిగాను 168 మంది ఉపాధ్యాయులను నియమించామన్నారు.

పౌరసరఫరాలు

ఈ ఖరీఫ్ సీజన్‌లో 146 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 96,036 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 22,628 మంది రైతులను నుంచి కొనుగోలు చేశామని, ఇందుకుగాను రూ.222.66కోట్లను రైతులకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించామని, 63451 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం పండించిన 14,943 మంది రైతులకు బోనస్ కింద క్వింటాలుకు రూ.500 చొప్పున రూ. 21.43 కోట్లు చెల్లించామని తెలిపారు.

ఉద్యానవనం

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 456 మంది రైతులకు 1239 ఎకరాలల్లో పామాయిల్ తోటల పెంపకానికి అనుమతులిచ్చామని, ఇందులో 763 ఎకరాల్లో మొక్కలు నాటారని, కాగా జిల్లాలో ఇప్పటి వరకు 2,309 ఎకరాల్లో పామాయిల్ మొక్కలు నాటారన్నారు. జిల్లాలోని పేదలు, వ్యవసాయాధారిత కుటుంబాలకు పశు సంవర్ధక శాఖ ద్వారా సేవలు అందుతున్నాయన్నారు. మత్స్యకారుల ఆర్థిక బలోపేతానికి 2024-25 సంవత్సరానికి జిల్లాలో 753 చెరువుల్లో రూ.84.49 లక్షల విలువైన 111.63 లక్షల చేపపిల్లలను వంద శాతం రాయితీపై పంపిణీ చేసినట్టు తెలిపారు.

గ్రామీణాభివృద్ధి

ఈ ఆర్థిక సంవత్సరం ఉపాధి హామీ పథకం కింద 21 లక్షల పనిదినాల లక్ష్యానికి గాను 18.92 లక్షల పని దినాలను కల్పించామని, ఇందుకు మొత్తం

మిగతా 6వ పేజీలో...


హనుమకొండలోని పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాత సెల్‌ఫోన్‌ల కొనుగోలు పేరిట
సైబర్ మోసాలు

- గ్రామాల్లో, కాలనీల్లో సంచరిస్తున్న అంతరాష్ట్ర ముఠా సభ్యులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు


ముఠా సభ్యులు సేకరించిన పాత సెల్‌ఫోన్‌లు

వరంగల్ క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు గ్రామాల్లో, పట్టణాల్లో పాత ఇనుప సామాను, కాలం చెల్లిన నూకలు, చింతపండు కొంటుండడం చూశాం... కానీ కొత్తగా పాత సెల్‌ఫోన్లు కొంటామంటూ గ్రామాలు, నగరాల్లో బిహార్ ముఠా సభ్యులు సంచరిస్తూ నయా మోసానికి తెరలేపారు. వినియోగం లేని సెల్‌ఫోన్‌ను రూ.100 నుంచి 1000లోపే కొనుగోలు చేసి సెల్‌ఫోన్ యాజమాని, వారి కాంటాక్ట్ లిస్టులో ఉన్న వ్యక్తుల నుంచి లక్షల్లో డబ్బులను కొల్లగొడుతున్నట్లుగా తెలుస్తోంది. ఐదు నెలల కిందట రామగుండం కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని పవర్ హౌస్‌లో పాత్ సెల్‌ఫోన్‌లు కొనుగోలు చేసే ముఠా పట్టుబడగా ఆసక్తికరమైన విషయాలు రాబట్టారు. తెలంగాణలో కొనుగోలు చేసిన సెల్‌ఫోన్‌లను కొన్ని భాగాలు మార్చి జామ్‌తారా, దేవ్‌ఘర్, జార్ఖండ్‌కు తరలించి అక్కడ సైబర్‌క్రైమ్‌కు పాల్పడే నేరగాళ్లకు విక్రయిస్తున్నారనే సమాచారం పోలీసు విచారణలో తేలింది. సైబర్ నేరగాళ్లు వారి సిమ్‌లను ఉపయోగించి పాత సెల్‌ఫోన్ యాజమాని ఖాతాను లూటీ చేస్తున్నట్లుగా పోలీసులకు దృష్టికి వచ్చింది. కాగా, అదే తరహాలో బిహార్‌కు చెందిన ఏడుగురు వ్యక్తులు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ పరిధిలోని ఓ పోలీసు డివిజన్‌లో గదిని అద్దెకు తీసుకొని గ్రామాలు, కాలనీల్లో వేలాదిగా పాత సెల్‌ఫోన్‌లు సేకరించి సైబర్ నేరగాళ్లకు అప్పగించే పనిలో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ విషయం కమిషనరేట్ పరిధిలోని ఓ ప్రత్యేక విభాగం దృష్టికి వచ్చినప్పటికీ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లుగా తెలుస్తోంది.

ఇందిరమ్మ ప్రభుత్వంలోనే
పేదలకు న్యాయం



- రూ.45వేల కోట్లతో నాలుగు పథకాల అమలు
- ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- అర్హులైన ప్రతీ పేద కుటుంబానికి రేషన్‌కార్డు
- వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా
- భూమిలేని ప్రతీ పేద కుటుంబానికి ఆత్మీయ రైతు భరోసా
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పెంబర్తిలో నాలుగు పథకాల ప్రారంభోత్సవం

5


రైతు భరోసా పత్రంతో వృద్ధురాలు | పెంబర్తి గ్రామంలో మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని అందిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

వైఎస్‌ను తలపించేలా
రేవంత్‌రెడ్డి పాలన

- పేద ప్రజల కోసమే ముఖ్యమంత్రి ఆలోచన
- పదేళ్లలో చేయలేని పనులు ఏడాదిలో చేస్తున్నాం..
- బీఆర్‌ఎస్ నేతల ఆరోపణలు అర్థరహితం
- గ్రామాల్లో కూర్చొని, అధికారులను పంపించి పథకాలు ఇస్తున్నాం..
- రాష్ట్ర అటవీ, దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వెంకట్రావుపల్లి (బొక్కలగూడెం) గ్రామంలో నాలుగు పథకాల ప్రారంభోత్సవం

4



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ




మల్లన్న సన్నిధిలో బోనాలు, పట్నాలు

ఐనవోలు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతరలో భాగంగా రెండో ఆదివారం భక్తులు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిదిచేశారు. స్వామి వారికి ఉదయం మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వీకులను స్మరించారు. ఆపదల నుంచి గట్టెకించి కోర్కెలు తీర్చమని మల్లన్నను భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టచెప్పారు. రథం(శావ)లో ఉత్సవవిగ్రహాలను పెట్టి ఆలయం చుట్టూ భక్తులు లాగుతూ ప్రదక్షిణలు చేశారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


మామునూరు వద్ద అదుపుతప్పిన కంటైనర్ లారీ, స్తంభాలు పడడంతో నుజ్జు నుజ్జు అయిన ఆటో

మృతులు ఆర్తి చౌహాన్, కన్నా చౌహాన్, సంతోష్ చౌహాన్, కిరణ్ చౌహాన్



నలిగిన వలస బతుకులు

కంటైనర్ స్తంభాలు మీదపడి నలుగురి మృత్యువాత

- రెండు ఆటోలపై కంటైనర్‌లోని ఇనుప స్తంభాల బోల్తా
- వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై ఘటన
- మృతులంతా మధ్యప్రదేశ్ భోపాల్ వలస కార్మికులు
- కంటైనర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఘోర ప్రమాదం
- ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి సురేఖ, కలెక్టర్, సీపీ

5

వలస జీవులను మృత్యువు కంటైనర్ లారీ రూపంలో కబళించింది. పొట్టకూటి కోసం రాష్ట్రానికి వచ్చిన వారిపై విధి పగబట్టినట్లు అయింది. బతుకుదెరువు కోసం తాము తయారు చేసిన కత్తులు, ఈలపీటలు అమ్ముకునేందుకు ఆటోలో వెళుతున్న నిరుపేద కుటుంబంపై కంటైనర్‌లోని ఇనుప స్థంభాలు పడడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. స్తంభాల బరువుకు దేహాలు చితికిపోయాయి. ఈ ఘటనలో అదే కుటుంబంలో ఇద్దరు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘోర ప్రమాదం వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఉదయం జరిగింది.

- మామునూరు(ఆంధ్రజ్యోతి)

ఎన్‌పీడీసీఎల్ సీఎండీకి బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అవుట్ స్టాండింగ్ పర్ఫార్మెన్స్‌లో భాగంగా రాష్ట్ర స్థాయిలో 13 మందిని ఎంపిక చేయగా టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అందులో ఒకరు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు.

నాగార్జున హోండా ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న నాగార్జున హోండా షోరూం సిబ్బంది

మట్టెవాడ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డుభద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని వరంగల్ ములుగు రోడ్డులోని నాగార్జున హోండా షోరూమ్ ఆధ్వర్యంలో ఆదివారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షోరూం సిబ్బంది, మేనేజర్‌లు ఎంజీఎం సర్కిల్ వరకు హెల్మెట్ ధరించి వాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు బహుమతులను అందచేశారు ఈ సందర్భంగానాగార్జున హోండా షోరూం మేనేజర్ సిద్ధార్థ మాట్లాడుతూ.. వాహన చోదకులు రహదారి భద్రత నియామలను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం మేనేజర్ సిద్ధార్థ, దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో శ్రీచేతన్ శౌర్య సత్తా

• బాలుర డబుల్స్‌లో స్వర్ణం, సింగిల్స్ విభాగంలో రజతం కైవసం



బాలుర డబుల్స్‌లో స్వర్ణ పతకం సాధించిన శ్రీచేతన్ శౌర్య జోడికి ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ గచ్చిబౌలిలోని సాయి గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 26 వరకు నిర్వహించిన అనంత్ బజాజ్ మెమోరియల్ తెలంగాణ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2025లో హనుమకొండకు చెందిన సామల శ్రీచేతన్ శౌర్య అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ, రజత పతకాలను సాధించాడు. అండర్-15 బాలుర డబుల్స్‌లో స్వర్ణ పతకం, సింగిల్స్ విభాగంలో రజత పతకం కొల్లగొట్టి అందరి మన్ననలను పొందుతున్నాడు శ్రీచేతన్ శౌర్య. ఈ మేరకు శ్రీచేతన్‌శౌర్యను వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రమేష్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

వైఎస్‌ను తలపించేలా రేవంత్‌రెడ్డి పాలన

- పేద ప్రజల కోసమే ఆయన ఆలోచన
- రాష్ట్ర అటవీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వెంకట్రావుపల్లి(బొక్కలగూడెం) గ్రామంలో పథకాల ప్రారంభోత్సవం



వర్ధన్నపేట మండలంలోని వెంకట్రావుపల్లిలో లబ్ధిదారులకు పథకాలను పంపిణీ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

వర్ధన్నపేట రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని తలపించేలా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఉందని రాష్ట్ర అటవీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కొనియాడారు. నిరంతరం పేద ప్రజల కోసమే ఆయన ఆలోచిస్తున్నారని అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని వెంకట్రావుపల్లి(బొక్కలగూడెం) గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 30 మంది, 108 మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు, రైతు భరోసా కింద 347 మందికి, 91 మందికి ఇందిరమ్మ ఇళ్లు అందించి నాలుగు పథకాలను ప్రారంభించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాడని తెలిపారు. అందులో భాగంగా ఉచిత బస్సు సౌకర్యం, రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నారని తెలిపారు. రైతులకు రుణమాఫీ రూ.2లక్షల వరకు ఏకకాలంలో చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.30వేల వరకు చేసి మిగతా డబ్బులు రైతులే చెల్లించే పరిస్థితి ఉండేదని ఆరోపించారు. అధికారులను ఇంటింటికీ పంపించి ప్రతి ఒక్కరూ డేటాను సేకరించి అర్హులైన వారికి పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా వేల ఎకరాల భూములను బీఆర్ఎస్ నేతలు కొల్లగొట్టారని, అందుకే సీఎం రేవంత్‌రెడ్డి భూభారతిని తీసుకుని మీ భూములు మీకు దక్కే విధంగా చేస్తున్నాడని గుర్తు చేశారు. సన్న వరికి రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. పంట పండించడానికి యోగ్యమైన వ్యవసాయ భూమికి రైతు భరోసా అందిస్తామన్నారు. ప్రజాధనం వృథా అయ్యేలా ఇతరత్రా వాటికి రైతు భరోసా ఇవ్వబోమని తెలిపారు. అనర్హులు తప్పుడు సమాచారం ఇచ్చి పథకాలు పొందితే వాటిని రద్దు చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. అందరి సమక్షంలో అర్హులైన వారిని గ్రామ సభలో ఎంపిక చేస్తామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ వంద మాటలు చెప్పి ఒక్క పనిచేయలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇస్తానని ప్రజలను మభ్యపెట్టాడని విమర్శించారు. ప్రజలు గమనించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రతిపక్ష నాయకులు చెడగొట్టే ప్రయత్నం చేసినప్పుడు వారిని నిలువరించి ప్రశ్నించాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులను ఎంపిక చేశామన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మరిన్ని ఇవ్వాలి..

వర్ధన్నపేట నియోజకవర్గంలో విలీన గ్రామాలతో పాటు దళిత కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పి మరో 1500 ఇండ్లు మంజూరు చేయించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మంత్రి కొండా సురేఖను కోరారు. ప్రజాపాలన పథకాల ప్రారంభోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్ రెడ్డి యేడాదిలోనే హామీలన్నీ నెరవేర్చే దిశగా పనిచేస్తున్నారని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. అధికారులు ఇంటింటికీ తిరిగి అర్హులైన వారిని పారదర్శకంగా గుర్తించారని స్పష్టం చేశారు. అర్హులపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఫిర్యాదు చేయొచ్చన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హులు ఉంటే మళ్లీ ఫిర్యాదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీడీవో వెంకటరమణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల యూత్ అధ్యక్షుడు కుల్ల యాకాంతం, జిల్లా నాయకుడు పోశాల వెంకన్న, బాషా తదితరులు పాల్గొన్నారు.

బీవీ రావు కోళ్ల పరిశ్రమకు చేసిన సేవలు ఎనలేనివి

నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

న్యూశాయంపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ పితామహుడు డాక్టర్ బీవీరావు కోళ్ల పరిశ్రమకు చేసిన సేవలు ఎనలేనివని నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని నెక్ కార్యాలయంలో ఆదివారం బీవీరావు 29వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు, వరంగల్ ఉమ్మడి జిల్లా పౌల్ట్రీ పార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మార్తినేని ధర్మారావు బీవీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరటికే పరిమితమైన కోళ్లను బీవీరావు పరిశ్రమ స్థాయికి తీసుకువచ్చి పరోక్షంగా, ప్రత్యక్షంగా లక్షల మందికి ఉపాధి కల్పించిన తీరును వివరించారు. కోళ్ల రైతులు నష్టాల ఊబి నుంచి బయటపడాలంటే జాతీయ స్థాయిలో ఎగ్ బోర్డు ఉండాలన్నారు. అనంతరం బీవీరావు స్మారకార్థం ప్రజలకు ఉడుకబెట్టిన కోడిగుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నెక్ వరంగల్ జోన్ మార్కెట్ సూపర్‌వైజర్ కె.వినయ్ పటేల్, నెక్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు ఉచితంగా ఉడకబెట్టిన కోడిగుడ్లను పంపిణీ చేస్తున్న ప్రదీప్‌రావు, ధర్మారావు

ఎస్సార్‌యూలో ఘనంగా ముగిసిన స్పార్కిల్ వేడుకలు





సర్టిఫికెట్లు అందిస్తున్న వరదారెడ్డి, పాటలు పాడుతున్న గాయని షణ్ముఖ ప్రియ

హసన్‌పర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సార్ విశ్వవిద్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్పార్కిల్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి, ప్రోచాన్స్‌లర్ ఎ.మధుకర్‌రెడ్డి, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ ఏవీవీ.సుధాకర్, స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్లు శశిధర్‌రెడ్డి, భావన, పానిశ్రీలు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులప్రతిభను వెలుగులోకి తెచ్చే విధంగా ఈ వేడుకలు కొనసాగాయి. కాక్టైల్ థీమ్ ప్రదర్శన ద్వారా ఆకర్షణీయ ప్రదర్శనల శ్రేణి ప్రారంభమైంది. ప్రముఖ గాయని షణ్ముఖ ప్రియ పాటలు సభికులను ఉర్రూతలూగించింది. విద్యార్థులు ఆమె పాటలతో నృత్యాలు చేస్తూ కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా వెల్‌కం డాన్స్, క్లాసికల్ ఫ్యూజన్, హనుమాన్ థీమ్ ప్రదర్శన భారతీయ పురాణగాథలను, శక్తిని ప్రతిబింబిస్తూ ప్రేక్షకులను అలరించింది. డ్రామా యాక్ట్ భావోద్వేగపూరితంగా కొనసాగగా, ఫోక్ థీమ్ ప్రదర్శన భారతీయ సంప్రదాయాలను వికసింపజేసింది. గ్యాంగ్‌స్టర్ థీమ్ డ్యాన్స్ ఉత్సాహాన్ని నింపగా ఫ్యాషన్ ర్యాంప్ వాక్ షో సభికులను అబ్బురపరిచింది. సూట్స్ అండ్ బూట్స్ థీమ్ ప్రదర్శన ఆకర్షణీయంగా సాగగా సే నో టూ డ్రగ్స్ అవేర్‌నెస్ యాక్ట్ సామాజిక సందేశాన్ని వ్యక్త పరిచింది. కోర్ 3 గ్రూప్ యాక్ట్ సమన్వయం, సృజనాత్మకతను చాటాయి. ఈ సాంస్కృతిక కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

హనుమకొండ టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-1 డిపోలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్ధిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్లలో ప్రయాణించే ప్రయాణికులు సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959226047 నంబర్‌కు సంప్రదించి రూట్లల్లో పలు సమస్యలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని ప్రయాణికులను కోరారు.

ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలి

- మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడం అభినందనీయం
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనతో ఎస్సీ జనాభా 18 నుంచి 19 శాతం వరకు పెరిగినందున ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతంకు పెంచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కమిషన్లు, చర్చల పేరుతో కాలయాపన చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని సూచించారు. ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాటం చేసిన మంద క్రిష్ణకు పద్మశ్రీ రావడం అభినందనీయమన్నారు. పద్మశ్రీ రావడం మాదిగ, మాదిగ ఉపకులాలకు దక్కిన గౌరవం అన్నారు. సెక్యూలర్ అనే పదాన్ని రాజ్యాంగం నుంచి తొలగించాలని చూస్తున్నారని, రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రలు చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం దళితులు, మైనార్టీలపై వివక్షత చూపుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించడం గర్వకారణమని అన్నారు.సమావేశంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, బెలిదె వెంకన్న, సీహెచ్ నరేందర్‌రెడ్డి, అంబటి కిషన్‌రాజ్, గన్ను నర్సింహులు, తెల్లాకుల రామకృష్ణ, లింగాజీ, జేసీ రెడ్డి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

- మామునూరు ఏసీపీ బి.తిరుపతి
- అట్టహాసంగా ఏకశిల జూనియర్ కళాశాలల స్పార్కింగ్ సెలబ్రేషన్స్



మాట్లాడుతున్న మామునూరు ఏసీపీ తిరుపతి

ఐనవోలు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ప్రయోజకులుగా మారి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని మామునూరు ఏసీపీ బి.తిరుపతి తెలిపారు. ఏకశిల జూనియర్ కళాశాలలు సంయుక్తంగా స్పార్కింగ్ సంబరాలు అట్టహాసంగా పున్నేలు ఏకశిల ఈ టెక్నో పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఏసీపీ హాజరై మాట్లాడుతూ.. కాలం విలువ గుర్తించిన వారే విజయ తీరాలు అందుకుంటారన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న సినీ గేయ రచయిత గాయకుడు కాసర్ల శ్యామ్ మాట్లాడుతూ.. విద్యే విత్తనం విద్యార్థి దేశ భవిష్యత్తును పండించే తోటమాలని తెలిపారు. అధ్యక్షత వహించిన చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఏకశిల విద్యార్థులు అనేక పోటీ పరీక్షల్లో సాధించిన విజయాలు ఏకశిల కీర్తి ప్రతిష్టలను జాతీయస్థాయిలో చాటుతున్నారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం పూర్తి ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు. ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఐఐటీ, నీట్ పోటీ పరీక్షల్లో అర్హులైన విద్యార్థులకు నగదు పారితోషికం ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, మచ్చ జితేందర్‌రెడ్డి, కళాశాలప్రిన్సిపల్ ఇ.తిరుపతిరెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కేయూ క్యాంపస్ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసంనారాయణ ఉద్బోధించారు. రెండు రోజులుగా నెహ్రూయువకేంద్రం, గణితశాస్త్ర విభాగం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా కేయూలో యువతకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ గణితశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన ముగింపు సదస్సులో ఈసం నారాయణ రెండు రోజుల పాటు శిక్షణ పొందిన యువత, విద్యార్థులకు సర్టిఫికెట్లను అందచేశారు.

పరేడ్ గ్రౌండ్‌లో సందడే సందడి..

- ఆకట్టుకున్న గణతంత్ర కార్యక్రమాలు
- పోలీసు కవాతు, విద్యార్థుల నృత్యాలు
- స్వాతంత్ర్య యోధులకు సన్మానం
- ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు



హనుమకొండలోని పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వరంగల్ క్రైం/హనుమకొండ టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీస్ కవాతు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమాలకు ముందుగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై జెండావిష్కరించారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం చేశారు. అడ్మిన్ రిజర్వుడ్ ఇన్స్‌పెక్టర్ స్వర్ణన్‌రాజు సారథ్యంలో కమిషనరేట్‌లో వివిధ విభాగాలకు చెందిన పోలీసులు ఆరు ప్లాటూన్స్‌గా ఏర్పడి మార్చ్‌పాస్ట్ చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలపై ప్రసంగించారు. తర్వాత వేదికకు ఎడమవైపు ఉన్న గ్యాలరీలో కూర్చొన్న స్వాతంత్ర్య సమర యోధుల దగ్గరికి సీపీ అంబర్ కిషోర్ ఝా, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా యంత్రాంగంతో కలిసి వెళ్లి శాలువాలతో సత్కరించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులతో పాటు వేడుకలను చూసేందుకు తరలొచ్చిన సందర్శకులను ఆకట్టుకున్నాయి. మొదటగా మడికొండ టీజీఎస్‌డబ్లూఆర్ విద్యార్థినులు, రెండో నృత్యం మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన దివ్యాంగుల ప్రదర్శన, మూడో నృత్యంగా ధర్మసాగర్ మండలం నారాయణగిరి జడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన బాలికల ప్రదర్శన, నాలుగో నృత్యంగా ఎర్రగట్టు గుట్ట సమీపంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ బాలికల ప్రదర్శించిన నృత్యాలు అలరింపజేశాయి. నృత్యాల అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులతో కలెక్టర్, సీపీ, మున్సిపల్ కమిషనర్, మేయర్ గ్రూప్ ఫొటో దిగి వారిలో ఉత్సాహాన్ని నింపారు.

బోసిపోయిన స్టాల్స్.. సందర్శకులు నిల్..

వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్, సీపీ సందర్శించి స్టాల్స్‌లోని ఉన్న పరికరాలను పరిశీలించారు. డీఆర్‌డీఏ, మెప్మా, అగ్రికల్చరల్, ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమలు, జిల్లా ఆరోగ్యశాఖ, చైల్డ్ అండ్ ఉమెన్, మత్స్య శాఖ ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కాగా, 12 స్టాల్స్ నిర్వహణకు ఏర్పాటు చేయగా 9 మాత్రమే ఏర్పాటు చేశారు. మిగతా 3 స్టాల్స్‌ను ఖాళీగానే కనిపించాయి. ఉన్న స్టాల్స్‌కు సందర్శకులు లేక ఆదరణ కరువైంది. ప్రచారం కల్పించడంలో సైతం విఫలమైనట్లుగా తెలుస్తోంది. కేవలం స్టాల్స్‌లో సిబ్బంది, అధికారులు సెల్ఫీలకు మాత్రమే ఉపయోగపడ్డాయి.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అవార్డుల ప్రదానోత్సవం

విధుల్లో ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల్లోని ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అదే విధంగా సామాజిక సేవల్లో ఉన్న వ్యక్తులను సైతం గుర్తించి ప్రశంసా పత్రం అందజేశారు. ముందుగా పోలీసుశాఖలో జాతీయ స్థాయిలో అతి ఉత్కృష్ట, ఉత్కృష్ట పతకాలు పొందిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ బాలాజీ వరప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ మల్లారెడ్డి, మహేశ్వర్, కానిస్టేబుల్ విజయ్‌కుమార్‌కు సీపీ, కలెక్టర్ మెడల్స్ అందజేశారు.

విద్యార్థులకు బహుమతుల

రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రిపబ్లిక్‌డే వేడుకలను పురస్కరించుకొని రవాణా శాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి రోడ్డు భద్రతపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్, డ్రామా పోటీల్లో విజేతలకు నిలిచిన విద్యార్థులకు కలెక్టర్, సీపీ, మున్సిపల్ కమిషనర్, మేయర్‌తో కలిసి డీటీసీ పుప్పాల శ్రీనివాస్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.



క్యాతంపల్లిలో పథకాల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- క్యాతంపల్లి గ్రామంలో లబ్ధిదారులకు పథకాల పంపిణీ

ధర్మసాగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు పథకాలను వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చి ఏడాది గడిచి రెండో ఏడులోకి అడుగు పెడుతున్నామన్నారు.

ఈ క్రమంలో పేదలు, రైతుల గుండెల్లో ఇందిరమ్మ బొమ్మ ఉండేలా ప్రజల కోరికలు తీర్చేలా పథకాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 606 మండలాల్లో మండలానికో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంటామన్నారు. క్యాతంపల్లిలో నాలుగు సంక్షేమ పథకాలు అధికారికంగా ప్రారంభించినట్టు మంత్రి తెలిపారు. రూ.21వేల కోట్లతో 2.60 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసి వారి ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. గత ఏడాది నుంచి ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రభుత్వం అమలు చేసిందని కొనియాడారు. గత ప్రభుత్వం రైతులకు ఎకరానికి రూ.10వేలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12వేలు అమలు చేసిందన్నారు. 2004. నుంచి 2014వరకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా 4.50లక్షల ఇండ్లను ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 3500 ఇళ్ల కంటే అదనంగా ఇచ్చేలా కృషి చేస్తామన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. గ్రామంలోని 713మందికి రైతు భరోసా ఇస్తున్నామని, 43 మంది భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నామన్నారు. 207మందికి కొత్త రేషన్‌కార్డులను ఇవ్వబోతున్నామని తెలిపారు.

355 మందికి ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్నామని తెలిపారు. గ్రామ సభ ద్వారా సుమారు 1300మంది లబ్ధిదారులకు నాలుగు పథకాల ద్వారా లబ్ధి జరుగనుందన్నారు. రాష్ట్రం 7లక్షల కోట అప్పులో ఉందన్నారు. ప్రతీనెల అప్పుతో పాటు మిత్తీ కడుతున్నామని, మిగిలిన డబ్బులు సర్దుబాటు చేసుకుని పేద ప్రజల సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. వరంగల్ ఎంపీ కావ్య మాట్లాడుతూ.. వరంగల్‌ను రెండో రాజధానిగా మార్చి అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన మాటను గుర్తు చేశారు. ప్రభుత్వం ఏడాది కాలంలో 55 వేల ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా వరంగల్ అభివృద్ధి కోసం రూ.6వేల కోట్లను మంజూరు చేశారన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి రూ.750కోట్ల నిధులు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ స్టేట్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎంపీడీవో అనిల్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

- రూ.45వేల కోట్లతో నాలుగు పథకాల అమలు
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాసరెడ్డి
- పెంబర్తిలో నాలుగు పథకాల ప్రారంభోత్సవం

హసన్‌పర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండలంలోని పెంబర్తిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఆదివారం అధికారికగా ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవెన్యూ గృహ నిర్మాణాల సమాచార శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అతిథులుగా అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ప్రజలను, పాలనను పూర్తిగా మరిచిపోయి కేవలం వాళ్ల సొంత సంపాదనే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. గ్రామాల్లో ఒక రేషన్ కార్డు కావాలా? ఒక ఇల్లు కావాలా? అని ఇప్పుడు కూడా ప్రజల దగ్గరకు వచ్చిన పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ఎన్నికల ముందు తెలంగాణకు వచ్చి ఏవైతే హామీలు ఇచ్చి ఆరు పథకాలు అమలు చేస్తామని చెప్పారో.. వాటిని అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నాలుగు పథకాల అమలుకు దిశానిర్దేశం చేశారని చెప్పారు. అర్హులైన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు, ఆత్మీయ భరోసా కింద ప్రతీ పేద కుటుంబానికి యేటా రూ.12వేలు, రైతు భరోసా కింద రెండు విడతలుగా రూ.12వేలు, అర్హులైన పేదవాడికి తెల్ల రేషన్‌కార్డులు అందజేస్తామన్నారు.

ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500లకే గ్యాస్, వరి పండించే రైతులకు మద్దతు ధర రూ. 2320తో పాటు సన్న వడ్లకు బోనస్ రూ.500లు చెల్లిస్తున్న ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదే నన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్‌లో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా 25,600 మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. ప్రభుత్వం ఇప్పుడు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నాలుగు పథకాలకు రూ.45వేల కోట్లు ఖర్చు అవుతుందని తెలిసీ కష్టమైనా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామన్నారు.



మాట్లాడుతున్న సురేఖ



మాట్లాడుతున్న నాగరాజు

దేశానికి రోల్‌మాడల్

ఇందిరమ్మ రాజ్యమంటేనే దేశానికి రోల్‌మోడల్ అని కొండా సురేఖ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపిస్తూ నాలుగు పథకాలను అమలుకు శ్రీకారం చుట్టామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు అందేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఎంత లోటు ఉన్నా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెరవేర్చే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందన్నారు. ఇప్పటికే 56వేల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులకు అండగా నిలిచామన్నారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. అనర్హులైన వారు సంక్షేమ పథకాలు పొందితే తప్పకుండా ప్రభుత్వం వారి పథకాలను రద్దు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గంలో పంచాయతీ గ్రామాలతో విలీన గ్రామాలున్నాయని, అందులో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలే అధికంగా ఉన్నారన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి అదనంగా 1500 ఇండ్లు కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని అభ్యర్థించారు. అంతేకాకుండా ఈ నియోజకవర్గానికి అదనంగా నిధులు కూడా మంజూరు చేయాలని కోరారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలను, రైతులను కాపాడుకుంటోందన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో అర్హులైన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు అందేవిధంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎప్పుడు దరఖాస్తు చేస్తే అప్పుడే ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ సెక్రెటరీ రామక్రిష్ణ, స్పెషలాఫీసర్ అనిల్‌కుమార్, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నర్సింహారెడ్డి, పంచాయతీ స్పెషలాఫీసర్ నాగవెల్లి శ్రీనివాస్, హౌసింగ్ నోడల్ ఆఫీసర్ రాజేందర్, తహసీల్దార్ చల్ల ప్రసాద్, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఏవో అనురాధ, ఏపీవో విజయలక్ష్మీ, ఏపీఎం ప్రభాకర్, ఏఈవో శైలజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, మధన్, చిర్ర విజయ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, జిల్లా, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారి ఆలయంలో రథ సేవ

భక్తులకు అన్నప్రసాద వితరణ

వరంగల్ కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం రథ సేవ నిర్వహించారు. అమ్మవారు ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తుల జై కారాలతో ఆలయంలో రథ సేవను నిర్వహించారు.

అలాగే మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఆలయం వెలుపల భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గణతంత్ర దినోత్సవం ఆదివారం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. రాత్రి అమ్మవారికి మహా హారతి పూజ నిర్వహించారు.

జనగామలో టెన్షన్.. టెన్షన్

- మంత్రి పొంగులేటి పర్యటన నేపథ్యంలో ఉద్రిక్తత
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ
- ఆందోళన నేపథ్యంలో మంత్రి పర్యటన రద్దు

జనగామ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జనగామ మండలం ఎర్రకుంటతండాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటన సందర్భంగా హై టెన్షన్ వాతావరణం ఏర్పడింది. సభా వేదిక వద్దే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర ఘర్షణ నెలకొంది. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల ప్రారంభ కార్యక్రమాన్ని ఎర్రకుంటతండాకు మధ్యాహ్నం 2.30గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం హాజరు కావాల్సి ఉంది. దీని కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంత్రి పర్యటన నేపథ్యంలో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఇదే కార్యక్రమంలో ఎమ్మెల్యే హోదాలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా హాజరు అయ్యేందుకు సభా వేదిక వద్దకు వచ్చారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో ముందస్తు అరెస్టులు చేసిన బీఆర్‌ఎస్ నాయకులను విడుదల చేయాల్సిందిగా కోరారు. ఇదే సమయంలో అక్కడే ఉన్న కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే పల్లాను చూసి పల్లా.. గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఇరు వర్గాలు కాంగ్రెస్ జిందాబాద్.. పల్లా గోబ్యాక్ అంటూ పోటాపోటీగా నినాదాలు అంతటితో ఆగకుండా సభలో ఉన్న కుర్చీలను విసిరేసుకున్నారు. గమనించిన పోలీసులు లాఠీలను ఝుళిపించారు. పోలీసులు లాఠీచార్జి చేయడంతో జనగామ మండలం వెంకిర్యాలకు చెందిన తాళ్లపల్లి అశోక్ చేతికి, గానుగుపహాడ్‌కు చెందిన గుర్రం కుమార్‌కు మోకాలికి గాయమైంది. ఆందోళన జరుగుతుండడంతో ధర్మసాగర్ పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి ఎర్రకుంటతండా పర్యటనను రద్దు చేసుకున్నారు. ఇదే విషయాన్ని స్టేజీ మీద అధికారులు ప్రకటించారు. ఈ సమయంలో ఎమ్మెల్యే పల్లా మైక్ తీసుకొని మాట్లాడబోతుండగా కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారి నినాదాలు చేస్తూ పల్లా పైకి రాళ్లు, కోడిగుడ్లు విసిరారు. వెంటనే స్పందించిన పోలీసులు ఎమ్మెల్యే పల్లాను దూరంగా తీసుకొచ్చారు. కాంగ్రెస్ శ్రేణులు విసిరిన రాయి ఓ జర్నలిస్టుకు కంటికి తగిలింది. చికిత్స కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, గొడవ జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎర్రకుంటతండాకు వస్తున్నారని తెలియడంతో ఆందోళన మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావించారు. దీంతో డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ చేతన్ నితిన్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బలవంతంగా కారు ఎక్కించి జనగామకు తరలించారు. దీంతో ఉద్రిక్తత సద్దుమణిగింది. అనంతరం హడావుడిగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించి కార్యక్రమాన్ని ముగించారు.



ఎమ్మెల్యే పల్లా, పోలీసుల మధ్య వాగ్వాదం

భారీగా మోహరించిన పోలీసులు

మంత్రి పొంగులేటి పర్యటన నేపథ్యంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య ఘర్షణ తలెత్తే అవకాశం ఉందని భావించిన పోలీసులు భారీగా బలగాలను మోహరించాయి. జనగామతో పాటు వెస్ట్‌జోన్ పరిధిలోని నర్మెట్ట, రఘునాథపల్లి, జనగామ పోలీస్ స్టేషన్ల నుంచి సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించారు. మంత్రి పర్యటన సందర్భంగా ముందస్తుగా బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేశారు.



పల్లాను బలవంతంగా కారులో ఎక్కిస్తున్న పోలీసులు



లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

నలిగిన వలస బతుకులు

- రెండు ఆటోలపై కంటైనర్‌లోని ఇనుప స్తంభాల బోల్తా
- మృతులంతా మధ్యప్రదేశ్ భోపాల్ వలస కార్మికులు
- ప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి సురేఖ, కలెక్టర్, సీపీ

కంటైనర్‌లోని స్తంభాలు మీదపడి నలుగురి మృత్యువాత | వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై ఘటన

మామునూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంగాని రాష్ట్రం.. ప్రాంతం కాని ప్రాంతానికి పొట్టచేత పట్టుకుని బతుకుదెరువు కోసం వచ్చిన వారిపై ఓ కంటైనర్ లారీ మృత్యురూపంలో వచ్చిపడింది. కత్తులు, ఈలపీటలు తయారు చేసి విక్రయిస్తూ కడుపు నింపుకునేవారి జీవితాలు ఆ ప్రమాదంలో కడతేరాయి.. కుటుంబసమేతంగా వచ్చి జీవిస్తున్న వారి జీవితాలు ఒక్క నిమిషంలో ఒక్కసారిగా చిన్నాభిన్నమయ్యాయి. మద్యం మత్తులో వేగంగా భారీ కంటైనర్ లారీ నడుపుకుంటూ వచ్చిన డ్రైవర్.. రెండు ఆటోలను ఢీకొట్టి నలుగురు ప్రాణాలు బలిగొన్నాడు. వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు పోలీసుస్టేషన్ పక్కనున్న పెట్రోల్‌బంకు వద్ద ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలీలు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మామునూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

మధ్యప్రదేశ్ భోపాల్ లలితానగర్ ప్రాంతానికి చెందిన లోపిట సంతోష్ చౌహాన్(48) అనే వ్యక్తి బతుకు దెరువు కోసం భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులతో సహా వరంగల్ మామునూరు ప్రాంతానికి తొమ్మిది నెలల కిందట వచ్చారు. ఆయన కుటుంబంతో పాటు సుమారు ఆరు కుటుంబాలు కూడా ఇక్కడి వచ్చారు. వంటకు ఉపయోగించే కత్తులు, ఈలపీటలు తయారు చేసి వాటిని అమ్ముతూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో వారు తయారు చేసిన కత్తులు, ఈలపీటలు వరంగల్ నగరంలో విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం కూడా ఒకే ఆటోలో వీరందరూ వరంగల్ వైపు వెళ్తున్నారు. కాగా, కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతానికి చెందిన మరో ఆటోడ్రైవర్ రాపర్తి సాగర్ ఐనవోలు నుంచి వరంగల్ వైపు వేరే ఆటోలో వెళ్తున్నాడు. అదే సమయంలో విశాఖపట్టణం నుంచి నాగపూర్ వైపు విశాఖ ఉక్కు భారీ స్తంభాలు కలిగిన అధిక లోడుతో నాగపూర్‌కు చెందిన భారీ కంటైనర్ వాహనం వస్తోంది. మామునూరులోని పోలీస్‌స్టేషన్ పక్కనున్న పోలీసుపెట్రోల్ బంక్ దగ్గరికి రాగానే అధిక లోడుతో వెళ్తున్న 18 టైర్ల కంటైనర్ భారీ వాహనం అదుపుతప్పింది. పక్కనే ఉన్న రెండు ఆటోల మీద లారీలో ఉన్న ఇనుప స్తంభాలు మీద పడ్డాయి. ఈ ఘటనలో సంతోష్ చౌహాన్(48), ఆయన కుమార్తెలు ఆర్తి అలియాస్ పూజ చౌహాన్ (20), కిరణ్ చౌహాన్(12)లు అక్కడికక్కడే మృతిచెందగా.. ఆయన చిన్న కుమారుడు కన్నా చౌహాన్(7) ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతిచెందారు. కాగా, భార్య చామ బాయి(40), పెద్దకుమారుడు ముఖేష్ చౌహాన్(20)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరి ఆటో నడుపుతున్న పున్నేలు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మహ్మద్ షాకీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అలాగే వేరే ఆటోలో ఉన్న కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతానికి చెందిన మరో ఆటోడ్రైవర్ రాపర్తి సాగర్ (45) గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వారిని ఎంజీఎంకు తరలించారు.



కంటైనర్ లారీలోని స్తంభాలు మీద పడడంతో ఛిద్రమైన శరీరాలు

ఛిద్రమైన శరీరాలు

ఒకే కుటుంబానికి చెందిన వారిపై భారీ లోహపు స్తంభాలు పడటంతో సంఘటన జరిగిన స్థలంలో శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. ఇనుప స్తంభాల కింద వలస కూలీలు మృతదేహాలు ఇరుక్కుపోవడంతో అక్కడి స్థానికులు ప్రమాదం జరిగిన తీరును చూసి చలించిపోయారు. బతుకు దెరువుకోసం కులవృత్తిని నమ్ముకుని పలు ప్రాంతాలు తిరుగుతూ జీవనం కొనసాగిస్తున్న వీరి కుటుంబం రోడ్డు ప్రమాదంలో మరణించడంతో మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి.

ఎంజీఎంలో మిన్నంటిన రోదనలు

నలుగురు వలస జీవులు మృత్యువాత పడటంతో ఎంజీఎం ఆస్పత్రిలో వారి సంబంధీకులు చేస్తున్న రోదనలు ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టించాయి. ఆస్పత్రికి వైద్యానికి వచ్చిన రోగుల బంధువులు మానవత్వంతో భోజనం అందించే ప్రయత్నం చేయగా.. నోట్లోకి ఏమీ పోవట్లేదని రోదించారు. మా సొంతూరుకి మమ్మల్ని పంపిస్తే వెళ్లిపోతామని రెండు చేతులు జోడించి అమాయకంగా విలపించారు. దీంతో అక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ చలించిపోయారు.

సంఘటనా స్థలానికి కలెక్టర్, సీపీ

వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, ప్రమాద ఘటనా స్థలాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మునిసిపల్ కమిషనర్ తానాజీ వాకడే, ఇతర పోలీసు అధికారులు సందర్శించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని అధికారులకు స్థానికులు తెలిపారు. కాగా ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ముఖేష్ చౌహాన్ ఫిర్యాదు మేరకు మామునూరు పోలీసులు కేసు నమోదు చేసి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ ఓ.రమేష్ తెలిపారు.

మృతదేహాల తరలింపు

మామునూరు రోడ్డు ప్రమాద మృతులకు ఎంజీఎం మార్చురీలో వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆదివారం అయినా అధికారుల ఆదేశాలతో వైద్యులు పోస్టుమార్టం చేశారు. కాగా, సీపీ అంబర్‌కిషోర్ ఝా వాహనాలను సమకూర్చి మృతదేహాలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు తరలించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మృతదేహాల తరలింపు జరిగింది.

సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి

వరంగల్ మామునూరులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో గాయపడ్డ వారిని తక్షణమే మెరుగైన వైద్యం అందించేందుకు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, పోలీసు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కాగా, ఎంజీఎంలో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితులు ప్రైవేటు హస్పిటల్‌కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



నుజ్జునుజ్జు అయిన ఆటో



ప్రధాన రహదారిపై బోల్తా పడ్డ కంటైనర్ లారీ



మృతదేహాలను చాపలో తీసుకెళుతున్న పోలీసులు

క్షతగాత్రులకు మంత్రి సురేఖ ఆర్థిక సాయం



క్షతగాత్రుల కుటుంబాలను పరామర్శిస్తున్న మంత్రి సురేఖ

వరంగల్ క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం- వరంగల్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎంజీఎంలో వేర్వేరు వార్డుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంత్రి సురేఖ పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పూర్తిగా కోలుకునేంతవరకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. డ్రైవర్ మద్యం తాగి లారీ నడపటం వలనే ప్రమాదం జరిగినట్లుగా అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. మంత్రి వెంట వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

పంథిని వద్దే ఆటోను ఢీకొట్టిన కంటైనర్

ఐనవోలు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మామునూరు వద్ద ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీ.. తొలుత పంథిని వద్ద ఓ ఆటోను ఢీకొట్టి వేగంగా వెళ్లింది. ఆదివారం ఉదయం పంథిని నల్లబర్రె బ్రిడ్జి వద్ద ఆటోను వెనుకనుంచి ఢీకొనడంతో ఆటో పడిపోయింది. ఈ ప్రమాదంలో కక్కిరాలపల్లికి చెందిన ఆటో డ్రైవర్ చిర్ర రాజుకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగాక కంటైనర్ నిలపకుండా వరంగల్ వైపు వేగంగా వెళ్లింది. ఆటోడ్రైవర్ వెంబడిస్తాడనే భయంతో డ్రైవర్ అజాగ్రత్తగా, వేగంగా వెళ్లడంతో వాహనదారులు బెంబేలెత్తిపోయారు. డ్రైవర్ ప్రవర్తనను గమనించిన కొంత మంది 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చేలోపే మామునూరు వద్ద ప్రమాదం జరిగిపోయిందని ప్రత్యక్ష సాక్షులు వాపోయారు.



ప్రమాదానికి గురైన ఆటో

సోలార్ విద్యుత్ ప్యానెల్ ప్రారంభం

బాలసముద్రం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని శ్రీరామకృష్ణా సేవా సమితి భవనంలో 10 కేవీ సోలార్ విద్యుత్ ప్యానెల్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నీలిమా రెడ్డి ఆదివారం ప్రారంభించారు. వరంగల్ క్రెడాయి సహకారంతో సౌర విద్యుత్ ప్యానెల్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వరంగల్ క్రెడాయి అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ అధ్యక్షుడు చందుపట్ల సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి మనోహర్‌రెడ్డి, రజినీకాంత్‌తోపాటు రామకృష్ణా సేవా సమితి అధ్యక్షుడు కటంగూరు సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసస్వామి, అంజనీదేవి, స్వరూప పాల్గొన్నారు.



సోలార్ విద్యుత్ ప్యానెల్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే సతీమణి నాయిని నీలిమా రాజేందర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో..



జాతీయ జెండాకు వందన సమర్పణ చేస్తున్న ఎడిషన్ ఇన్‌చార్జ్, హెచ్‌ఓడీలు, సిబ్బంది

మడికొండ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని ఆంధ్రజ్యోతి వరంగల్ జిల్లా యూనిట్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎడిషన్ ఇన్‌చార్జ్ కొల్లు రాజేష్ మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పలువిభాగాల హెచ్‌ఓడీలు, మాస్టర్‌జీ స్కూల్ విద్యార్థులతో కలిసి త్రివర్ణ పతాకానికి వందన సమర్పణ చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏసీఎం ఎండీ.షరీఫ్, ఏడీవీటీ మేనేజర్ మాటేటి రమేష్, అకౌంటెంట్ సాయిని వెంకటేష్, ఎడిటోరియల్ అసిస్టెంట్ పబ్బ రాజేందర్, స్టోర్ ఇన్‌చార్జ్ గుండెబోయిన రవి, కార్యాలయ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్‌కిశోర్ ఝా

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా విద్యారణ్య సంగీత కళాశాల, ప్రభుత్వ పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన చిన్నారులు జాతీయ భావాన్ని పెంపొందించే గీతాలకు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన గేయాలు ఆలోచింపచేశాయి. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న చిన్నారులు, కళాకారులను కలెక్టర్ ప్రావీణ్య అభినందించారు. ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్ బాబు, సీపీ అంబర్‌కిశోర్‌ఝా దంపతులు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీవాకడే, వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఎఫ్ఓ లావణ్య, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్ పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు.

కేయూ అభివృద్ధికి పాటుపడుదాం..

- గణతంత్ర వేడుకల్లో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



వివేచన 20వ సంచికను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ సమగ్రాభివృద్ధికి సమష్టిగా పనిచేద్దామని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం 76వ గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేయూ పరిపాలన భవనం ఎదుట మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్సిటీ సమగ్ర సమాచారంలో రూపొందించిన వివేచన 20వ సంచికను రిజిస్ట్రార్ మల్లారెడ్డి, యూజీసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్ రెడ్డి, పీఆర్వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ బోధనేతర ఉద్యోగులకు శిక్షణ పొందిన ఉద్యోగులకు సర్టిఫికెట్లను అందచేశారు. రోడ్ స్టాపర్, దివ్యాంగుల ర్యాంప్‌లను రూపొందించిన వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలస్టూడెంట్స్‌కు సర్టిఫికెట్లను అందచేశారు.

ఎన్‌పీడీసీఎల్ కార్యాలయంలో..

రాంనగర్: నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ అశోక్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల అమరుల స్థూపం వద్ద పూలదండా వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, విజిలెన్స్ ఆఫీసర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం హనుమకొండలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. వేడుకలలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ పి.విజయ్‌చందర్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. హనుమకొండలోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన వేడుకలలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ జెండావిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ నాయకులు పాల్గొన్నారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు జెండా ఆవిష్కరించారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని గౌడ హాస్టల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా)జిల్లా అధ్యక్షులు, కేయూ పాలకమండలి సభ్యులు చిర్ర రాజుగౌడ్ జెండా ఆవిష్కరించారు. గోపా నాయకులు పాల్గొన్నారు.

- కాజీపేట: కాజీపేటలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బావుసింగ్, పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వైసుధాకర్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ జెండా ఆవిష్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో పాల్గొన్న విజేతలకు ఏడీఆర్ఎం ఎం.గోపాల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఎఫ్‌సీఐలో మేనేజర్ ధీరజ్‌రాజ్ జెండా ఆవిష్కరించారు. బాపూజీనగర్‌లో ప్రైవేట్ ఎలక్ట్రీషన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్సై శివకుమార్, 45వ డివిజన్ కడిపికొండలో యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కె.ఆర్. దిలీప్‌రాజ్ హాజరై జెండా ఆవిష్కరించారు. వడ్డెపల్లి ట్యాంక్‌బండ్‌పై వాకర్స్ అసోసియేషన్ జాతీయ జెండా ఆవిష్కరించారు. 47వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు సందెల విజయ్‌కుమార్ జెండా ఆవిష్కరించారు. రైల్వే ఓబీసీ కార్యాలయంలో జోనల్ అధ్యక్షుడు కె.చంద్రమౌళి హాజరై జెండా ఆవిష్కరించారు.
- మడికొండ : మడికొండలోని పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీస్ సిబ్బందితో కలిసి వందన సమర్పణ చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. దుర్గాబాయి మహిళా శిశు కేంద్రంలో డీఎం జయశ్రీ జాతీయ జెండాని ఎగురవేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి జాతీయ జెండాను ఎగురవేశారు. మడికొండలోని అయోధ్యాపురం రోడ్, టీఎన్జీవోస్ కాలనీలో కాలనీ అధ్యక్షులు లింగాల సూరిబాబు ఆధ్వర్యంలో కాలనీ వాసులు మువ్వన్నెల జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అంబేద్కర్ సంఘం వద్ద కమిటీ అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. కేంద్రీయ విద్యాలయంలో ఎలిశాల వెంకటేశం జాతీయ జెండాను ఎగురవేసి స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు.
- వడ్డెపల్లి: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని పాత గ్రామ పంచాయతీ వద్ద స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, రేణుక ఎల్లమ్మ ఆర్చీ వద్ద జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్‌రాజ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, ద్వారకాసాయి కాలనీ వద్ద సీవీఆర్ అధినేత వల్లాల రాజ్‌కుమార్‌గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న జంక్షన్‌లో బీజేపీ గోపాల్‌పూర్ జోన్ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్, దేవరాజ్ కాలనీలో మాజీ ఎంపీటీసీ దూలం నీరజ రాజు గౌడ్, గౌడ సంఘం కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత రమేష్‌గౌడ్, అంబేద్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ కందుకూరి రజినీకాంత్ జాతీయ పతాకాలను ఎగరవేసి జెండాలకు వందనం చేశారు. పింగిళి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్, వడ్డెపల్లి ఎన్జీవోస్ కాలనీలో రాష్ట్ర ఫిషర్‌మెన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మండల సమ్మయ్య, వడ్డెపల్లి చర్చి ప్రాంతంలో జైభీమ్ కన్వీనర్ తాళ్ల పెల్లి విజయ్ త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. టీపీసీసీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కందుకూరి పూర్ణచందర్, కాంగ్రెస్ రాష్ట్రనేతలు బీరం రవీందర్ రెడ్డి, కందుకూరి మహేందర్, బీజేపీ రాష్ట్ర నేత గోపాల్‌పూర్‌లో జాతీయ పతాకాలను ఎగరవేసి స్వీట్లను పంపిణీ చేశారు. 57వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణిరెడ్డి, గాంధీ నగర్‌లో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి త్రివర్ణ పతాకాలను ఎగరవేశారు. హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆవిష్కరించారు.



కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

- వరంగల్ ఎడ్యుకేషన్: గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి జెండాను ఆవిష్కరించగా, ఇంటర్ ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ బి.జయప్రదబాయి జెండాను ఆవిష్కరించారు. వరంగల్ హనుమకొండ డీఐఈవో కార్యాలయాల్లో డీఐఈవోలు శ్రీధర్‌సుమన్, గోపాల్ జెండాను ఆవిష్కరించారు. డీఈవో కార్యాలయాల్లో డీఈవోలు ఎం.జ్ఞానేశ్వర్, డి.వాసంతి జెండాను ఆవిష్కరించగా ఎంప్లాయిమెంట్ కార్యాలయాల్లో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్లు సీహెచ్. ఉమారాణి, ఎం.మల్లయ్యలు జెండాను ఆవిష్కరించారు. ఇరిగేషన్ కార్యాలయంలో ఎస్ఈ సీతారామ్‌నాయక్, ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఎస్ఈ నాగేందర్‌రావులు జెండాను ఆవిష్కరించారు.
- కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎ.నాగేశ్వర్‌రావు వర్సిటీ క్యాంపస్‌లోని రిటైర్డు ఉద్యోగుల సంఘం కార్యాలయ ఆవరణలో జెండాను ఆవిష్కరించారు. రిటైర్డు ఉద్యోగుల సంఘం నేతలు కృష్ణమాచారి, వెంకట్రాం నర్సయ్య పాల్గొన్నారు.
- హనుమకొండ (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ఇన్‌చార్జ్ అధ్యక్షుడు ఇరుకు కోటేశ్వర్‌రావు జెండాను ఆవిష్కరించారు. పెద్ద సంఖ్యలో రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. హనుమకొండ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో హనుమకొండ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వరంగల్ నిట్ పరిపాలనా భవన్ ఎదుట నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీన్స్, రిజిస్ట్రార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, నిట్ డైరెక్టర్ ధరించిన కోటుపై జాతీయ జెండా స్టిక్కర్ తలకిందులుగా ఉండడం చర్చనీయాంశం అయింది.

మోషన్ కళాశాలలో..

రాంనగర్: హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ ఇన్‌స్టిట్యూట్‌లో 76వ గణతంత్ర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని అమలు చేయడమే అంబేద్కర్‌కు ఘనమైన నివాళన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల సురేష్, అధ్యాపకులు అనూప్ కపూర్, సాహిల్ కత్యాల్, ప్రదీప్ పారక్, రామన్ సురేందర్ కళాశాల సిబ్బంది రాజు, సుమన్, రవీందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ భవన్‌లో..

హనుమకొండ సిటీ: హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడునాయిని రాజేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. బాలసముద్రంలోని ప్రజాభవన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కూడా రాజేందర్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో..

హనుమకొండ టౌన్: బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అంబేద్కర్, గాంధీల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో..

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిపాలన విభాగం భవన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణతంత్ర వేడుకల్లో సీపీ అంబర్ కిశోర్ ఝా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయుధ సిబ్బంది జాతీయ జెండాకు గౌరవ వందనం చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనరేట్ కార్యాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

- వరంగల్ కార్పొరేషన్ : జీడబ్ల్యూఎంసీలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను మేయర్ గుండు సుధారాణితో కలిసి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆవిష్కరించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన అధికారులకు, సిబ్బందికి మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే బల్దియా అధికారులు, కార్పొరేటర్లకు నిర్వహించిన క్రీడలలో విజేతలుగా నిలిచిన అధికారులకు, కార్పొరేటర్లకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజ్వానా మసూద్ షమీమ్, కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి, పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, గుండు చందన, రమ తేజస్విని, అరుణ కుమారి, బస్వరాజు శిరీష, ఇమ్మడి లోహిత, మరుపల్ల రవి, దిడ్డి కుమారస్వామి, నల్ల స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.
- హనుమకొండ(ఆంధ్రజ్యోతి): హనుమకొండ గోపాల్‌పూర్ రోడ్డులోని విశ్వవ్యాలీ స్కూల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ తిరుమలారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాణిరుద్రమదేవి, ఝాన్సీబాయి, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ తదితరుల వేషధారణలతో చిన్నారులు సాంస్కృతి ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవ్యాలీ స్కూల్ డైరెక్టర్లు ఆచ్చ జగదీశ్వర్, డి.వెంకటేశ్వర్ రావు, శ్రీధర్ రావు, విజయకుమార్‌తో పాటు టీచర్లు పాల్గొన్నారు.



డీసీసీ భవన్‌లో జెండాకు గౌరవ వందనం చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు



బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్, గాంధీలకు నివాళులర్పిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్



నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ ఇన్‌స్టిట్యూట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్‌గౌడ్



గోపాల్‌పూర్ రోడ్డులోని విశ్వవ్యాలీ స్కూల్‌లో వివిధ వేషధారణల్లో పాల్గొన్న చిన్నారులు



ఏసీపీ దేవేందర్ రెడ్డి



బాలాజీ వరప్రసాద్, సీఐ



వై.సతీష్, సీఐ



ఎం.రాజు, సీఐ



డేవిడ్ రాజ్, ఏసీపీ



రాజారెడ్డి, సీఎంహెచ్‌వో



కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్‌కిశోర్‌ఝా చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న డ్రైవర్ అశోక్‌కుమార్

అబాకస్‌లో రాష్ట్ర స్థాయికి గౌతమి పాఠశాల విద్యార్థుల ఎంపిక



తనుశ్రీని అభినందిస్తున్న రాజేశ్వర్‌రావు

హనుమకొండ టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా విశ్వం ఎడ్యూకేటివ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌జీవోస్ కాలనీలోని గౌతమి పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థి కె.తనుశ్రీ జిల్లా ప్రథమ స్థానంలో ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు తెలిపారు. కాగా విద్యార్థిని తనుశ్రీని, కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ముందస్తు అరెస్టులు సరికావు



అరెస్టు అయిన వారికి సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కార్యక్రమాలకు మంత్రులు హాజరైతే ప్రతిపక్ష నేతలను, కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ అన్నారు. ఆదివారం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ముందస్తు అరెస్టయిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అరెస్టయిన వారిలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మాజీ ఎంపీటీసీ తాళ్లపల్లి కుమారస్వామి, బీజేపీ నాయకులు మారపల్లి రాంచంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కందుకూరి చంద్రమోహన్, తదితరులున్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు

(3వ పేజీ తరువాయి)

రూ.63.67 లక్షలను ఖర్చు చేశామన్నారు. 2024-25 సంవత్సరానికిగాను స్త్రీనిధి పథకం ద్వారా 1,349 మహిళా స్వయం సహాయక సంఘాలోని 3,487మంది సభ్యులకు ఇప్పటివరకు రూ.32.85కోట్లను రుణంగా అందించామన్నారు. జిల్లాలో 1.03 లక్షల మందికి వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళ, బీడీ కార్మికులు, బోధకాలు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు, డయాలసిస్ రోగులకు ప్రతీ నెలా రూ.24.30 కోట్లు పంపిణీ చేస్తున్నట్టు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. పట్టణ పరిధిలోని ఎస్‌హెచ్ గ్రూప్‌లకు ఇందిరా మహిళా శక్తి కింద 2024-25 సంవత్సరంలో ఇప్పటివరకు 1,364 సంఘాలకు రూ.168.68కోట్లను రుణాలుగా అందించామని, మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో నగరంలో అయిదు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించినట్టు చెప్పారు.

పట్టణాభివృద్ధి

కొత్త మాస్టర్‌ప్లాన్‌లో వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలకు సంబంధించి 1805 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)లో చేర్చినట్టు తెలిపారు. రూ.95కోట్లతో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం పూర్తయిందని, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా దీనిని ప్రారంభించామన్నారు. రూ.30కోట్లతో భద్రకాళి ఆలయ మాడవీధుల నిర్మాణాన్ని చేపట్టామని, మొదటి దశ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.

పరిశ్రమలు

జిల్లాలో పారిశ్రామిక, సేవా రంగాల్లో 68 యూనిట్ల స్థాపనకు రూ.6.56 కోట్ల రాయితీ ఇచ్చామని, ఈ పరిశ్రమల ద్వారా 476 మందికి ఉపాధి లభించిందన్నారు. 49 పరిశ్రమలు 85 అనుమతులు కోరగా 54 ఇప్పించామని, దీని వల్ల రూ.227.21కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన పరిశ్రమల ద్వారా 3879 మందికి ఉపాధి లభించిందని వెల్లడించారు.

పర్యాటకం

భీమదేవరపల్లి మండలం వంగరలో రూ.11 కోట్లతో చేపట్టిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విజ్ఞాన వేదిక అభివృద్ధి పనులు చివరి దశలో ఉన్నాయని, గత ఏడాది ఐదు లక్షల మంది పర్యాటకులు జిల్లాకు వచ్చారని, జూపార్కులో కొత్త టైగర్ ఎన్‌క్లోజర్‌ను ప్రారంభించామని తెలిపారు.

విద్యుత్

జిల్లాలో అర్హులైన 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న 1.22 లక్షల మంది వినియోగదారులకు గృహజ్యోతి అమలవుతోందని, దీని కింద రూ.44.41 కోట్లు డిస్కంకు చెల్లించినట్టు చెప్పారు.

ఎస్సీ, ఎస్టీలకు..

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మినీ డైరీ పథకం కింద 30 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రెండు విడతల్లో నాలుగేసి గేదెలు, 78 మందికి మొదటి విడతగా రెండేసి గేదెలు ఇచ్చినట్టు చెప్పారు. 47 మందికి డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఎస్టీల అభివృద్ధిలో భాగంగా 4,554 మంది విద్యార్థులకు రూ.6.9కోట్ల పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్, పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌ల కింద రూ.7.30 కోట్లు, అంబేద్కర్ ఓవర్‌సీస్ విద్యానిధి కింద ఇద్దరు విద్యార్థులకు రూ.40లక్షలు చెల్లించినట్టు తెలిపారు. వెనుకబడిన తరగతుల విద్యార్థులకు పోస్టుమెట్రిక్ స్కాలర్ షిప్ కింద రూ.22.4కోట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.72.60 కోట్లు విడుదల చేశామన్నారు. మైనారిటీల సంక్షేమం కింద రూ.1.91కోట్లు, ఆర్‌టీఎఫ్ కింద రూ.8.50 కోట్లు మంజూరు చేశామన్నారు.

రోడ్ల అభివృద్ధి

సీఆర్ఆర్ నిధులతో 96.83 మీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.88 కోట్లు కేటాయించామని, ఎంఆర్ఆర్ నిధులతో 180 కి.మీ. మేర 70 రోడ్ల మరమ్మతులకు రూ.62.44కోట్లు మంజూరు కాగా, ఇందులో రూ.11.11 కోట్ల వ్యయంతో 43.58 కి.మీ. రోడ్లు పూర్తయ్యాయని అన్నారు. పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం పథకం కింద రూ.1.16కోట్లు విడుదల చేశామన్నారు. నగరంలో స్మార్ట్ పథకం కింద రూ.499.39కోట్లతో 66 రోడ్ల పనులు చేపట్టగా ఇందులో రూ.249.73కోట్లతో 48 పనులు పూర్తయ్యాయన్నారు. రూ.43.25కోట్ల మున్సిపల్ సాధారణ నిధులతో 359 పనులు మంజూరు కాగా, వీటిలో రూ.7.34కోట్లతో 173 పనులు పూర్తయ్యాయన్నారు. జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న సీఎంకు, ఎంపీలు, ఎంఎల్‌సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

న్యూశాయంపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంతో ఆదివారం మంద కృష్ణ మాదిగ స్వగ్రామం న్యూశాయంపేటలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మంద కృష్ణ ఫ్లెక్సీకి పూలు చల్లి స్వీట్లు పంపిణీ చేశారు. వేడుకలలో స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, ఎమ్మెస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు మంద ఇద్దయ్య, బొట్ల భిక్షపతి, బండారి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ న్యాయ కళాశాల విద్యార్థులకు అండగా ఉంటాం..

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్‌బాబు



లా కాలేజి ప్రిన్సిపాల్ సుదర్శన్‌తో జడ్జి రమేశ్‌బాబు, ఇతర అధికారులు

కేయూ క్యాంపస్ జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కోసం కోర్టులో అవకాశం కల్పిస్తామని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ సీహెచ్ రమేశ్‌బాబు చెప్పారు. ఆదివారం సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాలను జడ్జి రమేశ్‌బాబుతో పాటు డీఎల్ఎస్ఏ సెక్రటరీ క్షమాదేశ్‌పాండే ఇతర న్యాయాధికారులు సందర్శించారు. డీఎల్ఎస్ఏ దాతృత్వంగా న్యాయ కళాశాలకు ఇచ్చిన మూడు డెస్క్‌టాప్ కంప్యూటర్లను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ న్యాయ కళాశాల ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించారు.



ఒకప్పుడు వ్యవసాయ కూలీ. రోజు గడవడమే కష్టమయ్యేది. కానీ ఇప్పుడు... స్వయంశక్తితో ఎదిగి... కోటి రూపాయల టర్నోవర్ దాటిన కంపెనీకి అధిపతి అయ్యారు. జనపనార సంచుల తయారీ చేపట్టి... మరికొందరు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఎందరికో ఆదర్శంగా నిలిచిన ఆమెకు ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అరుదైన అవకాశం దక్కింది. పట్టుదలగా ప్రయత్నిస్తే అసాధ్యమేదీ లేదంటున్న **కల్పన**తో 'నవ్య' మాటామంతి.

స్వయంకృషితో ఎదిగి... మార్గదర్శిగా నిలిచి

"జీవితమంటేనే ఎన్నో ఆటుపోట్లు. అన్నిటినీ తట్టుకొని ముందుకు వెళితేనే జీవనం సాగించగలుగుతాం. రోజంతా కష్టపడినా ఇల్లు గడవని పరిస్థితుల నుంచి నేడు నా కాళ్లపై నేను నిలబడే స్థాయికి ఎదిగాను. నాలాంటి మరికొంతమంది పేద మహిళలకు ఉపాధి మార్గమయ్యాను. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొంటే నాకు ఎంతో గర్వంగా అనిపిస్తుంది. దీని వెనుక ఎన్నో ఏళ్ల శ్రమ మాత్రమే కాదు... ఎన్నో త్యాగాలు కూడా ఉన్నాయి. హనుమకొండ జిల్లా శాయంపేట గ్రామంలోని ఓ దిగువ మధ్యతరగతి కుటుంబం మాది. మా ఇంటికి సమీపంలో ఉండే దాసరి బాబుతో నాకు పెళ్లయింది. ప్రేమ వివాహం. మాకు ఇద్దరు కూతుళ్లు... అంజలి, అలేఖ్య. ఇంజనీరింగ్ చదువుతున్నారు. నేను, మావారు కలిసి వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసేవాళ్లం. సంపాదనతో కుటుంబ పోషణ కష్టమయ్యేది. 2001లో డ్వాక్రా మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరాను. కొద్ది రోజులకే అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. సంఘంలో చేరాక కుట్టు విద్య నేర్చుకున్నాను. కుట్టు పని మొదలుపెట్టాను.

రుణం తీసుకొని...

అయితే కుట్టు పనితో వచ్చేది ఇంట్లో కనీస ఖర్చులకు సరిపోయేది కాదు. దాంతో 2009లో స్వయం సహాయక సంఘం నుంచి లక్ష రూపాయల రుణం తీసుకుని, కిరాణా షాపు పెట్టాను. ఐదేళ్లకు ఆ రుణం తీరడంతో పిండి గిర్నీ మొదలుపెట్టాను. అదేసమయంలో నాకు కాస్త హిందీ తెలియడంతో... 'సెర్ప్' అధికారులు నన్ను 'కమ్యూనిటీ రీసెర్స్ పర్సన్' (సీఆర్‌పీ)గా ఎంపిక చేశారు. అందులో భాగంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో స్వయంసహాయక సంఘాల మహిళలకు పొదుపుపై శిక్షణ ఇచ్చాను.

పిల్లలకు దూరంగా...

సీఆర్‌పీగా 2016-19 మధ్య ఇలా చాలా పర్యటనలకు వెళ్లాను. వెళ్లినప్పుడల్లా 45 రోజులపాటు అక్కడే ఉండాల్సి వచ్చేది. ప్రయాణం, వసతి, భోజనం తదితర ఖర్చుల కోసం కొంత డబ్బు ఇచ్చేవారు. దాంతోనే మా ఇల్లు గడిచేది. మేం వెళ్లే ప్రాంతాల్లో సెల్ సిగ్నల్స్ ఉండేవికావు. దానివల్ల రోజుల తరబడి మావారు, పిల్లలతో మాట్లాడటం కుదిరేది కాదు. అన్నేసి రోజులు పిల్లలకు దూరంగా గడపడమంటే ఎంతో బాధగా ఉండేది. కళ్లల్లో నీళ్లు తిరిగేవి. పిల్లలను వదిలి టూర్లకు వెళ్లడం ఎందుకని బంధువులు, సన్నిహితులు అనేవారు. కానీ నేను, నా కుటుంబం ఏ లోటూ లేకుండా జీవించాలంటే బాధను దిగమింగుకోవాలి. కొన్ని త్యాగం చేస్తేనే ముందుకు సాగడం సాధ్యం. పిండిగిర్నీ మావారికి అప్పగించి నేను ఇతర రాష్ట్రాలకు వెళ్లేదాన్ని.

తలకిందులైనా...

కాస్త నిలదొక్కుకొంటున్నాం అనుకొనేలోపు కరోనా కుదిపేసింది. జీవితం తలకిందులైంది. పిండిగిర్నీపై సంపాదన లేక, మావారు రైస్‌మిల్లులో పనికి వెళ్లారు. సంపాదన సరిపోక అప్పులు పెరిగాయి. వీటి నుంచి బయటపడాలంటే మరో వ్యాపారం చూసుకోవాలని అనుకున్నాను. కానీ ఏ వ్యాపారం పెట్టాలి? యూట్యూబ్‌లో వెతుకుతుంటే జనపనార సంచులు (జ్యూట్ బ్యాగ్స్) తయారీ గురించి తెలిసింది. తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు సాధించవచ్చని చెప్పడంతో 2021లో 'స్త్రీ నిధి' పథకం ద్వారా రెండు లక్షలు రుణం తీసుకున్నాను. హైదరాబాద్ నుంచి ముడిసరుకు తెచ్చాను. ఇంట్లో ఉన్న మిషన్ మీద బ్యాగులు తయారు చేసి, స్థానికంగా అమ్మాం. లాభాలు పెద్దగా రాకపోవడంతో నలుగురం కలిసి ప్రారంభించిన ఈ ప్రాజెక్టు నుంచి ముగ్గురు తప్పుకున్నారు. అప్పుడు, పిల్లల స్కూలు ఫీజులు... ప్రతి రూపాయికీ వెతుక్కోవాల్సి వచ్చేది. కేంద్ర ప్రభుత్వ 'లఖ్‌పతి దీదీ' పథకం ద్వారా రుణం తీసుకొని, రూ.15 లక్షలతో నాన్‌ఓవెన్ మిషన్ తీసుకువచ్చాం. చాలామంది వద్దని వారించారు. వారి మాటలు నాలో మరింత పట్టుదలను పెంచాయి. బ్యాగుల తయారీ మొదలుపెట్టాం.

మరికొందరికి ఉపాధి...

మా బ్యాగులకు వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చింది. లాభాలు కనిపించాయి. రెండు దఫాలుగా మరో 11 లక్షల రుణం తీసుకొని వ్యాపారాన్ని విస్తరించాం. లాభాలను పెట్టుబడిగా మలిచి ఉత్పత్తిని పెంచుకొంటూ వెళ్లాం. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా బ్యాగులు తయారు చేస్తూ, వారి నమ్మకాన్ని, ఆదరణను పొందాం. ఆరంభంలో నేను, మావారు చుట్టుపక్కల ఊళ్లకు వెళ్లి బ్యాగులు అమ్మేవాళ్లం. ఇప్పుడు వివిధ కంపెనీల నుంచి ఎన్నో ఆర్డర్లు వస్తున్నాయి. ముడిసరుకును బెంగళూరు, చెన్నై, బెంగళూరు నుంచి తెప్పిస్తున్నాం. ప్రస్తుతం శాయంపేటలోని మా తయారీ కేంద్రంలో ఐదుగురు మహిళలు పని చేస్తున్నారు. మా టర్నోవర్ ఏడాదికి 1.25 కోట్ల రూపాయలకు చేరింది. ఖర్చులన్నీ పోనూ నెలకు రూ.75 వేలు మిగులుతుంది. రెండేళ్ల కిందట డీఆర్‌డీఏ అధికారుల నుంచి 'ఉమన్ లీడర్‌షిప్' అవార్డు అందుకున్నాను.

> **అరుదైన అవకాశం...**
>
> 
>
> గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగే వేడుకల్లో పాల్గొనే అద్భుతమైన, అరుదైన అవకాశం నాకు లభించింది. 'గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ' (సెర్ప్) సహకారంతో పారిశ్రామికవేత్తగా ఎదిగినందుకు గానూ నాకు ఈ ఆహ్వానం అందింది. వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించడంతోపాటు ప్రధాని, పలువురు కేంద్ర మంత్రులను కలిసే అదృష్టం దక్కినందుకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. చిన్నప్పటి నుంచీ నేను పడిన కష్టాలకు, ఒక మహిళగా స్వయంకృషితో ఎదిగి, పారిశ్రామికవేత్తగా విజయం సాధించినందుకు నాకు దక్కిన గౌరవం ఇది.

• **తడుక రాజనారాయణ**, వరంగల్

అన్నపూర్ణలా ఆకలి తీరుస్తున్నారు...

రోజూ ఉదయం పదిగంటల తరువాత ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లా రాజ్‌పూర్ గ్రామంలో ఒక ట్రక్కు బయలుదేరుతుంది. ఆ చుట్టుపక్కల ఏడు గిరిజన గ్రామాల్లో పర్యటిస్తుంది. గ్రామ కూడలిలో ఆ వ్యాన్ ఆగగానే... ఆకలితో ఉన్న ప్రజలు దాని దగ్గరకు చేరుకుంటారు. వారందరికీ సంతృప్తిగా భోజనం అందించాక... వ్యాన్ మరో గ్రామానికి బయలుదేరుతుంది. దాదాపు నాలుగున్నర సంవత్సరాలుగా వందల మందికి కడుపు నింపుతున్న ఈ ప్రయత్నం వెనుక ఉన్న అన్నపూర్ణ.... 55 ఏళ్ల బిపిన్‌దేవి.



"ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని చివరి జిల్లాలో ఉన్న మా ప్రాంతంలో కనీస అభివృద్ధికి నోచుకొని గ్రామాలు ఎన్నో. అక్కడ వ్యవసాయం, పశువుల పెంపకం మాత్రమే ప్రజల ఆదాయ మార్గాలు. వర్షాలు సరిగ్గా పడకపోవడంతో కొన్నేళ్ళుగా సాగు లాభదాయకంగా ఉండడం లేదు. ఉపాధి కల్పించే పరిశ్రమలు కూడా పెద్దగా లేవు. దీంతో ప్రజలు తమ కుటుంబాలకు తిండి పెట్టడం కోసం ఎన్నో కష్టాలు పడాల్సి వస్తోంది. ఆఖరికి పిల్లలు కూడా ఆకలితోనే నిద్రపోవడం చూసి చాలా బాధ కలిగింది" అని చెబుతారు బిపిన్ దేవి. తన ఆవేదనను భర్త కల్లు యాదవ్‌తో ఆమె పంచుకున్నారు. అన్నార్తుల ఆకలి తీర్చాలనే ఆమె ఆలోచనకు చిన్న కిరాణా దుకాణం నడిపే కల్లూ యాదవ్‌తో పాటు వారి కుమారులు నీరజ్, మోహిత్ కూడా మద్దతిచ్చారు. ఈలోగా కరోనా రావడంతో... గ్రామాల పరిస్థితులు మరింత దిగజారాయి. దాంతో తక్షణమే బిపిన్ దేవి రంగంలోకి దిగారు. 'చాచీ కీ రసోయ్' పేరుతో ఆహార పంపిణీ ప్రారంభించారు. "అంతకుముందు కూడా మా చుట్టూ ఉండే పేదలకు, ఆకలితో ఉన్నవారికి సాయం చెయ్యడానికి ఎప్పుడూ వెనుకాడలేదు. అయితే ఈసారి మేమే వారి దగ్గరకు వెళ్లాలని అనుకున్నాం. దుకాణం కోసం సరుకులు తెచ్చుకోవడానికి మా దగ్గర ఒక వ్యాన్ ఉంది. దాన్ని సంచార ఆహార శాలగా మార్చాం. ఇంటి దగ్గర వండిన ఆహారాన్ని తీసుకొని గ్రామాల్లో పంచడం మొదలుపెట్టాం" అని ఆమె గుర్తు చేసుకున్నారు.

కాలి గాయాలైనా...

ప్రతి గ్రామం రెండు కిలోమీటర్ల లోపే ఉండడంతో మధ్యాహ్నం అయ్యేలోగా భోజనం పంపిణీ పూర్తయిపోతుంది. రోజువారీగా అందించే భోజనంలో అన్నం, రొట్టెలు, పప్పు, కూర ఉంటాయి. "రోజూ తెల్లవారుజామునే లేచి పని ప్రారంభిస్తాను. మా అబ్బాయిలు, స్థానిక మహిళలు వంటలో సాయం చేస్తారు. ఒక్కోసారి ఎక్కువమందికి వండాల్సి ఉంటుంది. మూడేళ్ళ కిందట... గ్రామస్తుల కోరిక మేరకు భారీగా వంట చెయ్యాల్సి వచ్చింది. పొయ్యిలోంచి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. నా చేతులు కాలి బొబ్బలెక్కాయి. వెంటనే వంట ఆపెయ్యాలని మా నా భర్త, పిల్లలు చెప్పారు. ఆకలితో ఉన్న ఎంతో మంది నేను తీసుకువెళ్ళే భోజనం కోసం ఎదురుచూస్తున్నప్పుడు... నా బాధ చాలా చిన్నదనిపించింది. వంట పూర్తి చేశాను. ఆహార పదార్థాల్ని గ్రామాలకు తీసుకువెళ్ళి వడ్డించాను. వారు సంతృప్తిగా తినడం చూసి నా నొప్పిని మరచిపోయాను" అని అంటారు బిపిన్‌దేవి. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా భోజనం పంపిణీ కొనసాగించాలనే ఆమె సంకల్పాన్ని ఈ సంఘటన మరింత బలోపేతం చేసింది.

ఆ మాటలే ఆదర్శం...

ఏవైనా ఆటంకాలు ఎదురైతే తప్ప... దాదాపు రోజూ ఆమె వంట వ్యాన్ గ్రామాలకు ఠంచనుగా వెళ్తుంది. దాన్ని ఆమె పిల్లల్లో ఒకరు నడుపుతారు. "మా సోదరులిద్దరం నాన్నతో పాటు మా కిరాణా దుకాణంలోనే పని చేస్తాం. ఎవరు అడిగినా లేదనకుండా అమ్మ సాయం చెయ్యడం మా చిన్నతనం నుంచి చూస్తూ పెరిగాం. అందుకే... ఈ ఆలోచన ఆమె చెప్పినప్పుడు ఆశ్చర్యంగా అనిపించలేదు. మాది పొదుపుగా బతికే కుటుంబం. అమ్మ ఆలోచనను ఆచరణలో పెట్టడం కోసం ఖర్చుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని అనుకున్నాం. వంట సామాన్లకు, వాహనం డీజిల్‌కు, ప్లేట్లు, గ్లాసుల్లాంటి వాటికి నెలకు 60 వేల రూపాయల వరకూ ఖర్చవుతోంది. మా దుకాణం, చిన్న పొలం మీద వచ్చే ఆదాయంతో... మేము జీవిస్తూ, ఇతరులకు సాయం చేస్తున్నాం. "మన అవసరాలు గడుస్తూ, నలుగురికీ మంచి చేస్తే చాలు. భారీగా డబ్బు వెనకేసుకోకపోయినా పరవాలేదు" అంటారు మా అమ్మానాన్నా. వారి మాటలే మాకు ఆదర్శం" అని చెబుతారు బిపిన్‌దేవి కుమారులు. "ఆకలి చావుల గురించి ఎన్నో కథలు విన్నాను. అలాంటి దుస్థితి ఎవరికీ రాకూడదు. సాటి మనుషుల కోసం నేను చేస్తున్నదానికి 'సేవ' అనేది పెద్ద మాట. సమాజంలో వ్యక్తిగా ఇది నా బాధ్యత" అంటున్నారు బిపిన్‌దేవి.






ఇంట్లో సైక్లింగ్ చేస్తే...

చాలామంది సమయాభావం వల్ల ఇంట్లోనే సైక్లింగ్ చేస్తూ ఉంటారు. ఇది కూడా ఆరోగ్యానికి పలువిధాలుగా తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

- ఇంట్లో సైక్లింగ్ చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం పెరుగుతాయి. ఒత్తిడి, ఆందోళన తగ్గి మెదడు చురుకుగా పనిచేస్తుంది.
- ఉదయాన్నే సైక్లింగ్ చేస్తే శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలై రోజంతా ఉత్సాహంగా అనిపిస్తుంది.
- సైక్లింగ్ వల్ల హార్మోన్లు సమతూకంలో పనిచేస్తాయి. నిరుత్సాహం, కోపం, చిరాకు లాంటి లక్షణాలు తగ్గుతాయి.
- ప్రతిరోజూ ఒకే సమయానికి ఇంట్లో సైక్లింగ్ చేస్తూ ఉంటే వయసు పైబడడం వల్ల వచ్చే పలు మానసిక సమస్యలు తగ్గుముఖం పడతాయి. శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. శరీరంలోని అవయవాలన్నీ శక్తితో ఉంటాయి. కండరాలు బలోపేతమవుతాయి. బద్ధకం దరిచేరదు.
- శరీరంలోని అదనపు క్యాలరీలు ఖర్చయి బరువు నియంత్రణలో ఉంటుంది. జీవక్రియలన్నీ వేగవంతమవుతాయి.

ముఖాన్ని ఇలా మెరిపించండి!


ముఖం అందంగా ఆరోగ్యంగా కనిపించాలని అందరూ కోరుకుంటూ ఉంటారు. రసాయనభరితమైన సౌందర్య సాధనాలు కాకుండా ఇంట్లో దొరికే వాటితోనే ప్యాక్ తయారుచేసుకుని వాడితే ముఖం మెరిసేలా చేసుకోవచ్చు. ఆ వివరాలు...



- పండిన అరటిపండును తొక్కతీసి చిన్న ముక్కలుగా కోసి ఒక గిన్నెలో వేయాలి. చెంచాతో వాటిని గుజ్జులా చేయాలి. అందులో రెండు చెంచాల పాలు, ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తరవాత మంచినీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వల్ల చర్మానికి తేమ అంది సహజసిద్ధంగా మెరుస్తుంది.
- ఒక గిన్నెలో ఒక చెంచా గ్లిజరిన్, ఒక చెంచా గులాబీ నీళ్లు, ఒక చెంచా బంగాళదుంప రసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని కింది నుంచి పైకి రాస్తూ ముఖానికి, మెడకి పట్టించాలి. ముక్కుకు ఇరుపక్కలా, నుదుటి మీద సున్నితంగా మర్దన చేయాలి. అరగంట ఆరిన తరవాత నీళ్లతో కడిగేసుకోవాలి. ఈ ప్యాక్.... బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేసి చర్మ రంధ్రాలను శుభ్రం చేస్తుంది. నలుపుదనమంతా తొలగిపోయి ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది.
- ఒక గిన్నెలో అయిదు చెంచాల బార్లీ గింజల పొడి వేసి అందులో గోరువెచ్చని నీళ్లు చల్లుతూ ముద్దలా చేయాలి. ఈ మిశ్రమాన్ని చేత్తో కొద్దిగా తీసుకుంటూ ముఖమంతా పరచాలి. పదిహేను నిమిషాలు ఆరిన తరవాత ముని వేళ్లతో మెల్లగా రుద్దుతూ మిశ్రమాన్ని తొలగించి నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వల్ల చర్మంపై పేరుకున్న మృతకణాలు, మురికి తొలగిపోతాయి. ముఖం ప్రకాశవంతంగా మారుతుంది.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అరగ్లాసు పాలు, మూడు చెంచాల ఓట్స్ వేసి ఉడికించాలి. చల్లారిన తరవాత ఇందులో ఒక చెంచా పెరుగు, ఒక చెంచా తేనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖమంతా పట్టించాలి. ఇరవై నిమిషాలు ఆరిన తరవాత నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వల్ల బ్లాక్ హెడ్స్ తొలగిపోయి ముఖం తాజాగా కనిపిస్తుంది.

మంచి నిద్ర కోసం...

రోజంతా ఎన్నో పనులతో శరీరం అలసిపోతూ ఉంటుంది. అలసట తీరి అవయవాలన్నీ విశ్రాంతి పొందాలంటే శరీరానికి మంచి నిద్ర అవసరం. ప్రతిరోజూ కనీసం ఏడు లేదా ఎనిమిది గంటలు నిద్రించడం ఆరోగ్యకరమని నిపుణులు చెబుతున్నారు. నిద్ర బాగా పట్టాలంటే ఏ ఆహారం తీసుకోవాలో తెలుసుకుందాం!



తేనె : ప్రతిరోజూ పడుకునేముందు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో రెండు చెంచాల తేనె కలుపుకుని తాగాలి. తేనెలో ట్రిప్టోఫాన్ అనే అమైనోయాసిడ్ ఉంటుంది. ఇది శరీరంలో సెరటోనిన్, మెలటోనిన్ స్థాయిలను పెంచుతుంది. దీంతో శరీరంలోని హార్మోన్లు ప్రేరేపితమై గాఢంగా నిద్ర వస్తుంది.



అరటిపండు : మధ్యరాత్రి వేళల్లో కొంతమందికి అకస్మాత్తుగా మెలకువ వస్తుంది. తరవాత నిద్ర పట్టక అవస్థ పడుతూ ఉంటారు. అలాంటి సమయాల్లో బాగా పండిన అరటిపండు తింటే వెంటనే నిద్ర పడుతుంది.



బీన్స్ : వీటిలో బి 6, బి 12 విటమిన్లతోపాటు మెగ్నీషియం, కాల్షియం వంటి పోషకాలు కూడా ఉంటాయి. ఇవన్నీ కలిసి నిద్రను ప్రేరేపిస్తాయి. రాత్రి భోజనంలో బీన్స్‌ను కూర రూపంలో తీసుకుంటే మంచి ప్రయోజనం ఉంటుంది.



కివి : ఈ పండులో యాంటీ ఆక్సిడెంట్లు, ఫోలేట్లు, పీచుపదార్థాలు, పొటాషియంతోపాటు కె, సి, ఇ విటమిన్లు ఉంటాయి. ఇవన్నీ శరీరంలో ఒత్తిడిని, ఆందోళనను తగ్గిస్తాయి. ఫలితంగా మెదడు విశ్రాంతి పొందుతూ నిద్ర వచ్చేలా చేస్తుంది. నిద్రలేమితో బాధపడేవారు, వృద్ధులు ప్రతిరోజూ ఒక కివి పండును తింటూ ఉంటే నాలుగు వారాల్లో సమస్యను అధిగమించవచ్చు.



గసగసాల పాలు : ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో అర చెంచా గసగసాలు వేసి పావు గంట నానబెట్టండి. స్టవ్ మీద గిన్నెపెట్టి ఒక గ్లాసు పాలు పోసి వేడిచేయండి. ఇందులో నానిన గసగసాలు వేసి బాగా మరిగించండి. అయిదు నిమిషాల తరవాత స్టవ్ మీది నుంచి పాలను దించి వడకట్టి కొద్దిగా బెల్లం కలుపుకుని తాగండి. అరగంటలో మంచి నిద్ర వస్తుంది. ఉదయం లేవగానే ప్రశాంతంగా, ఉత్సాహంగా అనిపిస్తుంది.



బాదం : రాత్రి పడుకునేముందు అయిదు బాదం పప్పులు తింటే హాయిగా నిద్ర పడుతుంది. బాదాంలో మెగ్నీషియం, ట్రిప్టోఫాన్ ఉంటాయి. ఇవి శరీరంలోని కండరాలు విశ్రాంతి పొందేలా చేస్తాయి. దీంతో మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తయి శరీరాన్ని నిద్రకు సిద్ధం చేస్తుంది. అలాగే వాల్‌నట్స్, ఓట్స్, గుమ్మడి గింజలు, చెర్రీలు మంచి నిద్రను ప్రేరేపిస్తాయి.



అశ్వగంధ పాలు : అశ్వగంధ మంచి ఆయుర్వేద ఔషధం. ఇందులో మత్తును కలిగించే ట్రైఇథైల్ గ్లైకాల్ ఉంటుంది. ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో అర చెంచా అశ్వగంధ పొడి కలుపుకుని తాగితే వెంటనే నిద్ర వస్తుంది. ఒత్తిడి, ఆందోళన, అలసట తగ్గిపోతాయి. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి.



చామంతి టీ : చామంతి టీ పొడిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్ నిద్ర వచ్చేలా చేస్తాయి. ఒక కప్పు వేడి నీటిలో ఒక చామంతి టీ బ్యాగ్ వేసి రెండు నిమిషాలు ఉంచండి. తరవాత ఈ గోరువెచ్చని టీని మెల్లగా తాగండి. పావు గంటలో మంచి నిద్ర పడుతుంది.

పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే..!

పెరిగే పిల్లలకు పోషకాహారం తప్పనిసరి. శారీరక ఎదుగుదలతోపాటు పిల్లల మానసిక వికాసానికి నిపుణులు సూచిస్తున్న ఆహార పదార్థాలు ఇవే...



- పిల్లలు బడికి వెళ్లే ముందు ఉడికించిన గుడ్డు తినిపించాలి. కేరట్, బీట్‌రూట్ ముక్కలు జత చేసిన ఆమ్లెట్ కూడా మంచిదే. దీనివల్ల శరీర పెరుగుదలకు కావాల్సిన ప్రొటీన్ అందుతుంది.
- ఓట్స్‌ను ఉడికించి దానికి దానిమ్మ గింజలు, స్ట్రాబెరీ ముక్కలు చేర్చి తినిపించవచ్చు. వీటివల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది.
- ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో బాదం, కాజు, పిస్తా, వాల్‌నట్, డ్రై అంజూర్, ఖర్జూరం లాంటివి తినిపించడం వల్ల పిల్లలు పొడవుగా పెరుగుతారు. రోగనిరోధక శక్తి కూడా లభిస్తుంది.
- బడి నుంచి ఇంటికి రాగానే రాగి జావ పెట్టడం మంచిది. దీనివల్ల నీరసం, అలసట తగ్గి పిల్లలు ఉత్సాహంగా ఉంటారు.
- ప్రతిరోజూ మధ్యాహ్న భోజనంలో ఆకు కూరలు, పప్పు దినుసులు, నెయ్యి చేర్చి తినిపించాలి. వీటివల్ల కాల్షియం, ఇతర పోషకాలు అంది ఆరోగ్యంగా పెరుగుతారు.
- ఇడ్లీ, దోశ, శాండ్‌విచ్, పన్నీర్‌తో తయారుచేసిన వంటకాలు తినిపించడంవల్ల తక్షణ శక్తి లభిస్తుంది.
- ప్రతిరోజూ ఉదయాన్నే ఒక గ్లాసు పాలు తాగించాలి. భోజనంలో మజ్జిగను చేర్చాలి. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు కూరగాయయలు ఉడికించి తయారుచేసిన సూప్ తాగించవచ్చు. వీటివల్ల పిల్లల శరీరంలో నిర్జలీకరణ ఏర్పడదు.
- కాలానుగుణంగా లభించే యాపిల్, అరటి, జామ, ద్రాక్ష, మామిడి పండ్లను పిల్లలచేత తినిపించాలి. అప్పుడే వారికి కావాల్సిన విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు అందుతాయి. తరచూ పల్లీలు, బెల్లం, నువ్వులు పెడితే రక్తహీనత లాంటి సమస్యలు రావు.
- చిక్కుళ్లు, బఠానీలు, మొలకలను తినడం అలవాటు చేయాలి. బ్రకోలీ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, టమాటా, దోస, కీర లాంటి కూరగాయలను ఆహారంలో చేర్చి పిల్లలకు పెట్టడం మంచిది.

SCHOLARSHIP ALERT

'LIFE'S GOOD'

Description: LG Electronics India Private Limited invites applications from students pursuing undergraduate and postgraduate courses at select colleges/institutes across India.
Eligibility: Students must be pursuing undergraduate/postgraduate courses (any academic year) from select colleges/institutes across India. First-year students must have scored a minimum of 60% marks in their class 12th examinations, while students in the 2nd, 3rd, and 4th years must have achieved a minimum of 60% marks in the previous academic year. Preference will be given to meritorious students, female students and students with an annual family income of not more than INR 8 lakh.
Prizes & Rewards: Up to INR 100,000 for one year
Last Date to Apply: 31-01-2025 *Application mode:* Online only
Short Url: www.b4s.in/aj/LGIGS1

Tagore National Fellowship for Cultural Research (TNFCR)

Description: Tagore National Fellowship for Cultural Research (TNFCR) 2024-25 is an initiative of the Ministry of Culture, Government of India to promote Indian art and culture.
Eligibility: Applicants must be an Indian or a foreign national with 5 years of experience in guiding/conducting research or the same experience in art fields. They must have their original research papers published in reputed and a refereed journals/books.
Prizes & Rewards: Fellowship offers an honorarium of up to 80,000 for two years and other benefits.
Last Date to Apply: 15-02-2025
Offline Application mode: Via post at Nodal Institutions under the Ministry of Culture, Government of India
Short Url: www.b4s.in/aj/TNFC4

Intuit Rise Girl Child Education Program

Description: Intuit India is dedicated to empowering underprivileged girl students from Class 8 through graduation by providing comprehensive educational support. This support will help these students achieve their full potential, paving the way for a brighter future!
Eligibility: Female students from Class 8 to graduation across India who are enrolled and continuing their education are eligible. Applicants must have secured a minimum of 90% in the previous academic year. The annual family income of applicants must be less than INR 3.5 lakh. Children of employees of Intuit India and Buddy4Study are not eligible.
Prizes & Rewards: Scholarship of up to INR 46,305
Last Date to Apply: 16-02-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/IRGC4

buddy4study.com

యూపీఎస్సీ సివిల్స్
కొత్త మార్పులతో నోటిఫికేషన్

దిక్సూచి DIKSUCHI



జనవరి 22న, "979 పోస్టులతో" UPSC సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్-2025 వెలువడింది. గత ఏడాది (2024లో) వెయ్యికి పైగా ఖాళీలతో, అంతకుముందు సంవత్సరం(2023లో) 1100లకు పైగా పోస్టులతో నోటిఫికేషన్ వచ్చింది.

అయితే మొత్తం భర్తీ చేసే సర్వీసులను ఈసారి 23కు పెంచడం జరిగింది(గత ఏడాది 21 సర్వీసులకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది). ఈసారి ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (IRMS)ను విభజించి, ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ - ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్ - ఇండియన్ రైల్వే పర్సనల్ సర్వీస్‌లుగా చేయడంతో ఈసారి భర్తీ చేసే సర్వీస్‌ల సంఖ్య 23కు పెరిగింది.

ముఖ్యమైన తేదీలు:

- **అప్లికేషన్ల స్వీకరణ:** 2025 జనవరి 22
- **చివరి తేదీ:** 2025 ఫిబ్రవరి 12 (సాయంత్రం 6 గంటల వరకు)
- **ప్రిలిమినరీ పరీక్ష:** 2025 మే 25
- **హాల్ టిక్కెట్స్ విడుదల:** 2025 ఏప్రిల్
- **మెయిన్స్ పరీక్ష ప్రారంభం:** 2025 ఆగస్టు 22
- **మెయిన్స్ ఫలితాల ప్రకటన:** తరవాత వెల్లడిస్తారు.

వయోపరిమితి:

జనరల్ అభ్యర్థులకు: వయస్సు 21-32 సంవత్సరాల మధ్య ఉండాలి. (2 ఆగస్టు 1993 - 1 ఆగస్టు 2004 మధ్య జన్మించి ఉండాలి)
OBC: గరిష్ట వయోపరిమితిలో 3 ఏళ్ల సడలింపు
SC & ST: గరిష్ట వయోపరిమితిలో 5 ఏళ్ల సడలింపు
డిఫెన్సు సర్వీస్‌లో అంగవికలురైన వారికి: గరిష్ట వయోపరిమితిలో 3 ఏళ్ల సడలింపు
ఎక్స్-సర్వీస్‌మన్: గరిష్ట వయోపరిమితిలో 5 ఏళ్ల సడలింపు
PwD: బెంచ్ మార్క్ డిజెబిలిటీ కలిగివున్న వారికి గరిష్ట వయోపరిమితిలో 10 ఏళ్ల వరకు సడలింపు.
గమనిక: డిఫెన్సు సర్వీస్‌లో అంగవికలురయినవారికి, ఎక్స్-సర్వీస్‌మన్‌కి, PwD వారికి తమ కులాల ప్రాతిపాదికన లభించే వయోపరిమితి సడలింపు కూడా కలిపి వర్తిస్తుంది. అనగా ఒక వ్యక్తి PwD, SC/ST సామాజికవర్గ మినహాయింపును కలిపి పొందినట్లైతే గరిష్టంగా 47 ఏళ్ల గరిష్ట వయోపరిమితి సడలింపు పొందగలరు.

అటెంప్ట్‌ల సంఖ్య:

- జనరల్ అభ్యర్థులకు: 6
- OBC: 9
- SC & ST: పరిమితిలేదు
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు 100 రూపాయలు. మహిళలు, ఇతర అన్ని కేటగిరి అభ్యర్థులందరికీ ఫీజు మినహాయింపు ఉంటుంది.

ఈ సంవత్సరం వచ్చిన మార్పులు

- సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్‌కు కనీస విద్యార్హతలైన గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు హాజరుకావచ్చు. గతంలో కేవలం ప్రిలిమినరీకి మాత్రమే ఈ అవకాశం ఉండేది, మెయిన్స్ పరీక్షలకు హాజరు కావాలంటే మాత్రం గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ సమర్పించాలి. ప్రస్తుతం ఇంటర్వ్యూకి ముందు నిర్దేశిత గడువులోగా ఉత్తీర్ణతా సర్టిఫికెట్ సమర్పిస్తే సరిపోతుంది.
- రిజర్వేషన్లు, వయోపరిమితి సడలింపులు కోరుతున్న అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను ప్రిలిమినరీ అప్లికేషన్ లోనే సమర్పించాల్సివుంది. గతంలో ఈ నియమం ప్రిలిమ్స్ దశలో లేదు.
- ఆదేవిధంగా OBCలు కుల ధృవీకరణ పత్రంతో పాటుగా, నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్‌ను కూడా దాఖలు చేయాలి. నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్ గడచిన మూడు ఆర్థిక సంవత్సరాలకు(అనగా 2021-22, 2022-23, 2023-24కు) సంబంధించినదై ఉండాలి. OBC సర్టిఫికెట్ 01-04-2024, 11-02-2025 మధ్య జారీ అయినదై వుండాలి.
- EWS రిజర్వేషన్‌కు అర్హులైనవారు కూడా, 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, నిర్దేశిత అధికారితో 01-04-2024, 11-02-2025 మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వ క్రయిటీరియా ప్రకారం జారీ చేసిన ఇన్‌కమ్ అండ్ అసెట్ సర్టిఫికెట్‌ను ప్రిలిమినరీ అప్లికేషన్ దశలోనే సమర్పించాలి.
- ఈసారి "సర్వీస్ ప్రిఫరెన్స్"లను కూడా ప్రిలిమినరీ ఎగ్జామ్ అప్లికేషన్‌లోనే ఎంచుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా "క్యాడర్ ప్రిఫరెన్స్"లను ప్రిలిమ్స్ పరీక్ష అయిన 10 రోజుల తరువాత సమర్పించాలి.
- UPSC పరీక్షలకు వన్ టైమ్ రిజిస్ట్రేషన్ అనేది తప్పనిసరి. తొలిసారిగా పరీక్షకు హాజరయ్యేవారు ముందుగా UPSC వెబ్‌సైట్‌లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాల్సి ఉంటుంది. ఈ వన్ టైమ్ రిజిస్ట్రేషన్లో సమర్పించిన వివరాలను (డేట్ ఆఫ్ బర్త్ మినహా), సమర్పించిన తేదీ నుంచి - 18 ఫిబ్రవరి 2025లోపుగా ఎప్పుడైనా సవరించుకొనే వీలుంటుంది.
- ప్రిలిమినరీ అప్లికేషన్‌లో సమర్పించిన ఏదైనా వివరాలను సవరించాలనుకొంటే, 2025 ఫిబ్రవరి 12 నుంచి ఫిబ్రవరి 18లోగా సరిచేసుకోవచ్చు.
- అడ్రసు, ఉన్నత విద్యార్హతలకు సంబంధించి, లేదా సర్వీస్/కేడర్‌ల ఎంపికకు సంబంధించి మార్పు చేర్పులు చేసుకోవడానికి మెయిన్స్ పరీక్షల తరువాత 15 రోజుల గడువు ఉంటుంది. అయితే అభ్యర్థులు ముందస్తుగానే జాగ్రత్తగా అప్లికేషన్‌ను నింపడం మంచిది.
- అభ్యర్థి రూపం దరఖాస్తుతో సమర్పించే ఫోటోలో ఉన్న విధంగానే పరీక్ష, ఇంటర్వ్యూ సమయంలో కూడా ఉండాలి.

ఉదా: హెయిర్ స్టయిల్, గడ్డం, కళ్ళజోడు మొదలైనవి. అప్లికేషన్ ప్రారంభ తేదీకి పది రోజులకంటే ముందు తీయించుకొన్న ఫోటోలను సమర్పించరాదు. అనగా 12 జనవరి 2025 కంటే ముందు తీయించుకొన్న ఫొటోలను అంగీకరించరు. ఫొటో కింది భాగంలో అభ్యర్థి పేరు, ఫోటో తీసిన తేదీని విధిగా పేర్కొనాలి.

గమనిక: చివరితేదీ వరకు దరఖాస్తు దాఖలు చేయకుండా తాత్సారం చేయవద్దు. ఒక్కోసారి చివరి రోజుల్లో సర్వర్ ఇబ్బందులు వస్తే కష్టం అవుతుంది.



ఎం. బాలలత
సివిల్స్ మెంటార్

బిట్స్‌లో..

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) అడ్మిషన్లు 2025 జనవరి 21 నుంచి మొదలయ్యాయి. ఆసక్తిగల అభ్యర్థులు సంస్థ అధికారిక వెబ్‌సైట్ bitsadmission.comను సందర్శించి దరఖాస్తులు దాఖలు చేయవచ్చు. చివరి తేదీ, పరీక్ష తేదీ తదితర వివరాలు త్వరలో వెల్లడిస్తామని వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. బిట్స్‌కు మనదేశంలో పిలానీ, గోవా, హైదరాబాద్‌ల్లో క్యాంపస్‌లు ఉన్నాయి.

- బిట్స్ ఎట్ పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ పరీక్ష. మూడు గంటల్లో 130 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్/బయాలజీ(ఎంచుకునే స్ట్రీమ్‌ను బట్టి), ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్‌ల్లో ప్రశ్నలు ఉంటాయి.
- సంవత్సరంలో రెండు పర్యాయాలు ఈ ఎంట్రెన్స్‌ను నిర్వహిస్తారు. అభ్యర్థులు తమ సౌకర్యాన్ని బట్టి ఏ సెషన్ అయినా రాయవచ్చు లేదా రెండు సెషన్లు కూడా రాసుకోవచ్చు. రెండింటిలో అత్యుత్తమంగా వచ్చిన మార్కులనే మెరిట్ సమయంలో పరిగణనలోకి తీసుకుంటారు.

అడ్మిషన్స్

ఓయూలో పీ హెచ్‌డీ..

కేటగిరీ 2 కింద వివిధ సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. కనీసం 55 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు ఈ ఎంట్రెన్స్ రాయడానికి అర్హులు. (ఎస్సీ/ఎస్టీ/బీసీ/పీడబ్ల్యూడీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 శాతం చాలు). ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ ఫిబ్రవరి 23. ఆన్‌లైన్ అప్లికేషన్, సబ్జెక్టులు, సిలబస్, దరఖాస్తు రుసుము ఇతర వివరాల కోసం www.ouadmissions.com వెబ్‌సైట్ చూడవచ్చు.

ఇస్రోలో ఇంటర్న్‌షిప్

'ఇస్రో'లో ఇంటర్న్‌షిప్ చేయాలని మీ కలా! అయితే అలాంటి వారి కోసం అవకాశం ఎదురు చూస్తోంది. ఇంజనీర్లు, డిప్లొమా హోల్డర్లు, మాస్టర్స్, డాక్టోరేట్ అభ్యర్థులు దీనిని ఉపయోగించుకోవచ్చు. అభ్యర్థులు తప్పనిసరిగా భారత పౌరులై ఉండాలి. ఇంటర్న్‌షిప్ కాలానికి ఎలాంటి స్టయిఫండ్ చెల్లించరు.

స్టూడెంట్ ప్రాజెక్ట్ ట్రైనీ స్కీమ్: దీనికి దరఖాస్తు చేసుకోవాలనుకునే బీఈ/బీటెక్ చదువుతున్న విద్యార్థులు అయితే ఆరో సెమిస్టర్ పూర్తి చేసి ఉండాలి. ఎంఈ/ఎంటెక్ అభ్యర్థులు మొదటి సెమిస్టర్ పూర్తి చేయాలి. బీఎస్సీ/డిప్లొమా అభ్యర్థులు ఫైనల్ ఇయర్ చదువుతుండాలి. ఎమ్మెస్సీ వారు మొదటి సెమిస్టర్, పీహెచ్‌డీ వారైతే కోర్సు వర్క్ పూర్తి చేయాలి.

కాలపరిమితి: ఇంజనీరింగ్/గ్రాడ్యుయేట్/డిప్లొమా అభ్యర్థులకు 45 రోజులు. ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ వారికి 120 రోజులు, పీహెచ్‌డీ అభ్యర్థులకు 30 నెలలు ఉంటుంది. వివరాలకు www.isro.gov.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విభిన్నమైన పాత్రలో...



సుధీర్‌బాబు నటించనున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర'. వెంకట్ కల్యాణ్ దర్శకత్వంలో ప్రేరణ అరోరా, శివిన్ నారంగ్ తదితరులు నిర్మించనున్నారు. తాజాగా, ఈ సినిమా నిర్మాణంలో 'జీ స్టూడియోస్' సీఈఓ ఉమేశ్ కే.ఆర్.భన్సాల్ భాగమయ్యారు. ఇందులో సుధీర్‌బాబు క్యారెక్టర్ విభిన్నంగా ఉండబోతోందని మేకర్స్ తెలిపారు. ఈ సినిమా కథాంశం కేరళలోని అనంత పద్మనాభస్వామి ఆలయం నేపథ్యంలో ఉండనుంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో మొదలుకానుంది.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

- నందమూరి బాలకృష్ణ



ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కోరారు. ఇది నా ఒక్కడి కోరిక కాదు, తెలుగు ప్రజలందరి కోరిక అన్నారు. పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన బాలకృష్ణను ఆయన నివాసంలో ఆదివారం కిషన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలకృష్ణకు శాలువా కప్పి సత్కరించారు. పలు రంగాల్లో విశేషమైన సేవలందించిన బాలకృష్ణ గారికి కేంద్రప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటించడం సంతోషకరమన్నారు. అందుకే స్వయంగా కలిసి అభినందించి, శుభాకాంక్షలు తెలిపేందుకు బాలకృష్ణ గారికి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. బాలకృష్ణ అనేక ఏళ్లుగా హీరోగా, ప్రజాప్రతినిధిగా తనదైన ముద్ర వేశారనీ, గత పదిహేను సంవత్సరాలుగా బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్‌గా సేవలు అందిస్తు వేలాదిమందికి క్యాన్సర్ నుంచి విముక్తి కల్పించారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ తనయుడిగా పుట్టడం నా అదృష్టం, ఆయన నాకు గురువు కూడా' అన్నారు. పద్మభూషణ్‌ను బిరుదుగా కన్నా బాధ్యతగా భావిస్తున్నాని, ఏమీ ఆశించకుండా నిస్వార్థంగా పనిచేస్తానని, మంచి పనులు మరింత కొనసాగించేలా ఈ అవార్డు ప్రొత్సాహమిచ్చిందని అన్నారు. తన సేవలను గుర్తించి ఈ అవార్డు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)



'జన నాయగన్'గా విజయ్



తమిళ సినీ హీరో, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ నటిస్తున్న 69వ చిత్రానికి 'జన నాయగన్' అనే టైటిల్‌ను ఖరారు చేసి రిపబ్లిక్ డే సందర్భంగా ప్రకటించారు. ఫస్ట్‌లుక్‌ను కూడా రిలీజ్ చేశారు. హెచ్. వినోద్ దర్శకత్వం వహించే ఈ చిత్రం కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతోంది. పూజా హెగ్డే హీరోయిన్. ఇతర పాత్రల్లో గౌతమ్ వాసుదేవ్ మేనన్, బాబీ డియోల్, ప్రియమణి, మమితా బైజు, ప్రకాష్ రాజ్ తదితరులు నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో టీవీకే పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన విజయ్.. సినిమాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. దీంతో విజయ్ నటించే చివరి చిత్రం ఇదేనంటూ కోలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. అందుకు తగినట్టుగానే ఈ చిత్రం టైటిల్‌ను ఖరారు చేశారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

చిత్రసీమను ఆహ్వానిస్తున్నాం

● ఏపీటీఎఫ్‌సీసీని స్థాపించిన టీజీ వెంకటేశ్



రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం కర్నూల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఏపీ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఏపీటీఎఫ్‌సీసీ)ను ఏర్పాటు చేసి విధివిధానాలు ప్రకటించారు. వ్యవస్థాపక ఛైర్మన్‌గా టీజీ వెంకటేశ్, అధ్యక్షుడిగా సినిమా డైరెక్టర్, నిర్మాత కిరణ్ బీకే, సలహాదారుడిగా ఏపీఎఫ్‌సీసీ మాజీ అధ్యక్షుడు బీవీ రెడ్డి ఉన్నారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ 'రాష్ట్రంలో కళలు, కళాకారులకు కొదవ లేదు' అన్నారు. సినిమా చిత్రీకరణ కోసం ఆకర్షణీయమైన ప్రదేశాలు, సహజ సిద్ధమైన ప్రకృతి వనరులు, అద్భుత కట్టడాలు, చారిత్రాత్మక కట్టడాలు ఉన్నాయని, సినీ పరిశ్రమను కర్నూలు సహా రాయలసీమ జిల్లాలకు ఆహ్వానిస్తున్నాం' అని తెలిపారు.

కర్నూలు (ఆంధ్రజ్యోతి)

వసూళ్లతోనే గొప్ప సినిమా అవ్వదు



సిద్ధార్థ్

భారీ బడ్జెట్‌తో నిర్మించి, ఎక్కువ వసూళ్లు సాధిస్తేనే మంచి సినిమా, లేకుంటే మంచి చిత్రం కాదు అనే అభిప్రాయాలకు రావడం ఈ మధ్యకాలంలో పెరిగిందనీ, అది సరికాదని సినీ నటుడు సిద్ధార్థ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ సాహితీ మహోత్సవంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఒక సెక్స్‌వర్కర్ అత్యాచారానికి గురై కన్నుమూస్తే, కనీసం సానుభూతి చూపకపోగా తప్పు అంతా ఆమెదే అన్నట్లు మాట్లాడే దేశంలో నివసిస్తున్నాం' అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. "నేను స్త్రీవాదిని. మహిళలను కొట్టడం, అవమానించడం, కించపరిచడం, ప్రత్యేక గీతాలు లాంటివి చేసే పాత్రలు నాకు ఎన్నో వచ్చాయి. అలాంటి స్క్రిప్ట్‌లను మొహమాటం లేకుండా తిరస్కరించాను" అని ఆయన చెప్పారు. 'సినిమాలో కథానాయకుడు చేసే మంచి పనులు, నిజ జీవితంలో ఎంతోమంది సామాన్యులు చేస్తున్నారు. హీరోలం మేము కాదు, సాటిమనిషి పట్ల సౌహార్దత, స్పందించే హృదయం కలిగిన సామాన్యులే అసలైన హీరోలు' అన్నారు. ఈ చర్చా గోష్ఠికి హిందుస్థానీ సంగీత విద్వాంసురాలు, నటి అదితీరావు హైదరీ తల్లి విద్యారావు సమన్వయకర్తగా వ్యవహరించారు. తన అత్తమ్మతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని సిద్ధార్థ్ అన్నారు. చిన్నా సినిమా చిత్రీకరణపై సంభాషణ సాగుతున్నప్పుడు, విద్యారావు భావోద్వేగానికి లోనవ్వగా, "అత్తమ్మ! ప్లీజ్ ఏడవకండి. 'మా అమ్మను కన్నీరు పెట్టనివ్వకుండా చూడండి' అని ఇక్కడికి వచ్చేముందు మీ అమ్మాయి అదితీ నా దగ్గర మాట తీసుకుంది" అని సిద్ధార్థ్ ఊరడించారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)



సలామ్ సైనికా

దేశభక్తి చిత్రం 'సలామ్ సైనికా' ట్రైలర్‌ను ఆదివారం అమరావతి అసెంబ్లీ భవనంలో రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మన సైనికుల విషయంలో ప్రతి భారతీయుడు బాధ్యతతో మెలగాలనే సందేశంతో ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమా చిత్రీకరణ అంతా ఆంధ్రప్రదేశ్‌లోనే జరిగింది' అని అన్నారు. అమర సైనికుల భార్యా పిల్లలు అనాథలు అవుతున్నారు, వారికి అండగా వుండే బాధ్యత ప్రతి భారతీయుడు తీసుకోవాలని 'సలామ్ సైనికా' సినిమా ద్వారా సందేశమిస్తున్నామని దర్శకుడు చిగురుపాటి సుబ్రమణ్యం తెలిపారు. చిగురుపాటి క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రంలో దేవ్, సాయి, సురేష్, శ్రీభవ్య, సోనీరెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు, 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

ప్రతీకారం కాదు ఆత్మగౌరవం

● జానీ మాస్టర్ కేసుపై స్పందించిన బాధితురాలు



షేక్ జానీ బాషా (జానీ మాస్టర్) తనను లైంగికంగా వేధించాడని ఓ మహిళా కొరియోగ్రాఫర్ ఫిర్యాదు చేయడంతో ఆయనను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. బెయిలు మీద మీద వచ్చిన ఆయన తన తప్పేమీ లేదని వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. దీనిపై బాధితురాలు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "నేనొక యోధురాలిని. మంచి కోసం పోరాటం చేస్తున్నా. నన్ను ఆదర్శంగా తీసుకొని పది మంది అమ్మాయిలు ధైర్యంగా మారినా చాలు. జానీ మాస్టర్‌పై ప్రతీకారం తీర్చుకొనేందుకు నేను కేసు పెట్టలేదు. ఆత్మగౌరవం కోసమే ఫిర్యాదు చేశాను. అమ్మాయిలంటే ఆటబొమ్మలు కాదు. వాళ్ల 'నో' చెబితే దాన్ని గౌరవించాలి. నాలుగేళ్ల తర్వాత ఎందుకు కేసు పెట్టావని అందరూ ప్రశ్నిస్తున్నారు. అప్పట్లో నేను మైనర్‌ని. అప్పట్లో ఆయనకున్న పలుకుబడితో పోరాడే శక్తి నాకు లేదు. అయినా, ఆయనలో మార్పు వస్తుందేమోనని చూశా. ఆయన మారలేదు. వేధింపులు మరింత పెరగడంతో పోలీసులను ఆశ్రయించాను" అని చెప్పారు.

జూనియర్ కాలేజీల్లో విద్యా బోధన పరిశీలనకు అకడమిక్ కమిటీలు

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యా బోధన, ఇతర అంశాలను పరిశీలించేందుకుగాను జిల్లా అకడమిక్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా కాలేజీల్లో విద్యా బోధనను పెంపొందించేందుకు ఈ కమిటీలు కృషి చేస్తాయి. కాలేజీల్లో సిబ్బంది, విద్యార్థుల హాజరును ఈ కమిటీలు నిత్యం పరిశీలిస్తాయి. దీర్ఘకాలంగా గైర్హాజరయ్యే వారి విషయంలో తగు చర్యలు తీసుకోనున్నారు. స్టడీ అవర్‌లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చూడటంతోపాటు ఆయా కాలేజీలకు సంబంధించిన అకడమిక్ విషయాలను ఎప్పటికప్పుడు అకడమిక్ గైడెన్స్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్‌కు కమిటీ పంపించాల్సి ఉంటుంది.

గురుమూర్తి.. 'సూక్ష్మదర్శిని'

(మొదటి పేజీ తరువాయి)

విడుదలైంది. అందులో ఇంట్లో వాళ్ల మాట వినకుండా ఒక మహిళను పెళ్లి చేసుకుని బాలికను దత్తత తీసుకున్న కూతురిని కొడుకుతో కలిసి తల్లి హత్య చేస్తుంది. ఎవరికీ అనుమానం రాకుండా ఆమె శవాన్ని మాయం చేయాలని తల్లీకొడుకు పథకం వేస్తారు. ఇంట్లో చిన్న పాటి నీళ్ల ట్యాంకు ఏర్పాటు చేసి, అందులో యాసిడ్, ఇంకొన్ని రకాల రసాయనాలు కలుపుతారు. శవాన్ని ఆ ట్యాంకులో వేస్తారు. యాసిడ్, రసాయనాలు శవాన్ని కరిగించి నీళ్లలా మార్చేస్తాయి. శవం మొత్తం కరగడానికి ఐదారు రోజులు పడుతుంది. ఆ నీళ్లను కొంత కొంత చొప్పున కాలిపోకుండా వాష్‌రూమ్ నుంచి ఫ్లష్ ద్వారా మెల్లమెల్లగా వదులుతారు. కరిగిపోని ఎముకలను చిన్న చిన్న ముక్కలుగా... తర్వాత పొడి చేసి ఫ్లష్ ద్వారానే డ్రైనేజీలోకి వదిలేస్తారు. ఆ తల్లీకొడుకు ప్రవర్తనపై అనుమానం వచ్చిన పక్కింటి అమ్మాయి (హీరోయిన్) స్వయంగా విచారణ చేసి వారి నేరాన్ని ఎలా బయటపెట్టి పోలీసులకు పట్టించిందనేది సూక్ష్మదర్శిని సినిమా కథ. వెంకట మాధవి హత్య కేసులోనూ నిందితుడు ఆమె శవాన్ని ఆ సినిమాలో చూపించినట్టే మాయం చేయాలని భావించాడు. హెక్సా బ్లేడుతో తల, మొండెం వేరు చేసి, శరీరాన్ని మూడు ముక్కలుగా కోసి, మాంసాన్ని బకెట్‌లో వేసి నీళ్లు పోసి హీటర్‌తో మరిగించి, ముద్దగా మారిన శరీర భాగాలపై యాసిడ్, ఇతర రసాయనాలు పోసి సాధ్యమైనంత చిన్న చిన్న ముద్దలయ్యేలా చేసినట్లు తెలిసింది. ఎముకలను స్టవ్‌పై కాల్చి చిన్న చిన్న ముక్కలుగా విరగ్గొట్టి, దంచి పొడిలా మార్చినట్లు సమాచారం. వీటిని కొంత బాత్‌రూమ్‌లో ఫ్లష్ ద్వారా, మిగిలినది బకెట్‌లో వేసుకొని మీర్‌పేట పెద్ద చెరువులో పారేసినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

నిందితుడి చేతికి కాలిన గాయాలు

నిందితుడు గురుమూర్తి చేతికి కాలిన గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై విచారించగా శవాన్ని మాయం చేసే ప్రయత్నంలో ఆ గాయాలైనట్లు అతను చెప్పినట్లు తెలిసింది. ఇంట్లోంచి బయటకు దుర్వాసన రాకుండా పలు రకాల రసాయనాలు, స్ప్రేలు వాడినట్లు సమాచారం. బ్లూరేస్ టెక్నాలజీతో గురుమూర్తి ఇంట్లో సేకరించిన ఆధారాలను ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీకి పంపించగా.. వాటిని పరీక్షించి హతురాలు వెంకట మాధవికి చెందినవేనని నిర్ధారించారు.

మొదటి రోజే అల్లుడిపై అనుమానం

భార్యను చంపి, శవాన్ని మాయం చేసిన గురుమూర్తి మరుసటి రోజు అత్తారింటికి ఫోన్ చేసి ఇంట్లో చిన్న గొడవ జరిగిందని, దాంతో వెంకట మాధవి అలిగి ఇంట్లోంచి వెళ్లిపోయిందని చెప్పాడు. దాంతో ఆమె తల్లి ఉప్పాల సుబ్బమ్మ వెంటనే మీర్‌పేటకు వచ్చింది. బంధువుల ఇళ్లలో తన కూతురి గురించి వాకబు చేసింది. ఎక్కడా ఆమె జాడ తెలియకపోవడంతో అల్లుడితో కలిసి మీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత పోలీసుల విచారణలో ఆమె తన అల్లుడు గురుమూర్తిపైనే అనుమానం వ్యక్తం చేసింది. అతను ఇటీవల తన కూతురితో సరిగా ఉండడం లేదని, చీటికిమాటికి గొడవ పడుతుండగా పెద్దవాళ్ల సమక్షంలో మందలించామని చెప్పింది.

రీజినల్ రింగ్ రోడ్డు: దక్షిణ భాగంపై కేంద్రం నజర్!

కేంద్రమే చేపట్టాలంటూ ఇటీవల లేఖ రాసిన రాష్ట్రం.. ఏ పథకంలో చేర్చాలనే దానిపై కేంద్రం ఆలోచన

- రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయం
- అలైన్‌మెంట్‌లో మార్పులు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిని ఏ పథకం కింద చేపట్టాలన్న అంశంపై ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కేంద్రం వద్ద విజన్-2047 మినహా భారీ ప్రాజెక్టులను చేపట్టే కొత్త పథకాలు పెద్దగా లేవు. ఏదైనా కొత్త ప్రాజెక్టులను చేర్చాలంటే క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని ఏ స్కీమ్‌లోకి చేర్చాలి, అందుకు ఉన్న అవకాశాలేంటని కసరత్తు చేస్తోంది. ఇదే విషయాన్ని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో లేఖ రాయాలని కూడా నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని కేంద్రం పరిధిలోనే చేపట్టండంటూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రం దీనిపై దృష్టి పెట్టిందని, దక్షిణభాగం వివరాలను ఆరా తీస్తోందని సమాచారం. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం రీజినల్ రింగు రోడ్డును తెలంగాణకు 2016లో మంజూరు చేసింది. 2017లో దానిని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించింది. ఉత్తరభాగం నర్సాపూర్ నుంచి తూప్రాన్-గజ్వేల్-జగదేవ్‌పూర్-భువనగిరి-చౌటుప్పల్ వరకు 161.2 కిలోమీటర్లు ఉండగా, దక్షిణభాగం చౌటుప్పల్‌లో ప్రారంభమై ఆమనగల్-షాద్‌నగర్ మీదుగా సంగారెడ్డి వరకు 189 కిలోమీటర్ల మేర ఉంటుందని మంజూరు చేసినప్పుడు తెలిపింది. వీటిలో మొదటగా కేంద్ర ప్రభుత్వం ఉత్తరభాగం నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. భూ సేకరణ, అటవీ అనుమతులు, సహా వివిధ అంశాలతో దాదాపు ఆరేళ్లగా రహదారి పనుల్లో జాప్యం జరగ్గా.. గతేడాది డిసెంబరు 27న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) రహదారి నిర్మాణం కోసం టెండర్లను ఆహ్వానించడంతో కీలక అడుగు పడింది. అయితే దక్షిణభాగం రహదారికి సంబంధించిన పనులను మాత్రం కేంద్రం వెంటనే చేపట్టలేదు. పైగా భారత్ మాల పరియోజన- 1, 2 ప్రాజెక్టుల్లో ఈ రహదారిని ప్రతిపాదించినా అది ముందుకు కదల్లేదు. అనంతరం ఎన్‌హెచ్‌ఏఐ కింద రిజర్వ్ చేసి ఉంచారు. తాజాగా కేంద్రం ఇటీవల తీసుకువచ్చిన విజన్-2047లో దక్షిణ భాగాన్ని చేర్చింది. వాస్తవానికి ఈ రెండు భాగాలను కేంద్రమే పలు దఫాలుగా చేస్తామని చెప్పింది. విజన్-2047 ప్రకార మైతే.. దక్షిణ భాగానికి 2031లో అవార్డు పాస్ చేయాలని కూడా ప్రాథమికంగా నిర్ణయించింది. ఇదే విషయాన్ని ఇటీవల కేంద్రం రూపొందించిన విజన్-2047 రిపోర్టులో పొందుపరిచింది.

మూడోసారి టెండర్.. 3 మాడ్యూల్స్‌లో వివరాలు..

రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దక్షిణభాగాన్ని తామే సొంతంగా నిర్మించాలని భావించి, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) కోసం కన్సల్టెన్సీ సంస్థల ఎంపికకు గతేడాది నవంబరులో టెండర్లను ఆహ్వానించింది. కానీ, పలు కారణాల రీత్యా ఆ టెండర్లలో బిడ్‌లు దాఖలు కాకపోవడంతో వాటిలో పలు మార్పులు చేసి మళ్లీ ఈ ఏడాది జనవరిలో టెండర్లను పిలిచారు. మొదటిసారి ఆహ్వానించిన టెండర్ నోటీస్‌లోని పలు నిబంధనలనూ మార్చారు. దీంతో ఈ మార్పులపై నివేదిక తీసుకునేందుకు కన్సల్టెన్సీ సంస్థ ఎంపిక కోసం ఆర్‌అండ్‌బీ శాఖ తాజాగా టెండర్లను ఆహ్వానించింది. టెండర్‌ల దాఖలుకు గడువు తేదీని ఫిబ్రవరి 25గా పేర్కొంది. తాజాగా పిలిచిన టెండర్ నోటీసు ప్రకారం.. రహదారి నిర్మాణానికి కావాల్సిన నిధులను సమీకరించడం, దక్షిణభాగం రహదారికి ఇరువైపులా అలైన్‌మెంట్, వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ సహా పలు విషయాలపై నివేదిక ఇవ్వాలని ఆర్‌అండ్‌బీకి సూచించింది. వీటిని మూడు మాడ్యూల్స్‌గా విభజించి.. ఏ పనిని ఎంత కాలంలో పూర్తిచేయాలనే విషయాన్ని కూడా తెలిపింది. మాడ్యూల్-1లో వ్యూహాత్మక రోడ్ మ్యాప్‌ను (ప్రాజెక్టు సాధ్యత) ఇవ్వాలని పేర్కొంది. అంటే ప్రాజెక్టు నిర్మాణం ఎందుకు, దాని దృక్పథం, ఆలోచన ఏంటనే అన్ని వివరాలను సమగ్రంగా రూపొందించాలని సూచించింది. అదే విధంగా రహదారి అభివృద్ధి పర్యవేక్షణ, సమాచారానికి సంబంధించిన వ్యవస్థను కూడా తయారు చేయాలని పేర్కొంది. దీనిని రెండు నెలల సమయంలో పూర్తిచేయాలని నిర్దేశించింది. ఇక మాడ్యూల్-2లో రోడ్డు నిర్మాణం కోసం నిధుల సమీకరణ ఎలా, నిధుల ప్రణాళిక (ఫైనాన్షియల్ స్ట్రక్చరింగ్) ఏంటన్నది నాలుగు నెలల్లో తెలపాలని సూచించింది.

మార్పులతో కొత్త టెండర్లు..

మాడ్యూల్-3లో ప్రాజెక్టు అమలు సమయంలో వ్యవహరించాల్సిన విధానం, నిర్మాణం సహా పలు అంశాలను 30 నెలల్లో ఇవ్వాలని కేంద్రం పేర్కొంది. వాస్తవానికి గతేడాది నవంబరు 25న పిలిచిన టెండర్లలో ఇవే అంశాలున్నాయి. కానీ, బిడ్‌లు దాఖలు కాకపోవడంతో పలు మార్పులతో ఇప్పుడు ఆర్థిక, సాంకేతిక వివరాల కోసం టెండర్లను ఆహ్వానించారు. మరోవైపు దక్షిణ భాగం పనులనూ కేంద్రమే చేపట్టాలంటూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఈ నేపథ్యంలో డీపీఆర్ సహా మిగిలిన ఏ పనులనైనా కేంద్రమే చూసుకోవాల్సి ఉంటుంది. కానీ, మళ్లీ దక్షిణభాగం డీపీఆర్‌ను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే కన్సల్టెన్సీల ఎంపిక కోసం టెండర్లను ఆహ్వానించింది. ఈ రహదారి మంజూరైనప్పు డు ప్రాథమికంగా ఖరారైన అలైన్‌మెంట్ ప్రకారం చౌటుప్పల్- ఆమనగల్- సంగారెడ్డి వరకు 189 కిలోమీటర్లుగా పేర్కొన్నారు. ఆ తరువాత దీనిని రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాలనే ఆలోచన నేపథ్యంలో ప్రాథమిక అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారు. కొత్త అలైన్‌మెంట్ ప్రకారం 11 కిలోమీటర్లు పెరిగి రోడ్డు మొత్తం దూరం 200 కిలోమీటర్లకు పెరిగింది. ఈ మేరకు 200 కిలోమీటర్లకు డీపీఆర్ ఇవ్వాలంటూ టెండర్ నోటీసులోనూ పేర్కొన్నారు. కొత్త అలైన్‌మెంట్ ప్రకారం డీపీఆర్‌ను రూపొందించి, దాని ప్రకారమే రహదారి నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిసింది. అందుకోసమే డీపీఆర్ కోసం రాష్ట్ర ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించిందని కూడా ప్రభుత్వవర్గాల్లో చర్చ జరుగుతోంది.

రేపు దేశవ్యాప్తంగా యూపీఎస్‌పై నిరసనలు

- కేరళ మహా ర్యాలీలో స్థిత ప్రజ్ఞ పిలుపు



మాట్లాడుతున్న స్థిత ప్రజ్ఞ

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక శాఖ ఈ నెల 24న జారీ చేసిన యూనిఫైడ్ పెన్షన్ విధానం(యూపీఎస్) నోటిఫికేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా మంగళవారం(28న) ఉద్యోగ, ఉపాధ్యాయ కార్యాలయాల్లో యూపీఎస్ ప్రతులు దగ్ధం చేయడంతోపాటు దేశవ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని ఎన్‌ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థిత ప్రజ్ఞ పిలుపునిచ్చారు. ఆదివారం కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ జిల్లా కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో స్టేట్ ఎన్‌పీఎస్ ఎంప్లాయీస్ కలెక్టివ్ సమక్షంలో క్విట్ ఎన్‌పీఎస్-నో యూపీఎస్ మహా ర్యాలీ జరిగింది. తర్వాత స్టేడియం కార్నర్ వద్ద క్విట్ ఎన్‌పీఎస్ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7న బెంగళూరు కేంద్రంగా ఫ్రీడం పార్కు వద్ద యూపీఎస్ వద్దంటూ ధర్నా చేపడతామన్నారు. మార్చి 2న హైదరాబాద్‌లో చలో ధర్నా చౌక్ పేరిట నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు.

బీజేపీ నిర్ణయాలతో ప్రమాదంలో రాజ్యాంగం

- సీపీఎం కేంద్ర సమన్వయ కార్యదర్శి ప్రకాశ్ కారత్



మాట్లాడుతున్న ప్రకాశ్ కారత్

సంగారెడ్డి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హిందూత్వ సిద్ధాంతం, కార్పొరేట్ శక్తులు అనే రెండు పిల్లర్లపైనే మోదీ ప్రభుత్వం ఆధారపడి ఉందని సీపీఎం కేంద్ర సమన్వయ కార్యదర్శి ప్రకాశ్ కారత్ విమర్శించారు. ఈ దేశాన్ని ఒకే మతానికి పరిమితం చేయాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నిర్ణయాలతో దేశ రాజ్యాంగం ప్రమాదంలో పడిందని అసహనం వ్యక్తం చేశారు. సంగారెడ్డిలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర మహాసభల్లో భాగంగా ఆదివారం ప్రతినిధుల సభను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ప్రకాశ్ కారత్ హాజరై మాట్లాడారు. సీపీఎం జాతీయ మహాసభలను మదురైలో నిర్వహిస్తామని, అక్కడ కీలక నిర్ణయాలు తీసుకుంటామని ప్రకాశ్ కారత్ తెలిపారు. లగచర్లలో భూసేకరణపై బాధితుల పక్షాన పోరాటం చేయగానే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకడుగు వేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. తనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ చేసి.. సమస్యలపై కలిసి పనిచేద్దామని అన్నారని తెలిపారు. అయితే బీజేపీపై బీఆర్ఎస్ వైఖరిని స్పష్టం చేయనిదే తాము కలవబోమని చెప్పుకొచ్చారు. ఈ సభలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ, జర్నలిస్టు సత్యనారాయణ ఇక లేరు

- నివాళులర్పించిన పలువురు బీఆర్ఎస్ నేతలు



సత్యనారాయణ

సంగారెడ్డి క్రైం, జనవరి26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్సీ, జర్నలిస్ట్ ఆర్.సత్యనారాయణ అనారోగ్యంతో సంగారెడ్డిలోని ఆయన నివాసంలో ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. ప్రజాహిత కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన సత్యనారాయణ మృతి బాధాకరమని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులు కూడా సంతాపం తెలిపారు. మరోవైపు సత్యనారాయణ భౌతికకాయానికి సంగారెడ్డిలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్.సత్యనారాయణ 1985లో జర్నలిస్టుగా తన ప్రస్థానం ప్రారంభించారు. ఈనాడు, ఉదయం, వార్త దినపత్రికల్లో జిల్లా రిపోర్టర్‌గా పనిచేశారు. మంజీరా, సలామ్ హైదరాబాద్ అనే పత్రికలను సొంతంగా నిర్వహించారు. 2001లో టీఆర్ఎస్‌లో చేరారు. 2007లో కరీంనగర్ పట్టభద్రుల స్థానం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేసి గెలుపొందారు.

స్వగ్రామంలో రవితేజకు కన్నీటి వీడ్కోలు

చౌటుప్పల్ రూరల్ జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఈ నెల 19న దుండగుల కాల్పుల్లో మృతిచెందిన కొయ్యడ రవితేజ(27) అంత్యక్రియలు ఆదివారం ఆయన స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో ముగిశాయి. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రవితేజకు కడసారిగా వీడ్కోలు పలికారు. రవితేజ మృతదేహం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆదివారం ఉదయం 6 గంటలకు కొయ్యలగూడేనికి చేరుకుంది. మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు బోరున విలపించారు. 'మేమే అమెరికాకు వద్దామనుకున్నాం.. నువ్వే విగతజీవిగా వచ్చావా నాయనా' అంటూ తల్లిదండ్రులు కుమారుడి మృతదేహంపై పడి కన్నీళ్లు పెట్టుకోవడం పలువురిని కలచివేసింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, పలువురు నాయకులు రవితేజ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతదేహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించి శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

కాళేశ్వరాలయ ఈవోపై వేటు

- ఆలయంలో ప్రైవేటు ఆల్బమ్.. చిత్రీకరణపై ప్రభుత్వం సీరియస్

మహదేవపూర్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం తలుపులు మూసేసి గర్భాలయంలో సినీ గాయని మధుప్రియ ప్రైవేట్ ఆల్బమ్ చిత్రీకరించిన ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇన్‌చార్జి ఈవో మారుతిపై వేటు వేసింది. ఈ మేరకు ఆయనను ఆలయ విధులను నుంచి తొలగిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఓ పూజారికి, ఒక జూనియర్ అసిస్టెంట్‌కు మెమోలు జారీ చేయడంతో పాటు గాయని మధుప్రియకు నోటీసులిచ్చారు. ఈ క్రమంలో రేగొండ ఆలయ ఈవోగా ఉన్న మహేష్‌ను కాళేశ్వరం ఈవోగా నియమించారు. మహేష్ గతంలో కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో పనిచేయగా కొన్ని ఆరోపణల నేపథ్యంలో ఆయనను కోటంచ ఆలయానికి బదిలీ చేశారు. మళ్లీ ఆయననే మారుతి స్థానంలో నియమించడం చర్చనీయాంశంగా మారింది.

ఔటర్ పాడియావు!

(మొదటి పేజీ తరువాయి)

నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డును బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేటు సంస్థకు లీజుకిచ్చింది. ఐఆర్‌బీ అనుబంధ సంస్థ ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేటు లిమిటెడ్‌కు ముప్పై ఏళ్ల పాటు నిర్వహణ, టోల్ వసూలు అప్పగించారు. మొత్తం సొమ్ము రూ.7380 కోట్లను ఒకేసారి చెల్లించేశారు. 2023 ఆగస్టు 11 నుంచి ఔటర్ రింగ్ రోడ్డు ప్రైవేటు కంపెనీ పరమైంది. మొదట రోజుకు రూ.1.55 కోట్ల నుంచి రూ.1.65 కోట్ల వరకు వచ్చింది. ఏడాది గడవక ముందే రెండు కోట్లు దాటింది. ఓఆర్‌ఆర్ అండగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ విస్తరిస్తోంది. దాంతో ఔటర్‌పై రోజు రోజుకు వాహనాల రాకపోకలు పెరగడమే కానీ తగ్గే పరిస్థితి లేదు. ప్రస్తుతం రోజుకు 2 లక్షల వాహనాలు తిరుగుతున్నాయి. ఏటా పెరిగే టోల్ ఛార్జీలు, కొత్త వాహనాలతో ఔటర్ ఆదాయం భారీగా పెరగనుంది.

2023తో పోలిస్తే వంద కోట్లు పెరిగింది

2024 జనవరి నుంచి 2024 డిసెంబరు వరకు ఏడాదిలో రూ.764కోట్ల ఆదాయం వచ్చింది. 2023 సంవత్సరంతో పోల్చితే దాదాపు వంద కోట్లకు పైగా ఆదాయం పెరిగింది. 2024 సంవత్సరం తొలి నెల రూ.59.3 కోట్ల ఆదాయం రాగా చివరి నెల రూ.71.3 కోట్లు వసూలయ్యాయి. 2024 సంవత్సరంలోనే 20 శాతం పెరిగింది. 2024 ఏప్రిల్, సెప్టెంబరు, నవంబరులలో మాత్రమే ఆదాయంలో 2 శాతం మేర తగ్గుదల కనిపించింది. మిగతా అన్ని నెలల్లో 4-10 శాతం పెరిగింది. ఆదాయం తగ్గిన నెలల తర్వాతి నెలల్లో ఆదాయంలో భారీ పెరుగుదల కనిపించింది. ఔటర్ ప్రైవేటు చేతికి వెళ్లిన 2023 ఆగస్టు 11వ తేదీ అర్ధరాత్రి నుంచి 2024 డిసెంబర్ 31 వరకు ఆ సంస్థకు 16 నెలల్లో రూ.1,036 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ దూకుడు చూస్తుంటే భవిష్యత్తులో ఆదాయం వృద్ధిరేటు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. లీజు సొమ్ము చెల్లించడానికి ఐఆర్‌బీ సంస్థ రుణసమీకరణ చేసింది. టోల్ వసూళ్ల ఆదాయం ఇదే తీరులో ఏటా పెరుగుతూ పోతే.. 8-9 సంవత్సరాల్లోనే ఆ అప్పంతా తీరిపోతుందని, మిగతా లీజు కాలంలో ఐఆర్‌బీ సంస్థకు వచ్చేదంతా లాభమేనని అంచనా. అయితే.. అలా అంచనాలకు మించి ఆదాయం వస్తే పదేళ్ల తర్వాత సమీక్షించి లీజు గడువును తగ్గించేలా టెండర్ నిబంధనల్లో పొందుపరిచామని అప్పట్లో అధికారులు వెల్లడించారు. దాన్ని ఏమేరకు వాడుకుంటారో చూడాలి.

ఆ నివేదికను తొక్కిపెట్టారా?

ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటుకు ఇవ్వాలని నిర్ణయించినపుడు 30 ఏళ్ల ఆదాయ, వ్యయాలను అంచనా వేసే బాధ్యతను అప్పట్లో హెచ్‌ఎండీఏ మాజర్ అనే సంస్థకు అప్పగించింది. ఆ సంస్థ ఇచ్చిన నివేదికను ఎందుకో బయట పెట్టలేదు. కేవలం రూ.7,380 కోట్లకు ఏ విధంగా 30 ఏళ్ల పాటు లీజుకిస్తారని అప్పట్లో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో 2019-20లో రూ.351 కోట్లు వసూలవగా, కొవిడ్ ప్రభావంతో 2020-21లో 310 కోట్లే వచ్చాయి. తర్వాత సంవత్సరం రూ.422 కోట్లు వసూలయ్యాయి. 2022-23లో రూ.543 కోట్లు వసూలయ్యాయి. అంటే ఏకంగా 28 శాతం పెరిగింది. ఆదాయం ఏటా కనీసం 20 శాతం పెరుగుతున్నట్లు స్పష్టంగా తెలుస్తున్నా, మాజర్ సంస్థ నివేదికలో ఈ గణాంకాలు తప్పనిసరిగా పొందుపరిచి ఉన్నా గత ప్రభుత్వం ఎందుకో ఆ నివేదికను బయటకు రానివ్వలేదు. ఔటర్‌ను లీజుకివ్వడానికి బేస్ ప్రైస్‌ను కూడా వెల్లడించలేదు.

కోర్టులో పందెం కోడి 'పాట'

- ఇటీవల పందెం రాయుళ్ల నుంచి స్వాధీనం
- వేలంపాటలో రూ.2,300కు కొన్న ఓ పక్షి ప్రేమికుడు
- రాజేంద్రనగర్ కోర్టులో ఘటన.. అతడికి, కుక్కుటానికీ సన్మానం

రాజేంద్రనగర్, జనవరి26 (ఆంధ్రజ్యోతి): పందెం కోడి కోసం పలువురు వేలంపాటలో పోటీపడ్డారు. ఈ వేలం కోర్టు సాక్షిగా జరగడమే ఇక్కడ విశేషం! కండపుష్టితో దిట్టంగా ఉన్న ఆ కోడిని ఎవరు కొన్నా కోసుకుతింటారనే ఆందోళనతో ఓ పక్షి ప్రేమికుడు దాన్ని వేలంపాటలో దక్కించుకోవడం అంతకన్నా విశేషం!! ఈ ఘట్టానికి వేదికైంది ఉప్పర్‌పల్లిలోని రాజేంద్రనగర్ 13వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు! మరి.. ఈ కోడి కోర్టులోకెలా వచ్చింది? అంటే.. మొయినాబాద్‌లో కోడి పందేలు నిర్వహిస్తుంటే పోలీసులు వెళ్లి పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఓ పందెం కోడినీ స్వాధీనం చేసుకున్నారు. ఆ కుక్కుటాన్ని శనివారం కోర్టులోకి తీసుకొచ్చారు. ఆ కోడిని న్యాయమూర్తి అంకిత్‌సర్వ ఆధ్వర్యంలో వేలం వేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న గగన్‌పహాడ్ వాసి ఈ. రామకృష్ణ రూ.2,300 వెచ్చించి ఆ కోడిని పాడుకున్నారు. కోడిని ఏం చేస్తారు? అని ఆయన్ను అడిగితే.. "వేరెవరైనా పాడుకుంటే కోడిని కోసుకుతింటారని భయం వేసింది. అందుకే నేను పాడుకున్నాను. నా స్నేహితుడికి ఫామ్ హౌజ్ ఉంది. అక్కడ ఎన్నోరకాల పక్షులున్నాయి. ఈ కోడినీ పెంచేలా చూస్తాను" అని చెప్పారు. బంజారాహిల్స్‌లోని పందెం కోళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ ఆధ్వర్యంలో రామకృష్ణను సన్మానించారు. ఓ పక్షి ప్రేమికుడి చెంతకు చేరినందుకు ఆ కోడి మెడలోనూ అభినందన పూర్వకంగా దండ వేశారు.

కిడ్నీ రాకెట్ సూత్రధారి పవన్ అరెస్ట్

- చెన్నైలో అదుపులోకి తీసుకున్న రాచకొండ పోలీసులు

హైదరాబాద్ సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అలకనంద ఆస్పత్రిలో జరిగిన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ దందాలో ప్రధాన సూత్రధారి, విశాఖపట్నానికి చెందిన డాక్టర్ పవన్ అలియాస్ లియోన్‌ను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. అతడితో పాటు ఈ దందాకు సహకరించిన మరో వైద్యుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. నెఫ్రాలజిస్టుగా పనిచేస్తున్న పవన్.. కిడ్నీ దందాలో కీలక సూత్రధారి అని పోలీసులు గుర్తించారు. అలకనంద ఆస్పత్రిపై దాడులు జరిగిన తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిన పవన్ చెన్నైలో ఉన్నట్లు గుర్తించిన రాచకొండ పోలీసులు.. అక్కడికి వెళ్లి పవన్‌ను, మరోవైద్యుడిని అదుపులోకి తీసుకున్నారు.

బతుకులు ఛిద్రం

(మొదటి పేజీ తరువాయి)

నలిగిపోయారు. ప్రమాదంలో తండ్రి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు.. ఇలా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ ఇంటి పెద్ద భార్య, మరో కుమారుడు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం... వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు పోలీసు పెట్రోలు బంకు వద్ద ఆదివారం ఉదయం సంభవించింది. రోడ్డంతా నెత్తురు.. ఛిద్రమైన శరీర భాగాలతో ఒళ్లు జలదరించేలా అక్కడ బీతావహంగా మారింది. మృతులు, క్షతగాత్రులంతా మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వలస జీవులు.. వంట కోసం ఉపయోగించే కత్తిపీటలు, కత్తులు తయారు చేసి, అమ్ముకొని పొట్టపోసుకునే బడుగుజీవులు! మధ్యప్రదేశ్ భోపాల్‌లోని లలితానగర్ ప్రాంతానికి చెందిన లోపిట సంతోష్ చౌహాన్ (48).. భార్య చామా బాయి (40), కుమారులు ముకేశ్ చౌహాన్, కన్నా చౌహాన్ (7), కూతుళ్లు అర్తి చౌహాన్ (20), కిరణ్ చౌహాన్ (12)తో కలిసి తొమ్మిదినెలల క్రితం వరంగల్ శివారులోని మామునూరుకొచ్చారు. ఆయన కుటుంబంతో పాటు భోపాల్ నుంచి మరో ఆరు కుటుంబా లు వలసొచ్చాయి. వీరంతా తాము తయారు చేస్తున్న వస్తువులను వరంగల్‌కు తీసుకెళ్లి అమ్ముతుంటారు. ఆదివారం సంతోష్ చౌహాన్, ఆయన కుటుంబసభ్యులంతా ఒకే ఆటోలో మామునూరు నుంచి వరంగల్‌కు బయలుదేరారు. ఇక కరీమాబాద్ ఎస్ఆర్‌ఆర్ తోట ప్రాంతానికి చెందిన మరో ఆటో ఐనవోలు నుంచి వరంగల్ వైపు వెళుతోంది. ఈ రెండు ఆటోలు మామునూరు పెట్రోలు బంకు వద్ద ఘోర ప్రమాదానికి గురయ్యాయి. విశాఖపట్టణం నుంచి వరంగల్ వైపు భారీ ఉక్కు స్తంభాల లోడుతో వెళుతున్న కంటెయినర్ అదుపు తప్పి పడిపోయింది. అందులోని స్తంభాలన్నీ నేరుగా రెండు ఆటోలపై పడ్డాయి. ఈ ఘటనలో సంతోష్, అర్తి, కిరణ్ అక్కడికక్కడే మృతిచెందారు. సంతోష్ భార్య చామాబాయి, కుమారులు కన్నా చౌహాన్, ముకేశ్‌తో పాటు మరో ఆటోలోని డ్రైవర్ రాపర్తి సాగర్ తీవ్రంగా గాయపడ్డారు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నా చౌహాన్ ప్రాణాలొదిలాడు. ఈ ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడ్డ వారిని తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని వరంగల్ కలెక్టర్, పోలీసు అధికారులకు ఆదేశాలు జారీచేశారు.



ధ్వంసమైన ఆటోలో చిక్కుకొని విలవిల్లాడుతున్న ఆటో డ్రైవర్ సాగర్

పంపిస్తే మా ఊరెళ్లిపోతాం

మృతులు, క్షతగాత్రుల సంబంధీకుల రోదనలతో ఎంజీఎం ఆస్పత్రి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. మిగతా రోగుల బంధువులు వారికి భోజనం అందించబోగా వారు తీసుకోలేదు. 'మేం ఎలా తినగలం? మా నోట్లోకి మంచినీళ్లు కూడా పోవడం లేదు. మా సొంతూరికి పంపిస్తే వెళ్లిపోతాం'అని చేతులు జోడిస్తూ విలపించారు. ఆస్పత్రి వద్ద మృతుల సంబంధీకులను మంత్రి కొండా సురేఖ పరామర్శించారు. మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఎంజీఎంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు.

సత్వర వైద్యం అందించాలి: హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌జిల్లా మామునూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ఆదివారం ఎక్స్‌వేదికగా ఆయన తన సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు కోరారు.


గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఆకాశ్ ఆర్మీ లాంచర్

మోదీ తలపాగా ప్రత్యేక ఆకర్షణ

గణతంత్ర వేడుకల్లో ప్రధాని మోదీ పసుపు, ఎరుపు వర్ణాలతో కూడిన తలపాగా 'సఫా'ను ధరించారు. ఏటా స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకల్లో వివిధ ప్రాంతాలకు చెందిన తలపాగాలను ధరించడం ద్వారా అక్కడి సంస్కృతిని మోదీ ప్రతిబింబింపజేస్తున్నారు. గతేడాది గణతంత్ర వేడుకల్లో రాజస్థానీలు ధరించే బహుళ రంగుల తలపాగాను ఆయన ధరించారు. కాగా, కర్తవ్యపథ్‌లో చెత్తను ఏరడం ద్వారా 'స్వచ్ఛభారత్' ప్రాముఖ్యతను ప్రధాని మోదీ గణతంత్ర వేడుకల్లో చాటిచెప్పారు.


కర్తవ్యపథ్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఇండోనేసియా అధ్యక్షుడు సుబియాంటో, ప్రధాని మోదీ



కర్తవ్యపథ్‌లో సైనిక సత్తా

గణతంత్ర పరేడ్‌లో త్రివిధ దళాల విన్యాసాలు.. సాయుధ పాటవానికి అద్దం పట్టిన వేడుకలు

» వేడుకలకు 10వేల మందికి పైగా అతిథులు

న్యూఢిల్లీ, జనవరి 26: భారత 76వ గణతంత్ర వేడుకలు మన సైనిక సత్తాకు వేదికగా నిలిచాయి. దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఆదివారం నిర్వహించిన ఈ వేడుకలు త్రివిధ దళాల శక్తిసామర్థ్యాలను చాటిచెప్పాయి. ఎలైట్ బృందాల కవాతులు, క్షిపణులు, స్వదేశీ ఆయుధ వ్యవస్థలతో సహా సైనిక శక్తిని ఘనంగా ప్రదర్శించాయి. దేశ ఘన సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో సైనిక విన్యాసాలను ఆసాంతం ఆసక్తిగా తిలకించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ఆయన సంప్రదాయ గుర్రపు బగ్గీలో వేడుకలకు రావడం ఆకట్టుకుంది. ప్రధాని మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్, పలువురు కేంద్ర మంత్రులు, దేశ అత్యున్నత సైనికాధికారులు, విదేశీ దౌత్యవేత్తలు, సీనియర్ అధికారులు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నారీ శక్తి

గణతంత్ర వేడుకల్లో మహిళా బృందాల పరేడ్, మహిళ, శిశు అభివృద్ధికి సంబంధించిన శకటాల ప్రదర్శనతో కర్తవ్యపథ్‌లో నారీశక్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఐశ్వర్య జాయ్ నేతృత్వంలో 148 మందితో కూడిన సీఆర్‌పీఎఫ్ మహిళా బృందం, సీనియర్ అధికారిణి ఏక్తా కుమారి నేతృత్వంలోని ఎన్‌సీసీ బాలికల బృందం, మదేశ్ అశోక్, అంకితా కుమారి నేతృత్వంలోని ఎన్‌సీసీ సంయుక్త బ్యాండ్ బృందం పరేడ్‌లో పాల్గొన్నాయి. అలాగే, ఢిల్లీ పోలీసుకు చెందిన మహిళా బృందం వరుసగా రెండో ఏడాది బ్యాండ్ మాస్టర్ రుయంగునో కెన్సే నేతృత్వంలో బ్యాండ్ ప్రదర్శన నిర్వహించింది. ఆర్మీ, నావికాదళ, వైమానిక దళ మహిళా దళాల కవాతులకు సీనియర్ మహిళా అధికారిణులు లెఫ్టినెంట్ రవీందర్‌జీత్ రంధ్వా, లెఫ్టినెంట్ కమాండర్ మణి అగర్వాల్, ఫ్లైట్ లెఫ్టినెంట్ రుచి సహా నేతృత్వం వహించారు. అలాగే, డీఆర్‌డీవో బృందం కవాతుకు శాస్త్రవేత్త సునీతా జెనా నేతృత్వం వహించారు. 'మాతృత్వం, జీవిత చక్రం నిరంతర విధానం, మహిళల నేతృత్వంలో అభివృద్ధి' అనే థీమ్‌తో మహిళా శిశు అభివృద్ధి శాఖ శకటాన్ని ప్రదర్శించింది. కవాతులో 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలు సందడి చేయగా, వాటిలో మహిళా సాధికారతను ప్రతిబింబించేవి 26 ఉన్నాయి. సుమారు 15 మంది మహిళా పైలట్ల బృందం ఫ్లైపాస్ట్‌లో ప్రతిభను ప్రదర్శించింది.


ఇండోనేసియా దళం బ్యాండ్

ఇండేనేసియా కవాతు దళం, బ్యాండ్ దళం ఈసారి తొలిసారిగా గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నాయి. ఇండోనేసియా మిలటరీ దళాలు విదేశీ గడ్డపై కవాతు, బ్యాండ్ ప్రదర్శన నిర్వహించడం కూడా ఇదే తొలిసారి. ఇండోనేసియా త్రివిధ దళాలకు చెందిన 152 మంది కవాతులో పాల్గొనగా, మరో 190 మంది బ్యాండ్ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ ప్రతి నెలా చివరి ఆదివారాలలో నిర్వహిస్తున్న మన్ కీ బాత్ (రేడియో) కార్యక్రమాల్లో పాల్గొన్న సుమారు 400 మందిని గణతంత్ర వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించారు.

'ప్రళయ్' ప్రదర్శన

స్వదేశీ పరిజ్ఞానంతో డీఆర్‌డీవో తయారుచేసిన ప్రళయ్ క్షిపణిని తొలిసారిగా గణతంత్ర వేడుకల్లో ప్రదర్శించారు. ఇది ఉపరితలం నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే స్వల్పశ్రేణి క్షిపణి. దీని పరిధి 150 నుంచి 500 కిలోమీటర్ల వరకు ఉంటుంది. 500 నుంచి వెయ్యి కిలోల బరువులను మోసుకెళ్లగలదు. ఇది అణ్వాయుధాలనూ తీసుకెళ్లగలదు. అలాగే, డీఆర్‌డీవో రూపొందించిన క్షిపణులను పరేడ్‌లో ప్రదర్శించారు.

5వేల మంది కళాకారులు..

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 5వేల మందికి పైగా జానపద, గిరిజన కళాకారులు.. 45 నృత్య రూపాలను ప్రదర్శించారు. సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో 'జయతి జయ మామా భారతం' పేరుతో 11 నిమిషాల పాటు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన అలరించింది. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని దేశంలోని గిరిజన, జానపద రూపాల గొప్పదనం, వారసత్వాన్ని కొనసాగించేలా ప్రదర్శించిన నృత్య రీతులు విశేషంగా ఆకట్టుకున్నాయి. గణతంత్ర వేడుకలకు గ్రామ సర్పంచ్‌లు, విపత్తు సహాయక కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పారాలింపిక్ అథ్లెట్లు సహా సుమారు 10వేల మంది ప్రత్యేక అతిథులు వేడుకలకు హాజరయ్యారు. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ కింద పునరుత్పాదక శక్తిని వినియోగించే రైతులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు.

ఆకట్టుకున్న శకటాలు

బలమైన, సురక్షితమైన భారత్ థీమ్‌తో త్రివిధ దళాలకు చెందిన శకటం సాయుధ దళాల మధ్య విస్తృత సమైక్యతా స్ఫూర్తిని ప్రతిబింబించింది. అధునాతన ఆయుధ వ్యవస్థలతో దేశీయంగా రూపొందించిన అర్జున్ యుద్ధ ట్యాంకు, తేజస్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లతో భూమి, నీరు, ఆకాశంలో ఏకకాలంలో యుద్ధం చేయగలిగిన ఉమ్మడి సైనిక సామర్థ్యాలను ప్రదర్శించింది. నలుగురు అధికారులు, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ నమూనాలతో భారత సముద్ర ప్రయోజనాలను పరిరక్షించగల బలమైన ఆత్మనిర్భర్ నావికా దళానికి ప్రతీకగా ఇండియన్ నేవీకి చెందిన శకటం నిలిచింది. నలుగురు అధికారులు, 144 మంది సిబ్బందితో కూడిన ఐఏఎఫ్ బృందం తొలుత మూడు మిగ్-29 ఎయిర్‌క్రాఫ్ట్‌లతో ఫ్లై-పాస్ట్ నిర్వహించింది. బీఎస్ఎఫ్‌కు చెందిన ఒంటె దళం కవాతు ఆకర్షణగా నిలిచింది. డేర్ డెవిల్స్‌గా ప్రసిద్ధి పొందిన కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్ చేసిన మోటార్ సైకిల్ విన్యాసాలు కళ్లు తిప్పుకోనివ్వలేదు. చివరిగా వాయుసేనకు చెందిన రాఫెల్, సుఖోయ్, జాగ్వార్, డోర్నియర్ తదితర 22 యుద్ధ విమానాలు, 11 రవాణా విమానాలు, 7 అపాచీ, ఎంఐ-17 హెలికాప్టర్లు చేసిన ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలతో వేడుకలు ఘనంగా ముగిశాయి.


రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్ర సామాజిక న్యాయ శాఖ రూపొందించిన శకటం

దండకారణ్యంలో జాతీయజెండా రెపరెపలు

» ఛత్తీస్‌గఢ్‌లోని ఏజెన్సీ గ్రామాల్లో తొలిసారి

» హిడ్మా గ్రామంలో బస్సు సర్వీస్ ప్రారంభం


బీజాపూర్ జిల్లా కొర్‌గట్టు గ్రామంలో జాతీయజెండా ఎగురవేస్తున్న బలగాలు

చర్ల, జనవరి26(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మావోయిస్ట్ ప్రభావిత బీజాపూర్ దండకారణ్యంలో మొదటిసారి జాతీయ జెండాలు రెపరెపలాడాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం కొండపల్లి, కొర్‌గట్టు, జీడిపల్లి తదితర గ్రామాల్లో జాతీయ జెండాలు ఎగిరాయి. కేంద్ర బలగాల అధికారులు భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి స్థానికులకు జాతీయ జెండా ఎగుర వేస్తున్న దృశ్యాలు చూపించారు. అలాగే స్థానిక విద్యార్థులతో ర్యాలీ కూడా నిర్వహించారు. మావోయిస్ట్ నేత హిడ్మా సొంతూరైన కొర్‌గట్టు గ్రామం నుంచి బస్‌సర్వీస్ ట్రయల్‌రన్ నిర్వహించారు. డ్రోన్ కెమెరాల నిఘాలో ప్రత్యేకమైన బందోబస్తు నడుమ బస్సును కొర్‌గట్టు గ్రామం నుంచి పామేడు గ్రామం వరకు నడిపించారు. ఈ సందర్భంగా స్థానిక ఆదివాసీలకు దుస్తులు అందజేశారు. మావోయిస్టు నేత హిడ్మా ప్రభావం ఉన్న ప్రాంతాలు కావడంతో 5 నెలల క్రితం కేంద్ర బలగాలు ఇక్కడ పోలీస్ క్యాంపులు ఏర్పాటు చేశాయి.

అబ్బుర పర్చిన డేర్ డెవిల్స్ విన్యాసాలు



మోటార్ సైకిళ్లతో సైనికుల బృందం నిర్వహించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. 'డేర్ డెవిల్స్'గా పేరొందిన ఆర్మీ సైనికులు మోటార్ సైకిళ్లపై అసాధారణ నైపుణ్యాలు ప్రదర్శించింది. ఈ ప్రదర్శనలో ముఖ్యంగా కెప్టెన్ డింపుల్ సింగ్ భాటి.. అందరి దృష్టినీ ఆకర్షించారు. కదులుతున్న మోటార్‌సైకిల్‌పై అమర్చిన 12 అడుగుల నిచ్చెనపై నుంచి ఆమె రాష్ట్రపతి ముర్ముకు గౌరవ వందనం సమర్పించారు. తద్వారా ఆర్మీలో ఈ ఘనత సాధించిన తొలి మహిళా అధికారిగా ప్రపంచ రికార్డు నెలకొల్పారు.

సైఫ్‌పై దాడి కేసు నిందితుడి వేలిముద్రలు ఎక్కడ?

» ఘటనాస్థలంలో 19 నమూనాల సేకరణ

» దేనితోనూ సరిపోలని షరీఫుల్ ముద్రలు



ముంబై, జనవరి 26: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై దాడి కేసు కీలక మలుపు తిరిగింది. ముంబైలోని ఆయన ఇంట్లోకి చొరబడి ఆయనపై దాడి చేసిన నిందితుడు, బంగ్లాదేశ్ జాతీయుడైన షరీఫుల్ ఇస్లాం షెహజాద్ వేలిముద్రలు, ఘటనాస్థలి నుంచి సేకరించిన వేలిముద్రలతో సరిపోలేదు. ఈ మేరకు మహారాష్ట్ర సీఐడీని ఉటంకిస్తూ జాతీయ మీడియా సంస్థ పేర్కొంది. షరీఫుల్ రెండు చేతుల నుంచీ పది వేలిముద్రలను సేకరించి సీఐడీకి చెందిన ఫింగర్ ప్రింట్ బ్యూరోకు పంపగా, ఘటనా స్థలి నుంచి సేకరించిన 19 వేలిముద్రల శాంపిల్స్‌లో ఏ ఒక్కదానితోనూ సరిపోలేదు. ఈ మేరకు నివేదికను పుణెలోని సీఐడీ సూపరింటెండెంట్‌కు నివేదించారు. చిత్రం ఏమిటంటే.. సైఫ్‌పై దాడికి సంబంధించి షరీఫుల్‌ను అదుపులోకి తీసుకునే ముందే అనుమానంతో వేర్వేరు చోట్ల ఇద్దరిని ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆ ఇద్దరికీ ఈ కేసుతో సంబంధం లేదని నిర్ధారించుకొని వదిలేశారు.

సనాతన వైదిక దేశమే లక్ష్యం

» ధర్మ్ సంవాద్‌లో తీర్మానం

మహాకుంభ్‌నగర్, జనవరి 26: భారత్‌ను సనాతన వైదిక దేశంగా మార్చడమే లక్ష్యమని పేర్కొంటూ ఆదివారం ఇక్కడ ముగిసిన ధర్మ్ సంవాద్ సమావేశంలో తీర్మానించారు. కుంభమేళా సందర్భంగా ఇక్కడ శ్రీపంచ దశాహ్నం జున అఖాడా ఆధ్వర్యంలో స్వామి నరేంద్ర నాథ్ సరస్వతి అధ్యక్షతన రెండు రోజుల పాటు ఈ సమావేశం జరిగింది. ఇస్లామిక్ జిహాద్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా హిందువులపై దాడులు జరుగుతుండడాన్ని ఈ సమావేశం ఖండించింది. వక్ఫ్ బోర్డును తక్షణమే రద్దు చేయాలని డిమాండు చేసింది. సనాతన ధర్మ పరిరక్షణకు పోరాటం చేస్తున్న ఘాజియాబాద్‌లోని దస్నాదేవి మందిర ప్రధాన అర్చకుడు, మహామండలేశ్వర్ యతి నరసింగానంద్ గిరికి మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించింది.

సైనిక విమానాల్లో గెంటేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

వారిని అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చెందిన 'ఎయిర్ ఆపరేషన్స్' విభాగానికి చెందిన నాలుగు విమానాల్లో పంపించింది. తాజాగా కొలంబియా దేశం కూడా.. తమ దేశానికి అమెరికా పంపిన రెండు సైనికవిమానాలను తిరగ్గొట్టింది. వలసదారులను అమెరికా ప్రభుత్వం నేరగాళ్లలా చూస్తోందంటూ కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో మండిపడ్డారు. తమ దేశానికి చెందిన వలసదారులను అమెరికా పౌరవిమానాల్లో పంపితే స్వాగతిస్తామని.. ట్రంప్ సర్కారు వారిని మర్యాదతో, గౌరవంతో చూడాలని ఆయన ట్వీట్ చేశారు. అటు బ్రెజిల్ విదేశాంగ శాఖ కూడా.. వలసదారుల చేతులు, కాళ్లకు గొలుసులు వేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. నిజానికి అమెరికా చరిత్రలో ఇలా మాస్ డీపోర్టేషన్‌కు మిలటరీ ఎయిర్‌క్రాఫ్ట్‌ను వాడడం ఇదే మొదటిసారి. గురువారం నుంచి ఆ ప్రక్రియను చేపట్టిన ఆ దేశ ఇమ్మిగ్రేషన్ విభాగం.. ఇప్పటికి ఆరు విమానాల్లో అక్రమవలసదారులను దేశం నుంచి గెంటేసింది. ఒక్కో సైనిక విమానంలో ఎనభై మంది చొప్పున.. రెండు విమానాల్లో 160 మందిని, వారి చేతులు, కాళ్లకు గొలుసులు కట్టి గ్వాటెమాలాకు విమానాల్లో పంపింది. మెక్సికో నుంచి వచ్చి అమెరికాలో తీవ్ర నేరాలకు పాల్పడినవారిని మరో నాలుగు సైనిక విమానాల్లో పంపాలని భావించింది. కానీ.. మెక్సికో అభ్యంతరం చెప్పడంతో వారిని మాత్రం ఇమ్మిగ్రేషన్ విభాగానికి చెందిన ఎయిర్ ఆపరేషన్స్ (ఏఐవో) విమానాల్లో డీపోర్ట్ చేసింది. కాగా, ట్రంప్ చేపట్టిన మాస్ డీపోర్టేషన్‌లో ఇంకా మనోళ్ల వంతు రాలేదుగానీ.. అమెరికా కస్టమ్స్ అండ్ ఇమ్మిగ్రేషన్ గణాంకాల ప్రకారం.. 2019 నుంచి 2024 వరకు 6,395 మంది భారతీయులను డిపోర్ట్ చేశారు.

ఒకే దేశం.. ఒకే కాలం

న్యూఢిల్లీ, జనవరి 26: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న నేపథ్యంలో సమయపాలనలో ప్రమాణాలను పాటించేలా చూడాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒకే దేశం-ఒకే కాలం అన్న భావనతో అన్ని అధికారిక, వాణిజ్య వ్యవహారాల్లో కేవలం భారతీయ ప్రామాణిక కాలం (ఇండియన్ స్టాండర్డ్ టైమ్-ఐ.ఎస్.టి.) మాత్రమే ఉపయోగించేలా సమగ్రమైన విధానాలను రూపొందించింది. లీగల్ మెట్రోలజీ (ఇండియన్ స్టాండర్డ్ టైం) రూల్స్-2024 పేరుతో జారీ అయిన ఈ నిబంధనలపై ఫిబ్రవరి 14లోగా అభిప్రాయాలు తెలపాలని కేంద్ర వినియోగ వ్యవహారాల శాఖ కోరింది. ఐఎస్‌టీ కాకుండా ఇతర కాలమానాలను ఉపయోగించడాన్ని నిషేధిస్తున్నట్టు అందులో స్పష్టం చేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఐ.ఎస్.టి. సమయాలను ప్రదర్శించడం తప్పనిసరి చేస్తున్నట్టు పేర్కొంది.

నావిక్‌కు సరికొత్త కిక్!

పౌర, సైనిక సేవలు మరింత మెరుగు.. 29న ఎన్‌వీఎస్-02 ఉపగ్రహ ప్రయోగం

» షార్‌లో వందో ప్రయోగానికి ఇస్రో సిద్ధం

» జీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా నావిక్..!

సూళ్లూరుపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇస్రో ఈ నెల 29న రెండో తరం నావిక్02 (ఎన్‌వీఎస్02) ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా ఈ శాటిలైట్‌ను జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి పంపనుంది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో ఇప్పటి వరకూ 99 ప్రయోగాలు చేపట్టిన ఇస్రోకిది వందో ప్రయోగం కావడంతో దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. భారత శాటిలైట్ నావిగేషన్ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ జీఎస్ఎల్వీ-ఎఫ్15/ఎన్‌వీఎస్-02 మిషన్ లక్ష్యం. రెండేళ్ల క్రితం ఎన్‌వీఎస్-01 ప్రయోగాన్ని చేపట్టగా.. మరింత మెరుగైన సేవలందించేలా ఎన్‌వీఎస్-02ను ప్రయోగిస్తున్నారు. అమెరికా జీపీఎస్ తరహాలోనే భారత్‌కు చెందిన నావిక్‌ను పౌర, సైనిక అవసరాల కోసం రూపొందించారు. నావిగేషన్, వ్యవసాయం, అత్యవసర సేవలు, విమానాల నిర్వహణ, మొబైల్ లొకేషన్ ఆధారిత సేవలను ఇది మెరుగుపరుస్తుంది. ఎన్‌వీఎస్-02 భారత్‌తో పాటు దాని పరిసర ప్రాంతాల్లో కచ్చితమైన నావిగేషన్ సమాచారాన్ని అందిస్తుంది. జీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా దీన్ని అందుబాటులోకి తీసుకురావడం భారత్ లక్ష్యం. ఇక జీఎస్ఎల్వీ-ఎఫ్15 అనేది జీఎస్ఎల్వీ సిరీస్‌లో 17వ ప్రయోగం. దేశీయంగా అభివృద్ధి చేసిన క్రయోజనిక్ ఇంజన్‌ను ఉపయోగించి చేపట్టే 8వ ప్రయోగం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నాలుగు గ్లోబల్ నావిగేషన్ వ్యవస్థలు మాత్రమే ఉన్నాయి. వాటిలో అమెరికాకు చెందిన జీపీఎస్, రష్యాకు చెందిన గ్లోనాస్, యూరోపియన్ యూనియన్‌కు చెందిన గలీలియో, చైనాకు చెందిన బీడౌ అనే నాలుగు మాత్రమే గ్లోబల్ నావిగేషన్ వ్యవస్థలు. భారత్‌కు చెందిన నావిక్, జపాన్ క్యూజెడ్ఎస్ఎస్ ప్రస్తుతానికి ప్రాంతీయ వ్యవస్థలే అయినప్పటికీ.. భవిష్యత్తులో గ్లోబల్ వ్యవస్థలుగా మారే అవకాశం ఉంది.



ప్రయోగ వేదికపైకి జీఎస్ఎల్వీ-ఎఫ్15

శ్రీహరికోటలో వందో రాకెట్ ప్రయోగానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఇక్కడి సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ నెల 29న ఉదయం 6:23 గంటలకు ప్రయోగించనున్న జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ఆదివారం రెండో ప్రయోగ వేదికపైకి చేరుకుంది. మూడు దశల అనుసంధాన పనులు పూర్తిచేసిన శాస్త్రవేత్తలు రాకెట్ శిఖరభాగాన ఉపగ్రహాన్ని అమర్చి.. రెండో ప్రయోగ వేదికపై తుది పరీక్షలు నిర్వహించారు. ప్రయోగానికి ముందు నిర్వహించే రిహార్సల్‌ను కూడా ఆదివారం పూర్తి చేశారు. శ్రీహరికోటలో ఇస్రోకు ఇది వందో ప్రయోగం కావడంతోపాటు ఈ ఏడాది షార్ నుంచి మొదటి ప్రయోగం కావడం విశేషం.

త్వరలోనే మూడో లాంచ్ ప్యాడ్ పనులు ప్రారంభం

శ్రీహరికోటలోని భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్‌లో మూడో లాంచ్ ప్యాడ్‌తో పాటు తమిళనాడులోని కులశేఖరపట్నంలో మరో లాంచ్ ప్యాడ్ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తెలిపారు. ఆదివారం ఆయన షార్‌లోని భాస్కర అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. పనులు ప్రారంభించాక నాలుగేళ్లలో నిర్మాణం పూర్తవుతుందని పేర్కొన్నారు. మూడో ప్రయోగ వేదిక నుంచి 20-25 టన్నుల బరువు గల రాకెట్ ప్రయోగాలు చేపట్టవచ్చన్నారు. రెండో లాంచ్ ప్యాడ్‌ను అనుసంధానం చేస్తూ అధునాతన వసతులతో మూడో ప్రయోగ వేదిక ఉంటుందన్నారు. ఈ ఏడాది మరిన్ని ప్రయోగాలు ఉంటాయన్నారు. గగనయాన్ ప్రయోగ ఏర్పాట్లు కూడా చకచకా జరుగుతున్నాయన్నారు. అంతరిక్షంలో నిర్మించబోయే భారత స్పేస్ స్టేషన్‌కు మరో రెండు డాకింగ్ ఉపగ్రహ ప్రయోగాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు.

లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ డైరెక్టర్‌గా మోహన్



తిరువనంతపురం, జనవరి 26: ప్రముఖ శాస్త్రవేత్త, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) ప్రస్తుత డైరెక్టర్ ఎం మోహన్‌కు ఇస్రో కీలక బాధ్యతలు అప్పగించింది. ఆయనను లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ) కొత్త డైరెక్టర్‌గా నియమించినట్టు ఇస్రో చైర్మన్ వి నారాయణన్ ప్రకటించారు. కేరళకు చెందిన మోహన్.. 2023 జూన్ నుంచి 2024 జూన్ వరకు హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ డైరెక్టర్‌గా పనిచేశారు. జీఎస్ఎల్వీ ప్రోగ్రామ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా, 2018లో జీఎస్ఎల్వీ-ఎఫ్08/జీశాట్-6ఏ, జీఎస్ఎల్వీ-ఎఫ్11/జీశాట్-7ఏ మిషన్లకు డైరెక్టర్‌గా వ్యవహరించారు.

సూడాన్‌లో ఆస్పత్రిపై డ్రోన్ దాడి

70 మంది దుర్మరణం

దుబాయ్, జనవరి 26: సూడాన్‌లోని ఎల్ ఫషర్ నగరంలో ఉన్న ఓ ఆస్పత్రిపై జరిగిన డ్రోన్ దాడిలో 70 మంది మృత్యువాత పడ్డారు. మరో 19 మంది గాయాలపాలయ్యారు. ఈ విషయాన్ని ఆదివారం డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో వెల్లడించారు. ఇటీవలి రోజుల్లో ఆఫ్రికా దేశమైన సుడాన్‌లో అంతర్యుద్ధం తీవ్ర రూపం దాల్చడంతో వరుస దాడి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నార్త్ డర్ఫర్ ప్రావిన్స్ రాజధాని నగరం ఎల్ ఫషర్‌లోని సౌదీ టీచింగ్ మ్యాటర్నల్ ఆస్పత్రిపై శుక్రవారం భారీ డ్రోన్ దాడి జరిగింది. ఇక్కడ కేవలం ఈ ఒక్క ఆస్పత్రిలోనే వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే దాడి సమయంలో ఆస్పత్రి రోగులతో కిక్కిరిసిపోయింది. అందువల్ల రోగులతోపాటు వారికి తోడుగా ఉన్న 70 మంది మృత్యువాత పడ్డారు. ఈ డ్రోన్ దాడి రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్(ఆర్ఎస్ఎఫ్)కు చెందిన తిరుగుబాటుదారుల పనేనని స్థానిక అధికారులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆర్ఎస్ఎఫ్ స్పందించలేదు. కాగా, 2023 ఏప్రిల్ నుంచి సుడాన్‌పై పట్టు సాధించడానికి సుడాన్ సైన్యం, ఆర్ఎస్ఎఫ్ బలగాలు పోరాడుతున్నాయి. ఈ ఘర్షణ మూలంగా 28వేల మందికిపైగా మరణించారు.

'ఉగ్ర' డ్రోన్ల ఉపద్రవం!

(మొదటి పేజీ తరువాయి)



ఆ స్థావరాలపై ఆ సంస్థ సభ్యులు దాడులు చేశారు. కానీ, కొద్దిరోజులుగా వారు వాటిని 'యాక్టివ్-అఫెన్సివ్' రీతిలో.. అంటే బాంబుదాడులకు వాడుతున్నారు. ఈ దాడులకు వారు వినియోగిస్తున్నవి కూడా మార్కెట్లో సులభంగా దొరికే, పౌర ప్రయోజనాలకు ఉపయోగించే క్వాడ్‌కాప్టర్లేనని ర్యాబెన్‌దాస్ వెల్లడించారు. అలాంటి దాడుల్లో అతిపెద్దది తాజాగా సూడాన్‌లో జరిగిన దాడి. ఇది ఇలాగే కొనసాగి.. టెర్రరిస్టులు తమ దాడులకు డ్రోన్లనే ప్రధాన ఆయుధాలుగా ఎంచుకుంటే పెనుప్రమాదమేనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఏడెనిమిదేళ్ల క్రితం దాకా డ్రోన్లను అంతా విచిత్రంగా చూసేవారు! కానీ.. పెళ్లిళ్లలో డ్రోన్ ఫొటోగ్రఫీ పాపులర్ అయ్యాక అవి అందరికీ చిరపరిచితమయ్యాయి. క్రమంగా వ్యవసాయం, మైనింగ్, టెలికం, విపత్తుల నిర్వహణ, జియో మ్యాపింగ్, అటవీ సంరక్షణ, వన్య ప్రాణుల పర్యవేక్షణ.. ఇలా చాలా రంగాలకు డ్రోన్లు విస్తరించాయి.

ఉగ్రవాదులు ఇష్టం వచ్చినట్లు వాడేస్తే

ఒకచోట నుంచి చేతిలో కంట్రోలర్ ద్వారా డ్రోన్‌ను కావాల్సిన చోటుకు పంపి కావాల్సిన పని చేయించుకునే వీలున్న నేపథ్యంలో.. ఆ డ్రోన్లను ఉగ్రవాదులు ఇష్టం వచ్చినట్టు వాడితే? 2008లో ముంబైలో పాక్‌కు చెందిన లష్కరే తాయిబా ఉగ్రవాది కసబ్, అతడి సహచరులు సృష్టించిన విధ్వంసం గుర్తుందా? అలాంటి రాక్షసమూక డ్రోన్లను వాడడం ప్రారంభిస్తే? ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించడానికి, ప్రాణనష్టం, ఆస్తి నష్టం కలిగించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఉగ్రవాదులు ఈ టెక్నాలజీని వాడుకుంటే? అనే ఆలోచనకే వణుకు పుడుతోంది. ఉగ్రవాదులే కాదు.. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తీవ్రవాదులు, వేర్పాటువాదులు వాటిని ఆయుధాలుగా మార్చుకుని సామాన్యప్రజలే లక్ష్యంగా విరుచుకుపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది మణిపూర్‌లో అల్లర్లు జరిగిన సమయంలో కూడా.. విద్రోహ శక్తులు డ్రోన్ బాంబులతో రెండు చోట్ల దాడులకు పాల్పడ్డాయి! ఆ దాడుల్లో ఇద్దరు మరణించారు.

అంతపెద్ద రష్యానే తట్టుకోలేక..

చూడ్డానికి చిన్నగా కనిపిస్తాయి గానీ.. పక్కాగా వాడితే డ్రోన్లు సృష్టించే విధ్వంసం అంతా ఇంతా కాదు! అగ్రరాజ్యమైన అంత పెద్ద రష్యాయే.. ఉక్రెయిన్ ప్రయోగిస్తున్న డ్రోన్ల దెబ్బకు తట్టుకోలేక సతమతమవుతోంది. ఉక్రెయిన్ డ్రోన్ల బారి నుంచి తన యుద్ధట్యాంకులను కాపాడుకోవడానికి ప్లైవుడ్ షీట్లు, రూఫ్ ప్యానెలింగ్ రేకులు, ఇనుపచువ్వలతో రక్షణ కవచాలు కట్టి వాటిని గుడిసెల్లా తయారుచేస్తోంది! తమపై దండయాత్రకు దిగిన రష్యాను రెండేళ్లకుపైగా ఉక్రెయిన్ నిలువరించగలుగుతోందంటే దానికి ప్రధాన కారణం ఆ దేశం వాడుతున్న డ్రోన్లే!! అయితే అలా దేశాల మధ్య గొడవల్లో.. సరిహద్దుల్లో డ్రోన్ల ముప్పును ఎదుర్కొనేందుకు సైన్యం వద్ద రకరకాల ప్రణాళికలు ఉంటాయి. మన సైన్యం కూడా సరిహద్దుల ఆవలి నుంచి వచ్చే డ్రోన్లను పసిగట్టి, వాటి పనిపట్టడానికి ఇప్పటికే పలు ఏర్పాట్లు చేసింది. అలా కాకుండా.. ఫొటోగ్రఫీకి వాడే డ్రోన్లకే బాంబులు అమర్చి దేశంలోని ప్రధాన నగరాలపై ఉగ్రవాదులు దాడులకు పాల్పడితే? ఆ రోగ్ డ్రోన్ల ముప్పును ఎదుర్కొనేందుకు మన పోలీసులు సన్నద్ధంగా ఉన్నారా అనేదే వెయ్యిరూకల ప్రశ్న!! -సెంట్రల్ డెస్క్



ఎట్ హోం కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్, హైకోర్టు సీజే సుజయ్‌పాల్ తదితరులు

రాజ్‌భవన్‌లో 'ఎట్‌హోం'

- హాజరైన సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు
- పాల్గొన్న బీజేపీ నేతలు.. దూరంగా బీఆర్ఎస్

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో నిర్వహించిన 'ఎట్‌హోం' కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, కన్హా శాంతివనం వ్యవస్థాపకులు కమలేశ్ డి పటేల్ తదితరులు హాజరయ్యారు. వీరితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు. గవర్నర్ ఇచ్చిన తేనీటి విందుకు బీఆర్ఎస్ పార్టీ దూరంగా ఉన్నది. ముఖ్యమంత్రి రేవంత్ రాజ్‌భవన్‌కు చేరుకున్న కొద్దిసేపటికే గవర్నర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఇటీవల ప్రకటించిన గవర్నర్ ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేశారు. 4 సంక్షేమ పథకాల అమలు నేపథ్యంలో ఆయా జిల్లాలకు వెళ్లడంతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ తదితరులు ఎట్‌హోంకు రాలేకపోయారు. కార్యక్రమానికి హాజరైన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సరదాగా మాట్లాడారు. అనంతరం.. ఎట్ హోం కార్యక్రమానికి బీఆర్ఎస్ హాజరు కాలేదని మంత్రి పొన్నంతో విలేకరులు చెప్పగా.. ఆయన స్పందిస్తూ రాజ్యాంగంపై బీఆర్ఎస్‌కు గౌరవం లేదని విమర్శించారు. ఎట్‌హోంలో నటి సంయుక్తమీనన్ పాల్గొనగా.. పలువురు నేతలు ఆమెతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు.

ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారు

జీవిత సాఫల్య పురస్కారం

డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి ఐఎఫ్ఎస్(పర్యావరణ పరిరక్షణ)

వ్యక్తిగత విభాగం

దుశర్ల సత్యనారాయణ, అరికపూడి రఘు, జీవన్‌జీ దీప్తి, పీబీ కృష్ణ భారతి, పాండు రంగారావు

సంస్థాగత విభాగం

ధ్రువాంశ్ ఆర్గనైజేషన్, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, ఆదిత్య మెహతా ఫౌండేషన్, సంస్కృతి ఫౌండేషన్

గవర్నర్.. సీఎం భేటీ..

తేనీటి విందు ముగిసిన తరువాత గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్ భేటీ అయ్యారు. దాదాపు అరగంటపాటు పలు అంశాలపై ముచ్చటించారు. దావోస్ ఆర్థిక సదస్సులో తెలంగాణకు వచ్చిన రూ.1,78,950 కోట్ల పెట్టుబడుల గురించి గవర్నర్‌కు సీఎం వివరించినట్టు సమాచారం. 4 పథకాలతోపాటు స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌పై చర్చించారు. ఎస్సీ వర్గీకరణ అంశం కూడా వారి మధ్య ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. మంత్రివర్గ విస్తరణపైనా మాట్లాడుకున్నట్టు సమాచారం.



బీజేపీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు

రాజ్యాంగాన్ని గౌరవించని కాంగ్రెస్

- నెహ్రూ, ఇందిరతోపాటు రాహుల్‌దీ అదే తంతు
- ఆరు గ్యారెంటీల పేరుతో మోసం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసిన కాంగ్రెస్‌కు బీజేపీని విమర్శించే హక్కు లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల పేరుతో మోసం చేస్తోందని మండిపడ్డారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటి ప్రధాని రాహుల్, ఇందిరతోపాటు ప్రస్తుతం రాహుల్ వరకూ అదే తీరని విమర్శించారు. జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని తొలగించి, భారత రాజ్యాంగాన్ని అమలు చేసిన చరిత్ర మోదీ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. తాము రాజ్యాంగానికి, అంబేడ్కర్ ఆలోచనా విధానాలకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని అడుగడుగునా అవమానించిందని ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. అంబేడ్కర్ పార్లమెంటుకు రాకుండా ఆయనను ఎన్నికల్లో ఓడించిందని తెలిపారు.



'ఏబీఎన్- ఆంధ్రజ్యోతి'లో

గణతంత్ర వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఏబీఎన్- ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ

హైదరాబాద్ సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఫిలింనగర్‌లోని ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఏబీఎన్- ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వేడుకల్లో ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి డైరెక్టర్ కోగంటి భానుప్రకాష్, ఏబీఎన్- ఆంధ్రజ్యోతి సంస్థలోని పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిపక్ష నేతకు ప్రజలు అక్కర్లేదా?

13 నెలల్లో ఒక్కరోజైనా అసెంబ్లీకి వచ్చారా?: ముఖ్యమంత్రి రేవంత్

మహబూబ్‌నగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "అసెంబ్లీలో ప్రజా సమస్యలను లేవనెత్తి.. వాటి పరిష్కారానికి మార్గం చూపాలి. కానీ, ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ 13 నెలలుగా ఒక్కనాడూ శాసనసభకు రాకుండా ప్రజలంటే అక్కర్లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు" అని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. అధికారంలో ఉంటే చెలాయిస్తాం.. దానిని అడ్డుపెట్టుకుని కొల్లగొట్టడతామంటే ఎలా? అని అన్నారు. గ్రామం సర్పంచి ఊర్లో ఉండకపోతేనే ఒప్పుకోరని, అలాంటిది ప్రధాన ప్రతిపక్ష నేతను ఏమనాలని ప్రశ్నించారు. ఆదివారం నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పథకాల అమలుకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన సోదరుడికి ఏపదవి ఉందంటూ కేటీఆర్ ప్రశ్నిస్తున్నారని, కానీ.. తాము వారిలాగా ఇంటిల్లిపాదీ పదవులు తీసుకోలేదని ఎద్దేవా చేశారు. తన సోదరుడు పదవులు లేకుండా ప్రజాసేవ చేస్తుంటే కళ్లలో నిప్పులు ఎందుకు పోసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను రాష్ట్రంలో తిరుగుతున్నప్పుడు నియోజకవర్గంలో తన సోదరుడు తిరుపతిరెడ్డి అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ఈ 13 నెలల్లో గ్రామాలకు అధికారులను, ఎమ్మెల్యేలను, చివరకు సీఎంను దగ్గర చేశామని చెప్పారు. గతంలో మాదిరిగా పని కావాలంటే ఫామ్‌హౌస్‌కు వెళ్లే అలవాటు నుంచి ప్రజల వద్దకే అందరూ వెళ్లేలా విధానాన్ని మార్చామన్నారు. ఫామ్‌హౌస్‌లలో ఉండి పాలన చేస్తామంటే ఇకపై కుదరదని హెచ్చరించారు. మేధావులుగా చెప్పుకొనే కేసీఆర్, కేటీఆర్‌లకు పదేళ్లుగా పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలనే కనీస జ్ఞానం లేకపోవడం విచారకరమన్నారు. భూమికి, విత్తనానికి ఎంత బలమైన బంధం ఉందో.. రైతుకు, కాంగ్రెస్‌కు మధ్య అంతే బలమైన బంధం ఉందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం 25.50 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. రైతు భరోసా పథకం కింద గతంలో ఉన్న రూ.10 వేలను రూ.12 వేలకు పెంచామని, ఆదివారం అర్ధరాత్రి నుంచే టకీ టకీమని రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పారు. భూమిలేని పేదలకు కూడా మొదటి విడతగా జమ అవుతాయన్నారు. మార్చి 31 వరకు పథకాల అమలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, చివరి అర్హుడి వరకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. రేషన్ కార్డులు లేని వారందరికీ కార్డులు ఇస్తామని, బతకడానికి వలస పోయిన వారు కూడా వచ్చి కార్డులు తీసుకుంటే.. సన్నబియ్యం పంపిణీ ఇస్తామని చెప్పారు.

కొడంగల్ అభివృద్ధిపై కక్ష ఎందుకు?

దశాబ్దాలుగా కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని సీఎం రేవంత్ అన్నారు. తమకు ఇప్పుడు రాష్ట్రానికే ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చినందున.. ఇక్కడ 40 వేల మందికి ఉపాధి దొరుకుతుందనే ఉద్దేశంతో 1300 ఎకరాల భూమి సేకరించాలనుకున్నామని తెలిపారు. కానీ, భూసేకరణకు వచ్చిన అధికారులపై దాడులు చేసి, రాళ్లతో కొట్టి, హత్య చేసేందుకు ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్ ప్రాంత ప్రజలు ఇంకా పేదరికంలోనే ఉండాలని కోరుకుంటున్నారా? అని నిలదీశారు. పదేళ్లలో పాలమూరు-రంగారెడ్డి పూర్తిచేయలేదని, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ఊసే ఎత్తలేదని.. అప్పుడు ఎవరు అడ్డుపడ్డారని ప్రశ్నించారు. ఇప్పుడు తాము ఆ పథకాలను పూర్తి చేయడానికి బాధ్యత తీసుకుంటుంటే.. కాళ్లలో కట్టెలు పెడుతున్నారని ఆరోపించారు. అందరి గొంతు, మాట, బాట ఒక్కటే అయితే ఎవరు అడ్డుపడినా.. తొక్కుకుంటూ వెళ్లి.. అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. దావోస్‌లో నాలుగు రోజులు పర్యటించి.. అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువగా రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చానని ఆయన చెప్పారు.

అమరవీరులకు సీఎం నివాళి

అల్వాల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా (టాసా) ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని ఆర్మీ పరేడ్ గ్రౌండ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అక్కడ ఉండే రికార్డులో తన సందేశాన్ని రాశారు. ఈ సందర్భంగా త్రివిధ దళాలకు చెందిన అధికారులు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, మాజీ సైనికులు, త్రివిధ దళాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పదేళ్ల తర్వాత పేదల కళ్లలో వెలుగులు

- కొత్తగా మరో 4 పథకాల ప్రారంభం
- పేదలను సంక్షేమంవైపు తీసుకెళ్తున్నాం
- గణతంత్ర దినోత్సవ సందేశంలో సీఎం

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదేళ్ల తర్వాత పేదల కళ్లల్లో వెలుగులు చూస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలను ఒక ఇంటివాళ్లను చేయాలన్న లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని చుట్టుముట్టిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఓ వీడియో సందేశాన్ని సీఎం రేవంత్ విడుదల చేశారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం దిశగా అడుగులు వేస్తోందన్నారు. గణతంత్ర దినోత్సవం నాడు నాలుగు కొత్త సంక్షేమ పథకాలు ప్రారంభిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నానని చెప్పారు. రేవంత్ అన్నగా ప్రజల ఆశీర్వాదం తీసుకొని తెలంగాణ ముఖ్యమంత్రిగా 13 నెలలు పూర్తి చేసుకున్న సందర్భంలో ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను ఒక్కక్కొటిగా అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల జారీని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులు జారీ చేయలేదని, వేలాది మంది పేదలకు ఊరట కల్పిస్తూ కొత్తవి మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రైతు కూలీలకు ఏటా రూ.12వేలు అందజేయనున్నట్లు తెలిపారు. రైతు భరోసా కింద ఆదివారం నుంచే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని వేస్తున్నామన్నారు. దళితులు, గిరిజనులు ఆదివాసీలు, బలహీన వర్గాల ప్రజలందరినీ సంక్షేమ పథం వైపు తీసుకువెళ్తున్నామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల కు ఉచిత ప్రయాణం, 200యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500కే సిలిండర్‌ను అందజేస్తూ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నామన్నారు.

ఇందిరమ్మ అంటేనే రోటీ.. కపడా.. మకాన్!

- ఏ గ్రామం వెళ్లినా ఆమె ఇచ్చిన ఇల్లు.. ఇంటి జాగా కనిపిస్తుంది
- పాకిస్థాన్ సైన్యాన్ని తరిమికొట్టి బంగ్లాదేశ్‌కు స్వాతంత్రం తెచ్చిన ఘనత ఆమెదే
- ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసు
- బండి సంజయ్‌కి తెలియకపోవడం దురదృష్టకరం
- వాజ్‌పేయి, ఆడ్వాణీల గురించి తప్పుగా మాట్లాడామా?
- కాంగ్రెస్‌కు క్షమాపణ చెప్పి తప్పు సరిదిద్దుకో
- బండి సంజయ్‌కి తూర్పు జగ్గారెడ్డి హితవు



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ అంటేనే ఎవరికైనా గుర్తుకు వచ్చేది.. రోటీ, కపడా, మకాన్ అని టీపీసీసీ అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. దేశంలో.. రాష్ట్రంలో ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా ఆమె ఇచ్చిన ఇల్లు, ఇంటి జాగా ఇప్పటికీ కనిపిస్తాయని చెప్పారు. మనం పుట్టకముందే ఆమె ప్రతి ఊర్లోనూ పేదలకు ఇల్లు, ఇంటి జాగా ఇచ్చారని, ఆమె చరిత్ర ఏం తెలుసునని బండి సంజయ్ మాట్లాడుతున్నారని నిలదీశారు. "నీ పార్లమెంటు నియోజకవర్గంలో ఏ ఊరికైనా వెళదాం. అక్కడ ఆమె ఇచ్చిన ఇల్లు ఉంటుంది. వచ్చే ధైర్యం నీకుందా?" అని బండి సంజయ్‌కి సవాల్ విసిరారు. ఇందిరమ్మకు, కాంగ్రెస్ పార్టీకి క్షమాపణలు చెప్పి చేసిన తప్పును సరిదిద్దుకోవాలని హితవు పలికారు. గాంధీభవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80ఏళ్ల వయసున్న ఏ అవ్వా, తాతను అడిగినా ఇందిరాగాంధీ చరిత్ర ఏంటన్నది చెబుతారన్నారు. ఆమె ఆరేళ్ల పాటు జైలు జీవితం గడిపారని తెలిపారు. రాజీవ్ గాంధీ.. ఆమె జైల్లో ఉన్నప్పుడే పుట్టారన్నారు. పాకిస్థాన్ సైన్యాన్ని తరిమికొట్టి బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్య ఇచ్చిన చరిత్ర ఇందిరమ్మదని చెప్పారు. ఈ చరిత్ర తెలియని బండి సంజయ్.. ఇందిరమ్మను గురించి మాట్లాడి నవ్వుల పాలు కావద్దన్నారు. తాము ఎప్పుడైనా వాజ్‌పేయి, ఆడ్వాణీల గురించి తప్పుగా మాట్లాడామా? అంటూ నిలదీశారు. "ఇందిరాగాంధీ.. బండి సంజయ్‌కైనా, నాకైనా జేజమ్మ. ఇందిరమ్మ గురించి సంజయ్ మాట్లాడటం.. జేజమ్మకు దగ్గు నేర్పినట్లుగా ఉంది" అని ఎద్దేవా చేశారు.

బండి సంజయ్ అమ్మ కూడా ఇందిరమ్మ అభిమానేనేమో!

"చిన్నతనంలో నేను ఆర్ఎస్ఎస్ శాఖకు వెళ్లే వాడిని. అయితే మా అమ్మ, నాన్న ఇందిరమ్మకు, కాంగ్రెస్‌కు అభిమానులు. నాకు పదేళ్ల వయసున్నప్పుడు ఇందిర సంగారెడ్డికి వచ్చారు. ఆమె వచ్చిందని తెలియగానే తెల్లవారుజామున 3 గంటల సమయంలో మా అమ్మ నన్ను సంకలో వేసుకుని పరిగెత్తుకుంటూ వెళ్లింది. ఇంకా నాకు గుర్తుంది" అంటూ వివరించారు. ఇందిరమ్మ అంటే బండి సంజయ్ తల్లికీ అభిమానం ఉండి ఉండొచ్చునన్నారు. మోదీ, అమిత్‌షాల కుటుంబ సభ్యులు కూడా ఆనాడు ఇందిరమ్మ అభిమానులే అయుండొచ్చునన్నారు.

రాజ్యాంగ సంరక్షణ ప్రతి పౌరుని బాధ్యత

- లోక్ అదాలత్ వినియోగంలో దేశంలోనే ఫస్ట్
- గణతంత్ర వేడుకల్లో జస్టిస్ సుజాయ్‌పాల్ వెల్లడి

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్ అన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ఇండియన్ నేషనల్ ఆర్మీ అధికారులపై పెట్టిన రాజద్రోహం కేసులను ఎలాంటి కాగితం ముక్కను చూడకుండానే రెండురోజులపాటు వాదనలు వినిపించిన స్వాతంత్ర్య సమరయోధుడు, న్యాయవాది భూలాబాయి సేవలను గుర్తుచేస్తూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఆదివారం హైకోర్టు ప్రాంగణంలో జరిగిన గణతంత్ర ఉత్సవాల్లో జాతీయ జెండాను ఎగరవేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించడం ద్వారా తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని వెల్లడించారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ప్రసంగించారు.

కేంద్ర పథకాలకు బీజేపీ నేతల పేర్లెలా పెడతారు?

- బండి సంజయ్ సమాధానం చెప్పాలి: మల్లు రవి

న్యూఢిల్లీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కేంద్రం కేటాయించిన ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడితే వాటిని రద్దు చేస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల కన్వీనర్ మల్లు రవి డిమాండ్ చేశారు. తెలంగాణ సర్కారును ప్రశ్నించే ముందు కేంద్ర ప్రభుత్వ పథకాలకు బీజేపీ నేతల పేర్లెలా పెడుతున్నారో సంజయ్ చెప్పాలన్నారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సమాఖ్య స్ఫూర్తిని బీజేపీ నేతలు గౌరవించడం లేదని మండిపడ్డారు. కేంద్ర మంత్రి హోదాలో ఉండి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలే దీనికి నిదర్శనమని ఆయన అన్నారు.

సమ్మిళిత అభివృద్ధి దిశగా పయనం

- ప్రజల ఆకాంక్షల్ని నెరవేరుస్తున్న ప్రభుత్వం
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వ్యాఖ్యలను ఆదర్శంగా తీసుకుని.. తెలంగాణను సమ్మిళిత అభివృద్ధి దిశగా ప్రభుత్వం నడిపిస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబరులో ప్రజలు ఇచ్చిన తీర్పుతో.. ప్రతి పౌరుడి ఆకాంక్షను సాకారం చేసే, సమ్మిళిత పాలనను అందించే ప్రభుత్వం ఏర్పాటైందని అన్నారు. గణతంత్ర దినోత్సవంలో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. ఎక్కడైతే మనస్సు నిర్భయంగా ఉంటుందో, ఎక్కడైతే తల ఎత్తుకుని ఉండగలమో, ఎక్కడైతే జ్ఞానాన్ని సముపార్జించగలమో, ఎక్కడైతే ప్రపంచం భాగాలుగా విడిపోదో.. అని గీతాంజలిలో ఠాగూర్ చెప్పిన విధంగా సమైక్య, సమ్మిళిత, ప్రగతిశీల దృక్పథాన్ని మనం స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సంక్షేమం, సమానత్వ విలువలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం.. తెలంగాణ సంస్కృతికి పెద్దపీట వేస్తోందన్నారు. అందులో భాగంగానే అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించిందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నుముకగా నిలుస్తోందని, గత ఏడాది వర్షాకాలంలో దేశంలోనే అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తన మాటకు కట్టుబడి రుణమాఫీ చేసిందని, ఇది రైతులకు తెలంగాణ ప్రభుత్వం అందించిన తిరుగులేని సాయమని తెలిపారు. భూమి లేని వ్యవసాయ కూలీల కోసం ఆత్మీయ భరోసా పథకాన్ని ప్రభుత్వం అమలు చేయబోతుందని, దీని కింద ఏటా రూ.12వేల ఆర్థిక సాయం అందించనుందని వివరించారు. మహిళా సాధికారతలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి తీసుకురాగా, ఇప్పటి వరకు మహిళలు రూ.4,501కోట్లను ఆదా చేసుకున్నారని వెల్లడించారు. గృహజ్యోతిలో భాగంగా 50లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నట్లు చెప్పారు. యువత సాధికారతే లక్ష్యంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. క్రీడలకు తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నాలుగున్నర లక్షల ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. దావోస్ సదస్సులో రూ.1,78,950 కోట్ల మేర ఒప్పందాలు జరిగాయ ని, తద్వారా ఐటీ, పునరుత్పాదక ఇంధన, ఔషధాల రంగాల్లో కొత్త పరిశ్రమలు రానున్నాయని వెల్లడించారు. ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వేలు, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో కనెక్టివిటీ, మొబిలిటీ పెరుగుతుందని, ఇది ఆర్థిక, సామాజిక ఏకీకరణకు మద్దతు ఇస్తుందని గవర్నర్ పేర్కొన్నారు.



సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఎగురవేసి అనంతరం వందనం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్, తదితరులు

వర్సిటీలపై కేంద్రం పెత్తనం సహించం

(మొదటిపేజీ తరువాయి)

తమిళనాడు, కేరళ, ఏపీ సీఎంలతో మాట్లాడుతానన్నారు. కేంద్రం చేస్తున్న మార్పులను మేధావులు, విద్యావేత్తలు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. త్వరలో అన్ని విశ్వవిద్యాలయాల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి విధివిధానాలు రూపొందిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సీనియర్ ప్రొఫెసర్ల సేవలను ఉపయోగించుకునేలా వారి పదవీ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. వర్సిటీలకు వీసీలుగా తెలంగాణ సమాజంపై అవగాహన ఉన్నవారిని, సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని నియమించామన్నారు. అంబేడ్కర్ విశ్వవిద్యాలయం విద్యార్థులకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తామని ప్రకటించారు. లక్ష మంది దళిత, పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమం అమలు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. రంగుల గోడలు, అద్దాల మేడలు అభివృద్ధి కాదని, అంబేడ్కర్ చెప్పిన విధంగా సామాజిక స్ఫూర్తితో ప్రభుత్వ పథకాలు, సేవలను చిట్టచివరి వ్యక్తికి అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో మరో పదేళ్ల కాంగ్రె స్ ప్రభుత్వమే ఉంటుందని, ప్రజలు తమకు అవకాశమిస్తారన్నారు. అన్ని వర్సిటీల వీసీలు పదేళ్ల ప్రణాళికలతో ముందుకు రావాల్సిందిగా కోరినట్లు తెలిపారు. 20ఏళ్లగా ప్రభుత్వ విద్యాసంస్థలు నిర్లక్ష్యానికి గురయ్యాయని పేర్కొన్నారు.

పద్మ అవార్డుల్లో వివక్ష..

పద్మ అవార్డుల విషయంలో తెలంగాణపై కేంద్రం వివక్ష చూపిందని సీఎం రేవంత్ ఆరోపించారు. పక్క రాష్ట్రం ఏపీకి ఐదు అవార్డులు ఇచ్చినప్పుడు.. తెలంగాణకు నాలుగైనా ఇస్తే బాగుండేదన్నారు. ఈ వివక్షపై త్వరలో ప్రధాన మంత్రికి లేఖ రాస్తామన్నారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ఇవ్వడాన్ని తమ ప్రభుత్వం స్వాగతిస్తోందని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్నత విద్య వ్యాప్తికి తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, సీఎస్ శాంతికుమారి, ఉన్నత విద్య కార్యదర్శి యోగితా రాణా, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మ అవార్డుల్లో అన్యాయం

» తెలంగాణ సిఫారసులను కేంద్రం పట్టించుకోలేదు: భట్టి

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని.. తెలంగాణ ఏర్పాటు, అస్తిత్వం, ఆత్మగౌరవం ప్రశ్నార్థకంగా మారిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కేంద్రం సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించిందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన, సమాజం కోసం, కళల కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వారి పేర్లను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా సిఫారసు చేస్తే.. కేంద్రం నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరికి కూడా అవార్డు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేసిన గద్దర్, అందెశ్రీ, గోరేటి వెంకన్న, జయధీర్ తిరుమల రావు పేర్లను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిందని తెలిపారు. వీరిలో ఒక్కరికి కూడా అర్హత లేదా అని ఆయన ప్రశ్నించారు.

గతంలో ఉన్నత వర్గాలకే పద్మ అవార్డులు

» మోదీ వచ్చాకే సామాన్యులకు వస్తున్నాయి: మంద కృష్ణ

హైదరాబాద్, బర్కత్‌పుర, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో కేంద్రం ప్రకటించే పద్మ అవార్డులు ఉన్నత వర్గాలకే వచ్చేవని, ప్రధాని మోదీ వచ్చాకే ఈ పదేళ్లలో ఎందరో పేదలకు ఆయా రంగాల్లో వారి కృషికి గుర్తింపుగా పద్మ అవార్డులు వస్తున్నాయని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఎట్‌హోంకు హాజరై వెళ్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. సామాన్యులు, పేదవారిపై ప్రధాని మోదీకి ప్రత్యేక అభిమానం ఉందన్నారు. తనలాంటి సామాన్యులకు పద్మశ్రీ రావడం సంతోషంగా ఉందని తెలిపారు. వర్గీకరణ ఎంత అవసరమో తెలియజేసేందుకు హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించిన సభకు మోదీ వచ్చి తమ సమస్యను ప్రత్యక్షంగా చూశారన్నారు. వర్గీకరణపై సుప్రీం తీర్పు వచ్చేందుకు కృషి చేశారని తెలిపారు. కాగా, ఫిబ్రవరి 7న నిర్వహించే 'లక్ష డప్పులు వేల గొంతుల' కార్యక్రమానికి తెలంగాణ ఎరుకల ఆదివాసీ సంఘం ఆదివారం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడారు. వర్గీకరణకు హామీఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు స్పందించడంలేదన్నారు. కాంగ్రెస్‌లో మాలల పలుకుబడి అధికంగా ఉందన్నారు.

పురపాలికల్లో నేటి నుంచి 'ప్రత్యేక' పాలన

» కరీంనగర్‌లో 28 నుంచి.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పురపాలికల్లోని పాలకవర్గాల పదవీకాలం ఆదివారంతో పూర్తయిన నేపథ్యంలో సోమవారం నుంచి ప్రత్యేక అధికారులు పాలన సాగించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 120 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్లకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో ఈ నెల 28న పాలకవర్గం కాలపరిమితి ముగియనుండడంతో.. అదే రోజు నుంచి ప్రత్యేకాధికారి పాలన ప్రారంభం కానున్నట్లు అందులో సూచించారు.

ఒక గ్రామంలో ఓట్లేస్తేనే గెలిచారా?

» భట్టి విక్రమార్కను ప్రశ్నించిన కేటీఆర్

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 'ఎన్నికలప్పుడు రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ పథకాలు అందజేస్తామని అబద్ధపు హామీలను ఊదరగొట్టి.. ఏడాది తర్వాత మండలంలో ఒక గ్రామానికి పథకాలంటూ ప్రజలకు వెన్నుపోటు పొడుస్తారా?' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మండలానికి ఒక గ్రామం యూనిట్‌గా చేసుకొని రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి ప్రకటించడం తగదని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి ఒక గ్రామంలోనే మీరు ఎన్నికల ప్రచారం చేశారా? మీ గ్యారెంటీ కార్డులిచ్చారా? మండలానికి ఒక గ్రామంలో ఓట్లేస్తేనే అధికారంలోకి వచ్చారా? అని భట్టిని నిలదీశారు. పథకాలు రాని గ్రామాల్లో రేపటి నుంచి ప్రజా రణరంగమేననిహెచ్చరించారు. కాగా, మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడం ఆ సామాజిక వర్గానికి దక్కిన గౌరవమని కేటీఆర్ అన్నారు.

రేవంత్‌రెడ్డికి మెదడు ఖరాబైంది: హరీశ్‌రావు

గజ్వేల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మెదడు ఖరాబ్ అయింది. కాళేశ్వరంలో ఒక్క పిల్లర్ కుంగిపోతే కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని అంటుండ'ని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పాలకవర్గ అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాళేశ్వరంలో భాగమైన రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ జలాశయాలను, కాలువలను చూసి, రేవంత్ రెడ్డి తన మెదడును సరి చేసుకోవాలని సూచించారు. మహబూబ్‌నగర్‌లో రైతు రుణమాఫీ పేరిట ఇచ్చిన రూ.2,550 కోట్ల చెక్కు డమ్మీ చెక్ అని, ఇప్పటికీ ఆ చెక్కు ఫైనాన్స్‌లో క్లియర్ కాలేదని విమర్శించారు. మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టులపై జిల్లాలోని కురుమూర్తి దేవాలయం వద్దకు రేవంత్‌రెడ్డి రావాలని సవాల్ విసిరారు.

అన్ని రంగాల్లో దిగజారిపోతున్న దేశం: కూనంనేని

హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : పాలకుల విధానాల కారణంగా దేశం అన్ని రంగాల్లో దిగజారిపోతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. 76వ గణతంత్ర దిన వేడుకలను పురస్కరించుకుని ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూం భవన్‌లో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అడవుల్లో ఉండి ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న మావోయిస్టులు ఈ దేశ ప్రజలు కాదా, ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించినంత మాత్రాన వారిని కాల్చి చంపుతారా, పాలకులకు ఆ అధికారం ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు.

నిధులివ్వబోమనడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం

» రాష్ట్రాల హక్కులను హరించేలా బండి వ్యాఖ్యలు : కవిత

అఫ్జల్‌గంజ్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పేరు పెడితే తెలంగాణలో ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వబోమని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటించడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇది రాష్ట్రాల హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం సెమినార్‌లో కవిత మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాకెట్ డైరీలా రాజ్యాంగాన్ని పట్టుకొని దేశమంతా తిరుగుతూ దానిని కాపాడాలని చెబుతుంటారని, కానీ తెలంగాణలో హననమవుతున్న రాజ్యాంగ స్ఫూర్తి పట్ల ఆయన మాట్లాడడం లేదన్నారు.

'భరతమాత మహా హారతి'లో అపశ్రుతి


అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న బోటు

హుస్సేన్‌సాగర్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్ సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేళ.. భరతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద నిర్వహించిన 'భరతమాత మహా హారతి' కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. కార్యక్రమం పూర్తయిన తరువాత హుస్సేన్‌సాగర్‌లోకి రెండు బోట్లలో వెళ్లి.. బాణసంచా కాలుస్తుండగా అగ్నిప్రమాదం సంభవించింది. నిప్పురవ్వలు తిరిగి అవే బోట్లలో ఉంచిన బాణసంచాపై పడటంతో బోట్లకు మంటలు వ్యాపించాయి. దీంతో రెండు బోట్లు దగ్ధం కాగా.. వాటిలో వెళ్లిన ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరికి తీవ్రగాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. ఆదివారం రాత్రి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అయితే కార్యక్రమం పూర్తయ్యాక పీపుల్స్ ప్లాజా సమీపంలో వేదిక వెనుక భాగంలో బాణసంచా కాల్చేందుకు పర్యాటక శాఖకు చెందిన రెండు బోట్లలో సామగ్రిని హుస్సేన్‌సాగర్ మధ్యలోకి తీసుకెళ్లారు. బోటులో డ్రైవర్, వాల్డర్, సిబ్బంది, బాణసంచా కాల్చే ఐదుగురు నిపుణులతోపాటు 15 మంది బీజేపీ కార్యకర్తలు ఉన్నారు. అయితే బాణసంచా కాల్చే క్రమంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో బోట్లలో ఉన్న కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు నీళ్లలోకి దూకారు. రంగంలోకి దిగిన అధికారులు.. జెట్టీలో మంటలను అదుపులోకి తెచ్చే పరికరాలు లేకపోవడంతో వారిని స్పీడ్‌బోట్‌లో బయటకు తీసుకువచ్చారు. అయితే ప్రమాదంలో బాణసంచా కాల్చే నిపుణుడు గణపతి (22)కి తీవ్ర గాయాలయ్యాయి. ఇతనితోపాటు ప్రమాదంలో గాయపడిన చింతల కృష్ణ(47), కరీంనగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి సాయిచంద్‌ను సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గణపతి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, సీతాఫల్‌మండికి చెందిన బీజేపీ కార్యకర్తలు సునీల్, ప్రణీత్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, కాలిపోయిన లూంబిని బోట్ విలువ రూ.12 లక్షలు ఉంటుందని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

తప్పుడు పత్రాలిస్తే పథకాలు రద్దు

అనర్హులను ఎంపిక చేస్తే అధికారులదే బాధ్యత.. అర్హులనే ఎంపిక చేయాలి: స్పష్టం చేసిన మంత్రులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు అర్హులనే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని పలువురు రాష్ట్ర మంత్రు లు సూచించారు. ఎక్కడైనా అనర్హులను పథకాలకు ఎంపిక చేస్తే అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తప్పుడు పత్రాలు ఇచ్చి లబ్ధిదారులుగా ఎంపికైన వారి పథకాలను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులకు అర్హత పొందిన లబ్ధిదారులకు పత్రాలను అందజేసిన కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి తట్టుకోలేకనే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం చిన్నగోపతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పథకాలపై కొన్ని పార్టీలు చేసే దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దన్నారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజల ముంగిట్లోకి తెచ్చిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలోని కేటీ అన్నారంలో, ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలం మల్లేపల్లిలో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అనర్హులు ఎవరైనా లబ్ధి పొందితే స్వచ్ఛందంగా వాటిని స్వచ్ఛందంగా తిరిగి ఇచ్చేయాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని, అనర్హులను గుర్తిస్తే అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనర్హులకు పొరపాటున పథకాలు అందితే మధ్యలోనే నిలిపివేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తిలో ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. భువనగిరి జిల్లా నాతాళ్లగూడెం గ్రామంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ఓడిపోయామన్న బాధతోనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఖమ్మంజిల్లా ముదిగొండ మండలం ఖానాపురంలో మంత్రి కోమటరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆసరాగా ఉండేందుకు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నట్లు పేర్కొన్నారు. ములుగు జిల్లాలో మంత్రి సీతక్క, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం వెంకట్రావుపెల్లిలో మంత్రి సీతక్క, నాగర్‌కర్నూల్ జిల్లాపసుపులలో మంత్రి జూపల్లి పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా చిన్నగోపతిలో లబ్ధిదారుడికి పత్రం అందిస్తున్న భట్టి, సూర్యాపేట జిల్లాలో అర్హత పత్రం అందజేస్తున్న తుమ్మల

కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా అవసరమా?

అసెంబ్లీ ఎన్నికలు జరిగి 14 నెలలు గడుస్తున్నా ప్రతిపక్ష నేత కేసీఆర్ ముఖం చాటేస్తూ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యాడని, అలాంటి వారికి ప్రతిపక్ష హోదా అవసరమా అని ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా అప్పారెడ్డిగూడలో ఆయన మాట్లాడుతూ తండ్రేమో ఫామ్‌హౌస్‌కు పరిమితమవుతాడు.. కొడుకు, అల్లుడేమో రోడ్ల మీదకొచ్చి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తారని మండిపడ్డారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని మహిళ కన్నీరు



యాదాద్రి జిల్లా గుండాల మండలం బూర్జుబావి గ్రామంలో ఆదివారం అర్హులకు పథకాల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన తోటకూరి బొజ్జమ్మ ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరు కాలేదు. దాంతో బొజ్జమ్మ విలపిస్తూ గ్రామంలో ఇల్లు ఉన్న వారికి ఇల్లు మంజూరైందని, తన ఇల్లు పూర్తిగా కూలిపోయిన్నప్పటికీ రాలేదని ఇదెక్కడి న్యాయమని కన్నీరు పెట్టుకుంది.

ఇందిరమ్మ పేరు పెడితే డబ్బులు ఎలా ఇవ్వరో చూస్తాం

ఇందిరమ్మ ఇళ్లకు నీ ఇంట్లో డబ్బులిస్తున్నావా?

బండి సంజయ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్



హైదరాబాద్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): " బలహీన వర్గాల ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడితే డబ్బులు ఇవ్వరా? ఈ ఇళ్లకు ఏమైనా నీ ఇంట్లో డబ్బులు ఇస్తున్నవా?" అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. బలహీన వర్గాల ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడితే డబ్బులు ఎలా ఇవ్వరో తామూ చూస్తామన్నారు. గృహజ్యోతి, అంత్యోదయ పథకాలకు దీన్ దయాళ్ పేరు ఎలా పెట్టారని నిలదీశారు. ఆయన ఏమైనా దేశం కోసం ప్రాణత్యాగం చేశారా అన్నారు. గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పది నెలల కాలంలో తెలంగాణ నుంచి కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రూపంలో రూ. 37 వేల కోట్లు వసూలు చేసిందని, అందులో తెలంగాణకు ఇచ్చింది ఎంతని ప్రశ్నించారు. దివంగత మాజీ ప్రధాని వాజపేయి.. ఇందిరమ్మను కాళీమాతతో పోల్చారని గుర్తు చేశారు. ఆమె పట్ల అవహేళనగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుండి రాష్ట్రానికి ఒక్క రూపాయన్నా అదనంగా తీసుకువచ్చారా అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను కేటీఆర్ జీర్ణించుకోలేక పోతున్నారని, కడుపు మంట తగ్గించుకునేందుకు ఆయనకు ఈనో ప్యాకెట్లు పంపిస్తానని ఎద్దేవా చేశారు.

ఇండోర్‌కు నేడు సీఎం రేవంత్‌రెడ్డి

ఇండోర్‌లో కాంగ్రెస్ సోమవారం నిర్వహిస్తున్న సంవిధాన్ బచావ్ ర్యాలీలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లనున్నారు. సీఎంతో పాటుగా టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పలువురు మంత్రులతో పాటు ఎనిమిదిమంది ఈ ర్యాలీలో పాలుపంచుకోనున్నారు. వీరంతా సోమవారం ఉదయం బయలుదేరి వెళ్లి.. సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు

పల్లా రాజేశ్వర్‌పైకి రాళ్లు, కోడిగుడ్లు

» జనగామ జిల్లా ఎర్రకుంట తండాలో ఉద్రిక్తత

» 'పల్లా.. గో బ్యాక్' అంటూ కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలు.. వాగ్వాదం


పల్లాను బలవంతంగా కారు ఎక్కిస్తున్న పోలీసులు

జనగామ/హైదరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నాలుగు పథకాల ప్రారంభోత్సవం సందర్భంగా జనగామ జిల్లా ఎర్రకుంట తండాలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై రాళ్లు, కోడిగుడ్లు విసిరారు. ఎర్రకుంట తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరు కావాల్సి ఉండగా, అధికారులు ఏర్పాట్లు చేశారు. మంత్రి పర్యటన నేపథ్యంలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మరోవైపు, ఎమ్మెల్యే హోదాలో బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు సభా వేదికకు వచ్చారు. అక్కడే ఉన్న డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులను విడుదల చేయాలని కోరారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ శ్రేణులు పల్లా రాజేశ్వర్‌ను చూసి 'పల్లా.. గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. పరస్పరం కుర్చీలను విసిరేసుకున్నారు. పోలీసులు లాఠీచార్జీ చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో, మంత్రి పొంగులేటి ఎర్రకుంటతండా పర్యటనను రద్దు చేసుకున్నారు. ఇదే విషయాన్ని స్టేజీ మీద అధికారులు ప్రకటించారు. అప్పుడే పల్లా మైక్ తీసుకొని మాట్లాడబోతుండగా కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేస్తూ ఆయనపైకి రాళ్లు, కోడిగుడ్లు విసిరారు. పోలీసులు పల్లాను దూరంగా తీసుకువెళ్లి, బలవంతంగా కారు ఎక్కించి జనగామకు తరలించారు. దీంతో, ఉద్రిక్తత సద్దుమణిగింది. అనంతరం లబ్ధిదారులకు హడావుడిగా పత్రాలను అందించి కార్యక్రమాన్ని ముగించారు. కాంగ్రెస్ శ్రేణులు విసిరిన రాయి ఓ జర్నలిస్టు కంటికి తగిలింది. కాగా, ఎర్రగుంట తండాలో లాఠీచార్జిపై ఎమ్మెల్సీ కవిత స్పందించారు. 'హామీలు ఎందుకు అమలు చేయడంలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే లాఠీచార్జీ చేయిస్తారా..' అని మండిపడ్డారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జీ పేరిట రక్తాలు వచ్చేట్లు కొట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. బాధ్యులైన పోలీసులపై కఠిన తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గాంధీభవన్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, అసెంబ్లీ ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మనువాదం అమలుకు బీజేపీ యత్నం

» కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు: మహేశ్ గౌడ్

» గాంధీభవన్‌లో గణతంత్ర వేడుకలు

» అసెంబ్లీ ఆవరణలో జెండా ఆవిష్కరించిన స్పీకర్

హైదరాబాద్/ఢిల్లీ/సైదాబాద్/వెల్దుర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి.. దేశంలో కాషాయ అజెండా, మనువాద సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు బీజేపీ యత్నిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మండిపడ్డారు. అందులో భాగంగానే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నిండు పార్లమెంటులో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల నియంత పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, ఒక్క ఇల్లూ కట్టలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాజ్యాంగ బద్ధంగా పాలన చేస్తూ ప్రజల మన్ననలు పొందుతోందని చెప్పారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి, పార్టీ నేతలు వీ హన్మంతరావు, కుసుమ్‌కుమార్, ఎంపీ అనిల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 4 పథకాలు ప్రారంభమైన నేపథ్యంలో గాంధీభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు బాణాసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు, అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ ప్రసాద్ కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఎన్టీఆర్‌భవన్‌లో రాష్ట్ర పార్టీ నేత సామ భూపాల్‌రెడ్డి జాతీయ జెండాను, మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన టీడీపీ జెండాను ఆవిష్కరించారు. జనసేన కార్యాలయంలో వేడుకల్లో జనసేన తెలంగాణ ఇన్‌చార్జి వేమూరి శంకర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ పార్టీ అధ్యక్షుడు రాధారం రాజలింగం పాల్గొన్నారు. డీజీపీ కార్యాలయంలో అదనపు డీజీపీ స్వాతి లక్రా జాతీయ పతాకాన్ని ఎగరేశారు. కేంద్ర హోంమంత్రి పథకాలు పొందిన 17 మంది పోలీసు సిబ్బందిని డీజీపీ జితేందర్ అభినందించారు. చంచల్‌గూడలోని జైళ్ల శాఖ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా జెండాను ఎగరేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోనూ గణతంత్ర వేడుకలు జరిగాయి. శబరి బ్లాక్‌లో రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ జెండాను ఆవిష్కరించారు.

మెనూలో వంటకాల కార్బన్ ఫుట్‌ప్రింట్!

ఆహార రంగంలోనూ చాట్ జీపీటీ తరహా సేవలు

కంప్యూటేషనల్ గ్యాస్ట్రోనమీ పరిశోధకుడు గణేష్



మాట్లాడుతున్న గణేష్ బాగ్లర్

హైదరాబాద్ సిటీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో రెస్టారెంట్ల మెనూ కార్డులో వంటకాల ధరలతో పాటు అవి అందించే క్యాలరీలు, వాటి వల్ల విడుదలయ్యే కాలుష్యం (కార్బన్ ఫుట్‌ప్రింట్) వివరాలు కూడా ఉంటాయని కంప్యూటేషనల్ గ్యాస్ట్రోనమీ పరిశోధకుడు గణేష్ బాగ్లర్ అన్నారు. దీనికి కారణం.. పర్యావరణంపై అవగాహన పెరుగుతుండటం, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాల్సిన అవసరం ఉండడమేనని చెప్పారు. ఇప్పటికే పలు రెస్టారెంట్లు ఆహార వ్యర్థాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. హైదరాబాద్ సాహిత్య మహోత్సవంలో 'ఏఐ యుగంలో ఆహార భవిష్యత్' అంశంపై జరిగిన చర్చలో చెఫ్ రూబీ ఇస్లాంతో కలిసి పాల్గొన్నారు. ఆహారం తయారీతో వాతావరణంలోకి విడుదలయ్యే కార్బన్‌తో పాటు వివిధ అంశాలను డాటా కోణంలో చూసేదే కంప్యూటేషనల్ గ్యాస్ట్రోనమీ అని గణేష్ చెప్పారు. గత పదేళ్లుగా తాము ఈ డాటా సేకరిస్తున్నామని, ప్రస్తుతం తమ వద్ద 73 దేశాల్లోని 2 లక్షలకు పైగా వంటకాల సమాచారం ఉందన్నారు. వంటలో సాయపడేందుకు చాట్ జీపీటీ తరహా టూల్ తీసుకొచ్చామని, తాము రూపొందించిన రెసిపీ డీబీ, ఫ్లేవర్ డీబీ అని గూగుల్‌లో వెతికితే సమాచారం లభిస్తుందని చెప్పారు. ఫ్లేవర్ డీబీతో వ్యాపారవేత్తలుగా మారిన గృహిణిలు ఉన్నారన్నారు. రాటిటూయి అని మరో టూల్ కూడా తీసుకొచ్చామని, దాంతో ఎన్నో రకాల వంటకాలు తయారుచేయవచ్చన్నారు. కాగా, కశ్మీరీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ థియేటర్ ఆర్టిస్ట్ మహరాజ్ కృష్ణ రైనా (ఎంకే రైనా) అన్నారు. కశ్మీర్‌ను వదిలివచ్చి ఇతర ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబాల్లోని పిల్లలు అక్కడి సాహిత్యాన్ని చదివేలా తల్లులు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. కాగా, హైదరాబాద్ సాహిత్య మహోత్సవం ఆదివారం వైభవంగా ముగిసింది. చివరి రోజు సాహిత్యాభిమానులైన యువతరం పెద్ద సంఖ్యలో హాజరైంది. చిత్రలేఖనం, కథలపై నిర్వహించిన వర్క్‌షాప్‌లలో పాల్గొన్నారు.

ఇక్కడ పుట్టిన వారంతా భారతీయులే

» మహాత్మాగాంధీ మనుమడు రాజ్‌మోహన్ గాంధీ



భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ ఈ దేశ పౌరులే అని, వ్యక్తుల పూర్వీకుల మూలాలు ఆధారంగా పౌరసత్వాన్ని నిర్ణయించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ప్రముఖ రచయిత, మహాత్మాగాంధీ మనుమడు రాజ్‌మోహన్ గాంధీ అన్నారు. హైదరాబాద్ సాహితీ మహోత్సవం వ్యవస్థాపకుల్లో ఒకరైన అజయ్‌గాంధీ స్మారకంగా 'రాజ్యాంగ విలువలు-లక్ష్యాలు' అంశంపై ఆదివారం సత్వా నాలెడ్జ్ సిటీలో చర్చాగోష్ఠి జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజ్‌మోహన్ గాంధీ మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పౌరసత్వ హక్కుల గురించి ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మతపరమైన విలువల ఆధారంగా పౌరసత్వాన్ని నిర్ణయించలేమన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.